
# స్మృతికవితలు

తెనుఁగులెంక
తుమ్మలసీతారామమూర్తి



తుమ్మల
కళాపీఠం
గుంటూరు

# స్మృతి కవితలు

తెనుఁగులెంక

**తుమ్మల సీతారామమూర్తి**

సంకలనకర్త

**తుమ్మల శ్రీనివాసమూర్తి**

తెనుఁగులెంక

**తుమ్మల సీతారామమూర్తి**

ప్రథమ ముద్రణ : ఫిబ్రవరి 2008
ప్రతులు : 500
వెల : 10/-

ప్రతులకు :
1. తుమ్మల కళాపీఠము
జె.కె.సి. కళాశాల
గుంటూరు-6
2. తుమ్మల శ్రీనివాసమూర్తి
43- గౌతమపురి కాలని,
ఎఱ్ఱగడ్డ పి.ఒ
హైదరాబాదు-18

ముద్రణ :
రెయిన్‌బో ప్రింట్‌ప్యాక్
అమీర్‌పేట, హైదరాబాద్,
ఫోన్ : 040 - 23731620.

**తెనుఁగులెంక తుమ్మల సీతారామమూర్తి**

జీవితము - కృతులు

**జననము :** 25-12-1901 కావూరు, రేపల్లె తాలూకా, గుంటూరు జిల్లా,

తల్లిదండ్రులు : చెంచమాంబా నారయ్యలు.

**గురువులు :** కావూరి శ్రీరాములుగారు, జాస్తి సుబ్బయ్యగారు, తాడేపల్లి వేంకటప్పయ్యశాస్త్రిగారు, దువ్వూరి వేంకటరమణ శాస్త్రిగారు

**విద్య :** ఉభయభాషాప్రవీణ (ప్రథమశ్రేణి) ఆంధ్రవిశ్వవిద్యాలయము 1930

వృత్తి : సేద్యము, తరువాత అధ్యాపనము, దుగ్గిరాల, బాపట్ల, నిడుబ్రోలు, అప్పికట్ల, మున్నగు చోట్లగల ఉన్నత పాఠశాలలు

**దేశసేవ :** 1920 - 30 వరకు కాంగ్రెసు సేవ; శిక్ష -1922.

**అభిమాన విషయములు :** గ్రామజీవనము, గాంధీతత్వము, సర్వోదయము, ఆంధ్రాభ్యుదయము, భారతీయుల సమగ్రత,ప్రగతి, తిక్కన కవితామార్గము చిన్నయసూరి సిద్ధాంతము.

**కృతులు :** ఆత్మకథ, మహాత్మకథ, అమరజ్యోతి, గాంధీగానము, సర్వోదయగానము, రాష్ట్రగానము, ఉదయగానము, పఱిగపంట, శబల, పైరపంట, సమదర్శి, కదంబకైత, చక్కట్లు, దివ్యజ్యోతి, ఆత్మార్పణము, ధర్మజ్యోతి, ఎక్కట్లు, సందేశసప్తశతి, నేను, నాకథలు, తపస్సిద్ధి, తెనుఁగునీతి, గీతాదర్శము, హనుమాన్ చాలీసా, రామకృష్ణస్మృతి ఇంకనూ కొన్ని శతకములు, నాటకములు, హరికథలు, జంగంకథలు మున్నగునవి.

**సన్మానములు :** 1949 నిడుబ్రోలులో గజారోహణము, గండపెండేరము, కనకాభిషేకము, సువర్ణకంకణము; 1960 లో అఖిలభారత తెలుగురచయితల మహాసభ సత్కారము; 1967 లో ఆంధ్రప్రదేశ్ సాహిత్యఅకాడమీ విశిష్టసభ్యత్వము; 1969లో కేంద్రసాహిత్య అకాడమీ బహుమానము (మహాత్మకథకు); 1969 ఆంధ్రవిశ్వవిద్యాలయము "కళాప్రపూర్ణ". 1985 లో నాగార్జున విశ్వవిద్యాలయము డి.లిట్ బిరుదులతో సత్కారము; 1985లో విశాఖపట్నములో సహస్రపూర్ణచంద్రదర్శన మహూత్సవము; (శ్రీయం. వి.వి.యస్ మూర్తి); మద్రాసులో యల్.వి రామయ్య చారిటీస్ ఘనసన్మానము; 1987లో గుంటూరు, విజయవాడలలో ఘనసన్మానములు.

జయంతి మహూత్సవములు : 1952 నుండి రాష్ట్రమంతటా

బిరుదులు : పండితుల, కవుల దృష్టిలో "అభినవ తిక్కన" తన దృష్టిలో "తెనుఁగులెంక"

మరణము : 21-3-1990 అప్పికట్ల

## రెండు మాటలు

తుమ్మలవారు అనేకమంది వ్యక్తులపై వ్రాసిన స్మృతికవితలన్నిటిని సేకరించి ఒక ప్రత్యేక గ్రంథముగా ప్రచురించబడినది.ఇవి మొక్కుబడిగా (Formality) వ్రాసినవి కావు. ఇవి వారి హృదయస్పందనను తెలియజేయును. ఈ స్మృతికవితలలో ఆయా వ్యక్తుల సుగుణములు, వారి దేశసేవ, సాహితీ సేవ, సంఘసేవ, నిస్స్వార్థజీవితములు తెలుపబడినవి. వీటిలో ఆయా వ్యక్తుల జీవితరేఖాచిత్రములను చూడగలము.

ఇష్టజనవియోగ జనితమగుశోకము స్మృతికవితలకు స్థాయిభావమగును. ఇవి కరుణ రసప్రధానములు; కొన్నిటియందు కరుణ, వీర రసములు కలిసియుండును. ఇష్టజన సంబంధము రెండువిధములుగానుండును. 1. ప్రత్యక్ష సంబంధము 2. పరోక్ష సంబంధము మొదటిది వైయక్తికము. మాతాపితలు, భార్యా పుత్రులు, బంధుమిత్రులు మున్నగు వారితో గల సంబంధము వ్యక్తిగతమైనది, ప్రత్యక్షమైనది. దేశనాయకులు, దాతలు సంఘ సంస్కర్తలు సమాజసేవకులు కవులు మున్నగు వారితో గల సంబంధము పరోక్షమైనది. ప్రాచీన సాహిత్యములోకంటె ఆధునిక సాహిత్యము నందె స్మృతికవితలు అధికము. నిజమునకు స్మృతికవిత ఒక ప్రత్యేక ప్రక్రియగా ఆధునిక యుగమునందె అవతరించినదని చెప్పవచ్చును. ఆంగ్లసాహిత్యమునందు స్మృతికవితను ‘‘ఎలిజి’’ (Elegy) అని అందురు.

తుమ్మలవారి స్మృతికవితలలో పరోక్షములే అధికము పెద్దలపట్లగల భక్తి, పేర్మి, పిన్నలపట్ల గల అనురాగములే ఈకవితలు వ్రాయుటకు గల కారణములు. తుమ్మలవారు ఆయా వ్యక్తులపట్ల సానుభూతితో పాటు తమ భక్తిని, కూర్మిని తెలియజేసి, వారు మనశ్శాంతిని పొందుటయేగాక, పాఠకులకుకూడా ఈ కవితలద్వారా ఓదార్పును కలిగించినారు. ఇవి సందేశాత్మకములైనవి. ఈ గ్రంథములోని మహనీయుల గుణగణములను స్మృతికి తెచ్చుకొనుట లోకకళ్యాణ హేతువు కాగలదు అని పెద్దలమాట.

ఇట్లు

సంకలనకర్త : తుమ్మల శ్రీనివాసమూర్తి



శ్రీ గుంటూరు మురహరిరావు బి.యస్.సి., (ఎజి)
రిటైర్డు జాయింట్ డైరక్టర్ - వ్యవసాయశాఖ
("స్మృతి కవితలు" సంకలన గ్రంథము
వీరికి స్మృతి కానుకగా సమర్పించబడినది.)

## స్మృతికానుక

తుమ్మలవారి ''స్మృతికవితలు'' సంకలనగ్రంథము శ్రీ గుంటూరు మురహరి రావు గారికి స్మృతికానుకగా సమర్పించబడినది. వారు మా బావగారు. వారు కీర్తిశేషులు. వారు గుంటూరు జిల్లాలోని మునిపల్లె గ్రామములో ఒక సామాన్య రైతు కుటుంబం నందు జన్మించి, పాఠశాలా విద్యను నిడుబ్రోలులో, ఉన్నతవిద్యను గుంటూరు, బాపట్లలో శ్రద్ధతో పట్టుదలతో అభ్యసించినారు. వారు బాపట్ల వ్యవసాయ కళాశాలలో డిగ్రీ పట్టమును (B.Sc., Ag.) పొందినారు.

వెంటనే ఉమ్మడి మద్రాసు రాష్ట్రమునందు మధురలో వ్యవసాయ శాఖాధికారిగా ఉద్యోగమునందు చేరినారు. తదుపరి వారు ఆంధ్రప్రాంతమునకు బదిలీ అయినారు. వారు అనేక ప్రాంతములలో ఉద్యోగ వబాధ్యతలను నిర్వహించి రైతులకు చక్కని సలహాలను యిచ్చి అధిక దిగుబడులకు సహకరించినారు. వారు ఎక్కువకాలము హైదరాబాదులోనే రాజేంద్రనగర్‌లోగల విత్తన పరిశోధనా కేంద్రమునందు పనిచేసినారు. వారు ఉద్యోగ బాధ్యతలను చాలా సమర్థవంతముగా నిర్వహించినారు. ప్రభుత్వము వారి సామర్థ్యమును గుర్తించి అమెరికా మున్నగు దేశములకు వ్యవసాయాభివృద్ధిని గూర్చి తెలుసుకొనుటకు వారిని పంపినది. వారు అనేక ప్రభుత్వ గౌరవములను, ఉన్నతాధికారుల మన్ననలను, సహ ఉద్యోగుల అభిమానములను పొందినారు. వారు జాయింట్ డైరక్టర్‌గా ఉద్యోగ విరమణ చేసి హైదరాబాదులోనే స్థిరపడినారు.

వారు మహాకవి శ్రీ తుమ్మల సీతారామమూర్తిగారి అమ్మాయిని పెండ్లిచేసుకొనినారు. ఆమె పేరు కళ్యాణి. వారి దాంపత్యజీవితము చాలా చక్కగా సాగినది. మహాకవి తుమ్మలవారి అల్లుడినని వారు చాలా గర్వపడుచుండెడివారు. వారు గుణమణులు వారు నిరాడంబరులు, మితభాషులు, మృదుభాషులు. వారు సాహితీ ప్రియులు కూడ. తుమ్మలవారి యుగకవిత, యుగవాణి సంకలన గ్రంథములను వారుప్రచురించినారు. వారికి పెద్దలపట్ల గౌరవము, పిన్నలపట్ల అనురాగము, బంధుమిత్రులపట్ల అభిమానము కలవు. వారు తమ శ్రీమతితో కలసి విదేశ దేశములోని అనేక చారిత్రక, ప్రకృతి సౌందర్యాలుగల ప్రదేశములను చూసినారు. వాటిలో ముఖ్యమైనది సింగపూర్, కాశ్మీర్, ఢిల్లీ, జైపూర్, హంపి అజంతా, ఎల్లోరా మున్నగునవి ముఖ్యమైనవి. ఇంకను తిరుపతి, కంచి, భద్రాచలం, శ్రీశైలం, యాదగిరి మున్నగు పుణ్యక్షేత్రములను దర్శించినారు. అంతేగాక వారు నాగార్జునా సాగర్, తుంగభద్రా ఆనకట్ట (బళ్ళారి) మున్నగు వాటినికూడా సందర్శించినారు.

వారు తమ ఆరోగ్యమును కాపాడుకొనుటకు యోగాభ్యాసము చేయుచుండెడివారు. వారికి ఆధ్యాత్మిక చింతన కూడ కలదు. వారు వేదాంత గ్రంథములను చదువుచు వేదాంత సభలకు వెళ్లుచుండెడివారు. మాఅక్కగారే ఈ గ్రంథ ప్రచురణ బాధ్యతను స్వీకరించినారు.

## ప్రశంస

2001 డిసెంబరులో తెనుగులెంక శ్రీతుమ్మలసీతారామమూర్తి శతజయంతి సభలను డా॥ కొండబోలు బసవపున్నయ్యగారి అధ్యక్షతన ఏర్పడిన తుమ్మల శతజయంతి సంఘము చాలా వైభముగా నిర్వహించినది. అంతే గాక జాతీయకవితామూర్తి సీతారామమూర్తిగారి రచనలన్నింటిని నాలుగు సంపుటములుగా ప్రచురించుటయే గాక, ఒక అమూల్యమైన సావనీర్‌ను కూడా ముద్రించినది. ఇంకను డా॥ కొండబోలు బసవపున్నయ్యగారి అధ్యక్షతన తుమ్మల కళాపీఠము నెలకొల్పబడినది. ప్రతి సంవత్సరము తుమ్మల వారి జయంతి, వర్ధంతి సభలు నిర్వహించబడుచున్నవి. అంతేగాక ఉత్తమ రచయితలను ''తుమ్మల సాహిత్యపురస్కారము''తో సన్మానించుకొంటున్నది. 2003లో శ్రీ మన్నవ గిరిధరరావు గారికి, 2004లో శ్రీ నాగళ్ళ గురుప్రసాదరావు గారికి, 2005లో శ్రీ గుండవరపు లక్ష్మీనారాయణ గారికి, 2006 లో శ్రీ యార్లగడ్డ వేంకటసుబ్బారావు గారికి, 2007లో శ్రీ కసిరెడ్డి వెంకటరెడ్డి గారికి తుమ్మల సాహిత్య పురస్కారములను అందించి, సన్మానించినది.

తుమ్మల వారి పెద్దబ్బాయి శ్రీ శ్రీనివాసమూర్తి విషయ ప్రధానముగా మహాకవి పద్యరత్నములను సేకరించి తుమ్మల కళాపీఠము ద్వారా ప్రచురించి ఆంధ్రపాఠకలోకమునకు అందించుచున్నారు. ''ఆంధ్రప్రశస్తిని'' చరిత్రకారులు, బహుభాషావేత్తలు, కీర్తిశేషులు పులిచెర్ల సుబ్బారావుగారి జ్ఞాపకార్థముగా; ''పండుగ కవితలు''ను ప్రముఖవాణిజ్యవేత్తలు, విద్యా పోషకులు శ్రీ పోలిశెట్టి ఏకనాథ గుప్తగారికి ఉడుగరగా, ''తెనుగుతీపి''ని ఆదర్శవైద్యులు డా॥ ముద్దన హనుమంతరావుగారికి కృతజ్ఞతా కానుకగా; ''కథాకవిత్వమును'' వారి తల్లి గారైన అన్నపూర్ణమ్మ గారికి కృతజ్ఞతా కానుకగా సమర్పించినారు. '' సుకవిస్తుతి'' అను గ్రంథమును ప్రముఖ ఆడిటర్ సాహితీప్రియులు పోషకులు అయిన శ్రీపాలడుగు లక్ష్మణరావుగారికి కృతజ్ఞతా కానుకగా సమర్పించినారు. నేడు ''స్మృతికవితలు'' అను ఈ సంకలన గ్రంథమును వారి బావగారైన శ్రీ గుంటూరు మురహరిరావుగారికి స్మృతికానుకగా సమర్పించుట సముచితముగా నున్నది. ఈ సంకలనగ్రంథము తుమ్మలవారికి ఆయా వ్యక్తుల పట్ల గల హృదయస్పందనను తెలియజేయుచున్నది.

సర్వధారి ఉగాది
2008

డా॥ పులిచెర్ల సాంబశివరావు
కార్యదర్శి
తుమ్మల కళాపీఠము, గుంటూరు

## కృత్యాది

ఎవ్వనికొల్వు భద్రముల కెల్ల నిదాన, ముదారతామయుం
డెవ్వఁడు, సర్వలోకముల నేలు మహఃపరిపూర్ణమూర్తిమై
నెవ్వఁడు వాఙ్మనఃక్రియల కేర్పడరాని మహాత్ముఁ,డాద్యుఁడై
యెవ్వఁ డెసంగు, సత్యమన నెవ్వఁడు, వాని భజింతు నిశ్చలున్

రాశీభూతము లర్థముల్ తురగముల్ రాజ్యమ్ము లూర్జమ్ము లే
యేశక్తుల్ తనకుండుఁగాక పురుషుం డెవ్వాఁడు రాణించు నీ
యాశీర్వాదము లేనినాఁడు భవదీయాభ్యర్చనా సత్క్రియా
వైశారద్యము రానినాఁడు కవితావాణీరతీ! భారతీ!

నా చిన్నప్పటినుండి నిన్గొలుచుచున్ నానాఁడు నీసేవలో
ధీ చైతన్యమునంది, డెందమెటు లుద్రేకించి నర్తించు న
వ్వీచీ నాదమునన్ శ్రుతిన్గలిపి దేవీ! యాడితిం బాడితిన్
బ్రాచీనాధునికాంధ్రవాఙ్మయమహాపాథోధిలో నీఁదుచున్

రూకలతీపిలో మనుజరూపముగన్న నిశాటు, నుగ్రద
ర్వీకరు, లోకమాన్యపదవీచ్యుతు నెన్నఁడు మెచ్చలేద! య
ఙ్టాఁకలకోడి మైలవడినట్టిపదమ్ముల నంటలేద! త
ల్లీ! కరుణించి నీవిడిన యెల్లయు మల్లియవోలెఁ బెంచితిన్

పద్యంబు సర్వకవితల, కాద్యంబై గానబద్ధమై, శ్రుతిహితమై
హృద్యంబై, నియతం బన, వద్యంబై, లెస్స తోడువడు ధారణకున్.

గణ యతి ప్రాస విధులు కారణము గాఁగఁ కవి తలంపని పెక్కుచక్కనలు వచ్చి
పద్య మలరించు సాహితీప్రౌఢమతుల, ధారణకు నిల్చు హృద్య ముదాత్త మగుట.

తెనుఁగునోరు వలయు, తిన్నని వాక్యంబు-గూర్చు నేర్పువలయు, గుణవిధేయ
మానసంబు వలయు మనకవికి సమాజ-దృష్టి వలయు, యోగపుష్టి వలయు

కృతి రచించు లోకహితమెంచి కవిమౌళి-త్రచ్చి బుధుఁడు చాటు దానిసొగసు
ప్రాను విరినిగాంచు, మారుత మద్దాని-వలపు నెల్లదెసల నలముకొల్పు

రాష్ట్రసిద్ధికొఱకు రక్తమ్ముగార్చిన-కవిని నేను గాంధికవిని నేను
బడలిబడలి తల్లిబాస కూడెముసేయు-కవిని నేను దేశకవిని నేను

అల నన్నయ్యకు లేరు, తిక్కనకుఁగా కాంధ్రప్రజానీక హృ
జ్జల జోన్మీలనకృత్ ప్రభాకరవిభాసంకాశ సాధూక్తిమం
జుల పుంభావసరస్వతుల్ గుణగరిష్ఠుల్ భావుకుల్ భక్తు ల
స్ఖలితస్ఫారయశోమహూధవళి తాశాసానువుల్ మాదృశుల్

కల్లకసటులేనిపల్లెలో నాఁగలి-దున్నువారు నన్ను గన్నవారు
మడికి నొక్కపూఁట బడి కొక్కపూఁటగా-దాఁటినాఁడఁ జిన్నతనము నేను

పెక్కుబాసల కెగఁబడి యొక్కనుడియు- రాని దుర్గతి కలవాఁడఁగాను నేను
నేర్చినయొకండు గట్టిగా నేర్చినాఁడఁ- గూర్చినరవంత తిన్నగాఁ గూర్చినాఁడ

ప్రాఁతదన్నది సర్వంబు రోఁతగాదు- క్రొత్తదన్నది సర్వంబు గుణముగాదు
ప్రాఁతక్రొత్తలలో మేలిరీతు లెఱిఁగి- చేయవలయును సాహితీసృష్టి సుకవి

నేలవిడిచి సాముసెఱపిన యట్లుండు-సంఘగతికి దవ్వుసాగివ్రాత
యుక్తిచణతగాదు యుగలక్షణము గుబా-ళింపవలయుఁగావ్యలేఖనమున

కృతిని జీవగఱ్ఱగతి నుపదేశమ్ము-కుదురుకొనుట మేటిగుణముగాన
జాతి కుపకరించు సందేశమును గళా-న్వితముగా వచించు వితము నాది

గిఱిగీచుకొన్నకవి కృతి-చిరకాలము నిల్వ;దెల్లసిద్ధాంతములన్
దరియించి విప్లవముదెస-కరిగినకృతి సత్యదర్శియై రాణించున్

గాంధికంటె వినోయోగికంటె నధికుఁ-డుండునా విప్లవవిధాతృమండలమున
నేతదీయాశయాళిగా కేది కవిత-కస్మదీయకు నాలంబ మన్నలార!

కళకొఱకేకవిత్వమని గంతులువేయక రోఁతరోఁతగా
వలపులునింపి కబ్బములువ్రాయక విశ్వజనీనబోద్ధృతా
లలిత ముదారవృత్తము కలాకమనీయము సంస్కృతిప్రభా
మిళితమునైన సృష్టి నెదమెచ్చితి జాతికిఁగాన్కలిచ్చితిన్

ఎవ్వ రెంద ఱెంతదవ్వైన నేను భా-షా విపర్యయమ్ము సైఁపలేను
సాధుశీల మాభిజాత్యమ్ము చెలువమ్ము-ననసి మెఱయువనిత నాదు కవిత

నేర్మిలేనివారు నేఁటిపాఠకులని-దారిదప్పి కవులు జాఱరాదు
త్రాడు చాలదన్నతలఁపుతో బావిని-బూడ్చువారు లగ్గు పొందలేరు

చదువులేనివారిమది కందవలెనన్న-యూహతోడ మేరలుత్తరించి
వ్రాయుచుందుమనెడివారి కైత నిరక్ష-రాస్యమైనజనత కర్థమగునే?
బాసలోఁతు లంతుపట్టినప్రాజ్ఞుఁడే-పాత్రభేద మెఱిఁగి పల్కఁగలఁడు
కఠిన మృదుల వాఙ్మికాయమెల్లను వాని-యిచ్చననుసరించి యెడఁదఁగదలు

ఎంతలోపడ్డ గీర్వాణమేని తెనుఁగుఁ-గబ్బమున బెత్తనముసేయఁగాదు గాని
యెంతదవ్వైన తెనుఁగుఁబల్కేని యగ్గ-లించి మనకైతలో రవళింపవచ్చు

బాసవేఱు పలుకుబడివేఱు కారక-రీతివేఱు వాక్యసృష్టివేఱు
తీరు తెన్నువేఱు తెనుఁగున; కిదియును-బడలి నేర్వకున్నఁ బట్టువడదు

నాచెప్పెడి కబ్బమునన్-బైచేయిగనుండుఁ దెనుఁగుఁబ; ల్కది శౌచ
శ్రీ చిక్కణమై పున్నమ- పూచినజాబిల్లివెలుఁగు పొలుపుందెలుపున్

భావవిప్లవమ్ము పచరించుకవి శాబ్ద-విప్లవమున కంగవింపఁడేని
గెలువఁడని బిభీషికలుకొట్టువారు నా-సృష్టిఁజూచి యేమి సెప్పఁగలరొ!

ఈ మేనెంత నలంగిన-నామనుగడ లోకసేవనమ్మున కిడెదన్
సామాజికకల్యాణము- కామించెద నవ్యభవ్యకవితాసృష్టిన్

మచ్చమసకలేని మనుగడ నర్థించి-మలఁగినాఁడ వెతల నలఁగినాఁడఁ
బ్రజకు నింపు నింపు ప్రన్ననికబ్బముల్-వ్రాసినాఁడఁ గీర్తి మోసినాఁడ

కాసులకు నాసచేయక-వ్రాసినకబ్బములనెల్ల వరణీయకథా
భాసురులకు నర్పించితి-నా సుకృతమ్ములు ఫలించినవిలే యనుచున్

అంచితులైనవారు కొనియాడిరి, బంగరుపూలజల్లులో
ముంచిరి, గండపెండియరమున్ ఘటియించిరి, యేన్గుమీఁద నె

క్కించిరి, హైమకంకణము నిచ్చిరి, వేలకొలందికానుకల్
నించిరి, యేవలభ్యములు నీకృప గల్గినయట్టివారికిన్

నను దిద్దెను, నను మెచ్చెను
ననుఁ బ్రాణమువోలెఁజూచె, నావైభవమే
తనవైభవమని పొంగెను
దెనుఁగుజగం;బీ ఋణమ్ము దీర్పంగలనా!

**ఆకాంక్ష**

ఎట్టి కఠోరదీక్షలు సహించితినో తొలుబామునందు, నీ
కెట్టిదళంబు లెట్టివిరులిచ్చి నమస్య లొనర్చినాడనో
పుట్టితి నీసుతుండనయి పోఁడిమిగంటిని తల్లి! వీనికిన్
బెట్టుము భిక్ష నీ యనుఁగుబిడ్డఁడుగా నెపుడున్ జనింపఁగన్

నీ రమణీయమూర్తి కమనీయవచస్స్ఫురణంబు దాతృతా
గౌరవ మద్వితీయరసికత్వవిభూతి విశిష్టశౌర్య వి
ద్యారుచిరత్వ మెంత కొనియాడిన మత్కవితాపిపాస చ
ల్లాఱ దదేమి తల్లి! యిది యాఱక మాఱక యిట్లె నిల్చుతన్

నాకే కాదు భవచ్చరిత్రము లనన్యప్రాప్యధారా రస
శ్రీకంద మ్మన నందగించు కవితన్ చిత్రించు భాగ్యంబు ను
ద్రేకస్ఫూర్తియు నస్మదీయమగు పుత్రీపుత్రకశ్రేణి కీ
వాకల్పాంత మనుగ్రహింపఁగదవమ్మా! ఆంధ్రవీరప్రసూ!

## విషయసూచిక


| శ్రీయుతులు | పేజి |
|---|---|
| 1. రాజా వేంకటాద్రినాయుడు | 1 |
| 2. మిత్రస్మృతి | 2 |
| 3. చిత్తరంజన్‌దాసు | 7 |
| 4. ఆంధ్రరత్నము | 8 |
| 5. మోతీలాల్ నెహ్రూ | 9 |
| 6. కస్తూరి బాయి | 10 |
| 7. పితృస్మృతి | 13 |
| 8. సతీస్మృతి | 15 |
| 9. మాతృస్మృతి | 17 |
| 10. కాశీనాథుని నాగేశ్వరరావు | 18 |
| 11. త్రిపురనేని రామస్వామిచౌదరి | 19 |
| 12. జవ్వాజి వేంకటరామశాస్త్రి | 20 |
| 13. నేతాజి సుభాష్‌చంద్రబోస్ | 21 |
| 14. మహాత్మాగాంధి | 24 |
| 15. ఏటుకూరి వేంకటనరసయ్య | 38 |
| 16. పొట్టిశ్రీరాములు | 39 |
| 17. యార్లగడ్డ రామనాథబాబు | 41 |
| 18. జాగర్లమూడి కుప్పుసామి | 42 |
| 19. వేపా కృష్ణమూర్తి | 45 |
| 20. జవ్వాది లక్ష్మయనాయుడు | 47 |
| 21. కాటూరి వేంకటేశ్వరరావు | 47 |
| 22. గద్దె లింగయ్య | 49 |
| 23. శొంఠి రామమూర్తి | 49 |
| 24. గొల్లపూడి సీతారామశాస్త్రి | 50 |
| 25. ముళ్ళపూడి నరేంద్రుడు | 53 |
| 26. వేలూరి శివరామశాస్త్రి | 55 |
| 27. జాస్తి వేంకటనరసయ్య | 56 |
| 28. క్రొత్త రాజబాబయ్య | 62 |

శ్రీయుతులు | పేజి


| శ్రీయుతులు | పేజి |
|---|---|
| 29. అల్లూరి సీతారామరాజు | 62 |
| 30. కన్నెగంటి హనుమంతు | 66 |
| 31. లాల్‌బహద్దర్ శాస్త్రి | 69 |
| 32. బోడేపూడి వేంకటరావు | 79 |
| 33. మార్టిన్ లోథర్‌కింగ్ | 83 |
| 34. క్రొత్త భావయ్య | 85 |
| 35. దేవులపల్లి కృష్ణశాస్త్రి | 86 |
| 36. క్రొత్త సత్యనారాయణ | 87 |
| 37. భారతీదేవి రంగా | 88 |
| 38. కావూరి వెంకయ్య (పల్నాటి గాంధి) | 90 |
| 39. జయప్రకాశ్ నారాయణ | 92 |
| 40. గుళ్ళపల్లి పున్నయ్యశాస్త్రి | 93 |
| 41. తెన్నేటి విశ్వనాధము | 94 |
| 42. గోగినేని లక్ష్మీనారాయణ | 94 |
| 43. ఆచంట నాగయ్య | 95 |
| 44. వినోబాభావే | 96 |
| 45. అయ్యదేవర కాళేశ్వరరావు | 101 |
| 46. కాట్రగడ్డ అనసూయ | 101 |
| 47. శ్రీశ్రీ | 103 |
| 48. ఇందిరాగాంధి | 104 |
| 49. జాగర్లమూడి శివరామప్రసాదు | 105 |
| 50. నార్ల వేంకటేశ్వరరావు | 105 |
| 51. ఆకురాతి చలమయ్య | 106 |
| 52. వేదాంతం జగన్నాథాచార్యులు | 107 |
| 53. జనాబ్ గౌస్‌బేగ్ | 108 |
| 54. జాగర్లమూడి చంద్రమౌళి | 111 |
| 55. అనుబంధము | 112 |

(తుమ్మలవారి మృతిపై వివిధ కవుల స్మృతికవితలు)

## రాజాశ్రీవాసిరెడ్డి. వేంకటాద్రినాయుడు

శ్రీమత్క్రమకులాబ్ధిచంద్ర! గుణరాశీ! వేంకటాద్రీంద్ర సం
గ్రామోర్వీ సురరాట్కుమార! నగధీరా! సుందరాకార! నా
నామాణిక్యవిరాజమానమకుటాంచన్మస్తకా! కోవిద
స్తోమస్తుత్యచరిత్ర! దీనజనబంధూ! రాజకంఠీరవా!

అరయఁగ నీవు జాముతడ వర్థుల కిచ్చుధనంబుతోడ నీ
ధరఁగల రాజు లందఱును దా మొకవత్సర మాశ్రితాళికిన్
గరుణనొసంగు విత్తమయినన్ సరివచ్చునె? జగ్గధారుణీ
శ్వరతనయా! దయానిలయ! సర్వధరాధిప! లోకభూషణా!

ఎంత తపం బొనర్చెనొ భళీ! యమరావతిపట్టణంబు భూ
కాంతవరేణ్య! మీ రచటఁగాపురముండగ నాంధ్రదేశ మెం
తెంత తపం బొనర్చెనొ? తదీశుఁడవై వెలయంగ నీవు ధీ
మంత! కళానిశాంత! గుణమండన! శాత్రవలోకభంజనా!

తనయెత్తు బంగారు త్రాసునందున దూఁచి
        బ్రాహ్మణోత్తములకుఁ బంచిపెట్టె
నన్న ప్రదానంబు ననుదినంబును కోటి
        ధారుణీసురులకు దయ నొనర్చె
అగ్రవర్ణుల కిచ్చె నగ్రహారశతంబు
        నతివేడ్కతో గోరినట్టిచోట్ల
మించినభక్తి గట్టించెను శివకేశ
        వాలయంబు లనేక మవనిలోన
సేతుశీతాద్రి మధ్యధాత్రీ తలమునఁ
దనకు సరియనఁగా దగుదాత లే డ
టంచు బేరందె నఖిలజనాళిచేత
వీరుఁడౌ వేంకటాద్రి పృధ్వీవరుండు.

సంస్కృతాంధ్రాదిభాషలలోన మిక్కిలి
        పాండిత్యవిభవంబుఁ బడసి మించి
కవిపోషణంబందు ఘనుఁడైన కృష్ణరా

యల కన్న మిన్నయన్ ఖ్యాతినంది
దేవిభాగవతాది దివ్యకావ్యంబులఁ
గృతినంది సాటిభూపతులు మెచ్చ
పండితకవికోటివలన "నద్యతన భో
జ" సమాఖ్య బిరుదరాజంబునంది
తోటిరాజులలో నెల్ల మేటి వగుచు
వాసిగాంచితివయ్య! శ్రీవాసిరెడ్డి
వేంకటాద్రి మహీపతి! విమలకీర్తి!
కవిజనస్తుతనామ! సంగ్రామభీమ!

(1921 - దివ్యజ్యోతి)

**మిత్ర స్మృతి (శ్రీ రామకృష్ణశర్మ)**

(నా ప్రాణమిత్రుఁడగు బ్రహ్మశ్రీ రావూరు రామకృష్ణశర్మగా రస్తమించుటచే మిత్రమరణసంజనిత దు:ఖాతిరేకమున నీ చిన్నపొత్తమును నూరు పద్యములతో వ్రాసినాఁడ. దు:ఖదశలో రచియించిన యీ కైతయందు దోషములుండుట యందాశ్చర్యము లేదు -- తుమ్మల). ఈ గ్రంథమునందలి కొన్ని పద్యములు మాత్రమే ప్రచురించబడినవి.

కటకట! పల్లపట్ల యను గ్రామమునన్ బనిమీఁద నుండఁగన్,
బటుతరమైన యయ్యశనిపాతము భంగి మదీయకర్ణసం
పుటములయందు దాఁకె హితపుంగవ! నీ మరణంపువార్త, యెం
తటి కుటిలాత్ముఁడయ్యెను విధాత నిజాన్వయరాగహీనుఁడై.

ఇరువదితొమ్మిదేండ్ల వయసింకను నిండకమున్నె, దేవతా
పురవరనందనోపవన భూరుహమంజులతాయుతాలయాం
తర చిరగంధ దివ్యసుమతల్ప నివాసవిలాసలాలసా
పరమతి నేగినాఁడ విది పాడియె నీకు ననుంగు మిత్రమా!

చెవులం దాఁకెడు కన్నుం
గవయును, మోకాళ్ళనంటగల చేతులు, నీ
నవమన్మథాకృతియు, మి
త్రవరేణ్యా! మాకు మఱవదఱమే? చెపుమా!

అన్నము నీరు లేక, గహనాంతరమందున నెండవానలం
దెన్నఁగరాని కష్టముల నెల్లభరించి తపం బొనర్చినన్,
సన్నుతశీల! మద్హృదయసారసఖేలన! రామకృష్ణ! నా
కన్నుల జూచు భాగ్యమికఁ గల్గునొకో నినుఁబోలు మిత్రునిన్.

ఊరికిబోవువేళఁ దమ యొద్దకు వచ్చి, శరీరసౌఖ్య మే
తీరుననుండె నం చడిగితిన్, భయమేమియురాదటంచు లో
నారసి, యంతటన్ జనితి, నక్కట! నాటినిశీథమందె ని
ష్కారుణికుండు లాగెఁ గద కాలుఁడు నీదగు ప్రాణవాయువున్.

నెయ్యఁపు సంగడీడ నిను నే నెడబాసిన నాఁటిరేయికిన్
జయ్యన ముత్తిపల్లి చని, సాపడి, మద్గురు బంధు గేహమం
దొయ్యన సుప్తతంబడసి యూరిజనంబులు దద్దరిల్లు న
“ట్లయ్యో” యటంచుఁ గేకనిడి యంతట మేల్కొని సంశయంబునన్

ఈ కల యేలవచ్చె? నిటు లేడ్చుచు గెవ్వనగేక వేయఁగా
నే కత?మంచు, శేషనిశియెల్ల విచారముఁ జేసి చేసి, య
వ్వేకువలేచి, కేశవుని వేఁడుచు, నప్పలపట్లఁ జేర, నీ
భీకరవార్త వచ్చె, విని, పెన్వగ నేలనుగూలి సోలితిన్.

ప్రళయకాలాంధకారంబు పగిది దిశల
గారుచీఁకట్లు నే డేల గ్రమ్మెనయ్య!
ప్రకృతి యంతయు భీకరవికృతిఁదాల్చె
నక్కటా! రామకృష్ణ! నీ వస్తమింప.

దోసకారుల కెంతయుఁ దోడుపడును
పుణ్యమూర్తుల కాపదల్ బొందఁ జేయు
నెపుడు దైవం బనుచుఁ బెద్ద లెఱుఁక జేయు
చుందు రయ్యది తప్పనే? యూహసేయ.

అక్కట! కావూరులోన దేహంబు విడచి
పరమునకుఁ బోవుచు, నృత్తిపల్లి నన్ను

నిద్దురను లేఁపి, చనుచుంటి నేస్తకాఁడ!
దిగులుఁబడఁబోకు మని చెప్పితివె? మహాత్మ?

బోనముఁ బానము న్మరచి, పోయిన కార్యముమాని, తద్దినం
బే నెటు లెట్టులో గడపి, యేడ్చుచు, నమ్మఱునాఁటి కింటికిన్
రా నకటా! శ్మశానమున రాశియొనర్చియు నీదు బూది, దీ
నాననుఁడైన నీజనకుఁ డావలఁ బోయుచునుండె నక్కటా!

బోరన నీశరీరమును బూడిదఁ జేసిన రుద్రభూమిపై
జోరున నశ్రుతోయములు జొబ్బిలి కాల్వలుగట్ట రామకృ
ష్ణా! రమణీయరూప! హితసత్తమ యంచును వెక్కివెక్కి నే
భోరున నేడ్చియేడ్చి వగపున్ దిగమ్రింగితి నెట్టకేలకున్.

జిలిబిలి ముద్దుపల్కులఁ జిన్నతనమాది
నిశ్చలంబగు చెల్మి నిలచినాము
యొకతల్లి గర్భమం దుదయంబు నందిన
వారి చందాన నొప్పారినాము
యెటకుఁబోవలెనన్న నిరువురమును కూడి
పొంగుచుఁ బయనమై పోయినాము
యీవు, నేనను భేద మెంతమాత్రము లేక
నొక సెజ్జమీఁద బన్నుండినాము
అకట! కృష్ణార్జునుల రీతి నమితమైన
స్నేహభావంబుతో విరాజిల్లినాము
యింతలో నిట్టులగు నటం చెఱుఁగనైతి
గటకటా! యెంత మోసంబు గల్గె సఖుఁడ!

అనుఁగుఁ జెలికాండ్ర మగు మన కప్పుడప్పు
డెట్టి పగవచ్చినను వెంటనే నశించె
ప్రాయమం దలరారు దంపతుల ప్రణయ
కలహ మట్టుల, మఱవంగ గలనె నిన్ను.

నెచ్చెలి! నీవు స్వర్గపురిన్ బొడగాంచినదాది యన్న మం
దిచ్చ నశించె, నీటిపయి నేహ్యము గల్గె, నొకింత నిద్రయున్

వచ్చుట మానె, సంతసము వమ్మయిపోయె, బలం బడంగె, నే
పిచ్చియొ పెచ్చుమీరెగద, పిల్చిన బల్కఁగ లేనివాఁడనై.

మెల్లమెల్లన నే గైత నల్లువేళ
వలయునట్టి యమూల్యకావ్యము లొసంగి
యాప్తునకుఁ జేసినావు భాషాభివృద్ధి
శేముషీధుర్య! రావూరు రామకృష్ణ!

హరిచరణాబ్జభక్తి బుధులందఱు మెచ్చిన "నామదేవు" స
చ్చరితము యక్షగానమను శైలిని నే రచియించునప్పు డా
హరికథలోని కీర్తనల కన్నిటికిన్ దగు రాగతాళముల్
కర మనురక్తి నేర్పరచి కబ్బము రాజిలఁ జేసి తీవెగా!

అన్నయగారిఁ జూడవలె నంచుఁ దలంచియు బల్జెపల్లికిన్
గ్రన్నన నేగుదెంచి, పదినా ళ్ళచటన్ నివసించి, మిత్రమా
నిన్నెడఁబాసి యన్నమును నీరును మానితి నంచుఁ గమ్మ నా
సన్నిధి కంపినాఁడ, వది చాలదొకో మన చెల్మిఁ జాటగన్.

చిత్తమందున్న చింత నశించదాయె
మరవవలెనన్న నదియేమొ మఱపురాదు
కన్నులం గట్టిన ట్లెప్డు గానుపింతు
వక్కటా! రామకృష్ణ! మిత్రావతంస!

ఇమ్మహిలోపలన్ జనన మెత్తినవారలకెల్లఁ జావు ని
క్కమ్మగుగాని, నిన్నిటు లకాలపు మృత్యువుపాల్పబెట్టి, యా
యమ్మనుఁ బాసి, బందుగుల నాప్తుల గొందల మందజేసి, ద్రో
హమ్మొనరించు దైవమని, యక్కట! యెన్నఁ డెఱుంగనైతిగా!

ఎంతమందియొ బందుగు లిష్టసఖులు
మేటివైద్యులు గల్గియు మీ మరణము
నడ్డగింప నశక్తులై రక్కటకట!
విధివిధానంబుఁ దప్పింప వీరి వశమె!

అనుపమమైన సద్గుణములన్నియుఁ దాల్చిన యట్టిమీర లొ
య్యనఁ జిరకాలముండెద రటంచుఁ దలంచితిగాని యట్టు లె
య్యనువున మీరలుండగల రార్యజనుల్ "సుకృతీగతాయు" వం
చనియెడు సూక్తి వ్యర్థమగునా?జగతీవలయంబు లోపలన్.

చదువును సంధ్య యుండె, నెఱచక్కదనంబు లభించె, నిమ్మహిన్
సదమలకీర్తి గల్గె, గుణసంపద లబ్బెను, పాడిపంటకున్
గొదువయె లేదు, ధైర్యమున గొండలరాయడ, వాయువొక్కటే
గొదయయిపోయె నీకు సుమకోమలదేహ! తలంచి చూడఁగన్.

లేరే భూసురులెందరో జగతిపై, లేరే మహాపండితుల్,
లేరే దానకళాప్రవీణు లరయన్, లేరే దయాసాగరుల్,
లేరే సూనృతవాక్యపాలురు గడున్, లేరే మహాధార్మికుల్
వా రెవ్వారయినం గడించిరొకొ శుభ్రఖ్యాతి నీ రీతిగన్.

ఉర్విని బెక్కునాళ్ళు నరుఁడున్నను లాభ మదేమి గల్గు, సీ
చర్విత చర్వణంబెగద సంసరణం బఖిలం బటంచు, నో
గర్వవిహీన! నెమ్మదిని గాఢముగాఁ దలపోసి, రోసి, సౌ
పర్వ పురీనివాసమున భ్రాంతి జనించిన దేమి? చెప్పుమా!

అక్కటా! బాల్యమాది వేదాంతశాస్త్ర
పఠన మందున నెంతయో భ్రాంతి నీకుఁ
జూడఁజూడంగ వానిచే సుఖములేదు
దేహి కిహయాత్రయని తోఁచి, దివికిఁ జనితె?

దేవుఁడులేని కోవెలయు, దీపములేని గృహంబు, నవ్య రా
జీవ విహీనమౌ కొలను, శీతమయూఖుఁడులేని రాత్రియున్,
జీవములేని కాయమును, చిల్కలులేని వనంబువోలె, ని
న్నీ విధిఁబాసి యీ పుర మహీనముగా రుచిఁ బాసె నక్కటా!

ప్రాణమిత్రమ సకల సంపదలుగల్గి
గర్వమొక్కింతయైనను గాంచవుగద

తృప్తి లేదాయె నెంత వర్ణింపుచున్న
నరయ నీవంటి చెలికాడు దొరకగలఁడె!

అక్కట! యెంతకాల మిటు హా! యని యేడ్చుచు నున్నగాని, నీ
చక్కదనంపు రూప మొకసారియు నే గనజాల, దీనికై
పొక్కఁగనేల, ధైర్యమును బూని భవద్ధృదయ ప్రశాంతికై
యక్కమలాయతాక్షుహరి నర్చనఁ జేయుచు నుందు నే నిఁకన్.

కన్నులను గాఱు దు:ఖాశ్రుకణములెల్ల
గాల్వలై పాఱఁ దడిసెను కాగితంబు;
కలము గంపించె, మతి చెడె, కండ్లుఁ దిరిగె,
నాపుచున్నాడ నిఁక నీ విలాపకవిత. **(రామకృష్ణ స్మృతి - 1923)**

## దేశబంధు శ్రీ చిత్తరంజనుదాసు

సర్వస్వమును దేశజననిదాస్యము బాప
ధారవోసిన మహాత్యాగమూర్తి
వెదకి పేదల నెల్లవిధుల రక్షణ చేసి
ప్రథితిగాంచిన దీనబాంధవుండు
ద్వంద్వప్రభుత్వ పద్ధతి రూపుమాపఁగా ఁ
బోరి గెల్పొందిన వీరమౌళి
దీక్షతోడ స్వరాజ్యపక్ష సైనికకోటి
నడిపిన వాహినీనాయకుండు
మకుటంబులేనిసమ్రాట్టు కైవడి వంగ
భువిని వెల్గెడి మహాపూరుషుండు
గణుతికెక్కిన భారతకర్మయోగి
యద్వితీయ స్వరాజ్య భోగానురాగి
యక్కటా! వేఁకి వెట్టకుఁ జిక్కి స్రుక్కి
కన్నుమూసెను దాసు లోకము వణంక. (16-6-1925)

పడిపోయె నేఁడు నా కుడిబుజం బని యెంచి
దిగులొందుచుండె గాంధీమహర్షి
నన్నుద్ధరించు నందనుఁడేగె దివికంచుఁ
బలవరించుచునుండె భరతమాత

పతిపోయె నా కింక గతి యెవ్వరని యేడ్వ
సాగె స్వరాజ్యపక్ష ప్రజాళి
యాత్మీయరాష్ట్రసింహము పోయె ననుచుఁ జిం
తించు చుండిరి వంగదేశజనులు
అకట! కలియుగరాధేయుఁడస్తమించె
ననుచు నర్థార్థులెల్లరు నడలుచుండి
రిట్టి దుస్థితి మా కంటఁగట్టిపెట్టి
దేశబంధూ! సుధర్మకై 'తివుట పడితె ('ఆసక్తి)

(22-6-1925- దివ్యజ్యోతి)

**ఆంధ్రరత్నము శ్రీదుగ్గిరాల గోపాలకృష్ణయ్య**

ఆంధ్రగీర్వాణహూణాది సాహిత్య సా
మ్రాజ్యంబు నేలిన రాజరాజు
ప్రాచ్యపాశ్చాత్యసంబంధివేదాంత వా
రథి మథించిన బుధారాధ్యయశుఁడు
బౌద్ధహిందూక్రైస్తవమహమ్మదీయాది
మతమర్మములు గన్న మహితగుణుఁడు
వివిధనాగరికతావిజ్ఞానములఁ బరి
శోధించినట్టి సంశుద్ధమూర్తి
దీక్షవిడువని భారతదేశభక్తుఁ
డిద్ధచరితుండు గోపాలకృష్ణుఁడాంధ్ర
మాతృకాగర్భరత్నంబు మనల విడిచి
దివికిఁ బయనించె ఘోరదుస్థితి ఘటించె.

ఎవ్వాని మధురవాగింద్రియమ్మున మించు
నవరసంబులు చింది నాట్యమాడు
నెవ్వాని మోహనాకృతి గాంచి లోకంబు
మేలు మేలని పొంగి మేను మఱచు
నెవ్వాని పాటవం బెల్లదీవుల యందు
స్వేచ్ఛావిహారంబు సేయుచుండు
నెవ్వాని వాగ్వాద మెంతేని నిశితమై
ప్రతివాది ధీరతాచ్యుతు నొనర్చు

నతఁడు భారతమాతృపాదారవింద
ఘటిత దుర్దాస్యశృంఖలాఖండనోద్ధ
చండ రణరంగ వీరమార్తాండుఁ "డాంధ్ర
రత్న" మిఁక లేఁడె మనకు జీరాలవిభుఁడు.

పిలిచినంతనె తల్లిపిలుపునాలించి "అ
మ్మా! యేమి సెల" వంచు నడుగునాఁడు
మహనీయులగు లోకమాన్యాదుల దలంచి
కంకణంబును గేల గట్టునాఁడు
రాజకీయోద్యోగరాజంబు నల్ప తృ
ణప్రాయముగ విడనాడునాఁడు
తెలుగుసీమలనెల్ల దిలకించి దేశ దు
స్థితులు వర్ణించి బోధించునాఁడు.
కారలోఁ జిక్కి కాలంబు గడపునాఁడు
క్రొత్త చీరాల - పేరాల కూర్చునాఁడు
ఎట్టి దీక్షాబలంబు నిన్నెనసియుండె
నది మముం జేరుఁగాక! వీరాంధ్రమౌళి! (15-6-1928- దివ్యజ్యోతి)

## శ్రీ పండిట్ మోతీలాల్ నెహ్రూ

అకటకటా! మోతీలా
లిఁకలేఁడు, కుశాగ్రబుద్ధి యిఁక లేఁడు, తమ:
ప్రకరము కవ్వించెడు తఱిఁ
బ్రకృష్టతేజమ్ముఁ గురియు రవి లేఁడు యిఁకన్

ఎంత చెట్టఁవొడమె! నీదిట్ట యొకరాజ
రాజువోలె బ్రదికె నీ జగానఁ
బ్రజ్ఞయందు సిరిని విజ్ఞానమున సర్వ
రంగముల నితండు రాజరాజె!

ఇతఁ డుదారదృష్టి నీక్షించు నఖిలంబు
నతినిగూఢ విషయమైనఁ దేల్చు
నాంగిలేయు లితని యనితరాసాదిత
ప్రతిభ నరసి ఱిచ్చపాటు గంద్రు

ఎల్లలేని కలిమి నేలు వాఁడయ్యును
గొరికోరి లేమిఁ గూరె నితఁడు
గాంధి కొలువు సొచ్చి కటుతర వైరాగ్య
మభ్యసించె లోక మబ్రపడఁగ.

ధనము గూర్చెఁగాని తానొక్కడేదాని
ననుభవించు టెఱుఁగఁడాయె నితఁడు
కాంగ్రెసునకు నిచ్చెగద లక్షలకుఁ జాలు
దివ్యభవన మీ వితీర్ణిరతుఁడు.

ఎంతగొప్పదైన నిది జడదానంబ
కద యటంచు నొరుఁడు పెదవి విఱుచు
నని తలంచెనేమొ తనప్రేమ కిల్లైన
తనయునే యొసంగె ధరణి కితఁడు.

తమ సుతులు న్యాయమూర్తులో ధరణినేలు
ప్రెగడలో యౌట కోరని పితరు లెంద
ఱుందురు జగాన? మోతిలా లొకఁడ నేర్చె
నింత యౌదార్య మన్నను వింతగాదు.

ఇతఁడు దివ్యజగతి కేగును గాక కాం
గ్రెసునకే తదాత్మ కొసరి కొసరి
దారిచూపుచుండుఁ దద్విజయాకాంక్షఁ
దత్కుటుంబమందెఁ తనరుచుండు.

చరమక్షణంబువఱ కీ
పురుషుఁడు తలపోసె నాత్మభూమీ శుభమున్
పరతంత్రత నణఁగింపఁగ
దొరలేని విపత్తులందుఁ దోఁగి కృశించెన్. **(మహాత్మకథ)**

**శ్రీమతి కస్తూరిబాయి**

అఖిలప్రపంచ మాన్యత సంతరించిన
గాంధికిల్లాలైన గరితమిన్న

యజుర్వేదేఁడుల నుండి యగ్నిసమ్మితుఁడైన
పతిని మెప్పించిన భవ్యశీల
మతకులభేదముల్ మఱచి మానవజాతి
సేవలో దనివి గాంచిన వెలంది
భారతస్వాతంత్ర్య పరిలబ్ధి కెన్నేని
వెతలు సైరించిన వీరనారి
హైందవసతీసమాజ మహత్త్వమునకు
మొదటిమూదలగా నిల్చుబ్రదుకు నేర్చి
సుకృతముల నేలుకొన్న కస్తూరిబాయి
కటకటా! చెఱసాలలోఁ గన్నుమూసె 22-2-1944

అత్యుదార జీవనాలంబమై గాంధి
జాతికెల్లఁ దండ్రియై తనర్ప
మగని బాట విడని మగువయై కస్తూరి
తల్లి యయ్యె నెంత ధన్యురాలొ!

సోక్రటీసు రామనుజసూరివరులు
శ్రుతులు కలియని యాండ్రతో మతులు వ్రస్సి
పడిన బాధలు లేవుగా బాపుజీకి
సాధుతామూర్తి కస్తూరి చాన యగుట

వెలఁది మొదట మగని విశ్వజనీనత
కొప్పలేక యెదురుసెప్పెఁగాని
విభుని పేర్మి నొక్కవీసముతగ్గించు
టెఱుఁ గదాయె నోర్మిఁ దొఱఁగదాయె

పాతివ్రత్యము, దుష్కృత
భీతియు, హరిభక్తి, యతిథిబృందావన,మీ
నాతి సదా మఱవక హిం
దూ తన్వికి సంతరించెఁ దొలఁగని కీర్తిన్.

మానసిక దుర్బలతలేని మగువ యగుట
దేవికస్తూరి పరువపుం జేవచెడని

వయసుననె బ్రహ్మచర్యజీవనము పూని
వల్లభుని కోర్కితీవకు నల్లువెట్టె.

తీవ్రతరసంస్కరణదృష్టిఁ దిరుగు గాంధి
కెగ్గుసేయంగ నెందఱో యొగ్గు ఱెఱిఁగి
వేయికన్నులతో నాత్మవిభుని యుసుఱు
కాచి కస్తూరి జగమును గాచె నదిర

మాల కన్నమిడియె, మాల యెంగిలి నెత్తెఁ,
గడిగె మాల కాలుమడిప నంటి
కూఁతువోలెఁ బెంచుకొనె మాలపిల్ల  నీ
తల్లిప్రేమమునకు నెల్ల కలదె?

ఎన్నఁదగిన విద్య యీమెకు రాదు, రా
కున్న నెట్టి లోటు కన్న దీమె?
చదువు కతము గాదు సద్గుణమ్ముల కని
యెఱుక పఱిచె మగువ కీ సవిత్రి

స్త్రీ లెందఱో మహాత్ముని
యాలమునన్ దూఁకి పగటి నదలిచిరికదా
మే లిది యొదవుట కమ్మయు
జాల నలంగినది బాపు చాటునఁ జనుచున్

ఇంతిలో వివేక మేర్పడకున్నచోఁ
దాఁకరానితనము తలఁగదన్న
కీలెఱింగి సతినిమేలుకొల్పినది క
స్తూరి కీర్తి కెపుడు నారటిలక

పెక్కుమార్లు చెఱల యిక్కట్లు సైరించె
నబల, ద్రక్కలించె నందు శిలల
ముదుక యగుట బందిబ్రదుకున కీ నాఁడు
తాళలేక తల్లి తల్లడిల్లె

గుండెజబ్బుతోడఁగుమిలి మహాశివ
రాత్రినాఁడు పతికరమ్ములందె
కాయ ముజ్జగించి కస్తూరి గాలిలోఁ
గలసి దివికి బంచె గాంధితావి. (మహాత్మకథ)

**పితృస్మృతి (శ్రీ నారయ్య)**

ఎవ్వఁడు నేనుగా వెలసె, నెవ్వని మన్గడ మేలివెల్గు, లే
నవ్వులతో ననుం బెరసి, నాకుఁ దెనుంగులొనర్చు జాళువా
పువ్వులపూజ లందుకొను భోగము గూర్చె, వినమ్రతారుచుల్
నివ్వటిలన్ భజింతు నతనిన్ గృతసూనృతు నారయాహ్వయున్

నీతి నేర్పె, ధర్మనిరతినేర్పె, నుదార
సరణి నేర్పెఁ జదువు సంధ్యనేర్పె
నేర్పరింప నేది నేర్పఁడు నాకు నా
రయ్య సకలసుగుణరత్నరాశి?

నిత్యసత్యాలాపనియతిపై ననురక్తి
సెందినాఁడు జయంబు నందినాఁడు
పరవిత్త మది తృణప్రాయంబ యని విశ్వ
సించినాఁడు తిరస్కరించినాఁడు
దీనార్థిలోకమ్ముఁ దిలకించి కన్నీరు
కార్చినాఁ డండకుఁ, జేర్చినాఁడు
మొగమోట దిగఁద్రావి తగవుసెప్పెడినేర్పు
గాంచినాఁడు యశంబు పెంచినాఁడు
కష్టమున్ సుఖమున్ దుల్యదృష్టితోడఁ
జూచినాఁ డొకత్రాసులోఁ దూఁచినాఁడు
నాఁడు నేఁడును బుధులు కొండాడు నడత
నివ్వటిల్లిన నారయ్య కెవ్వరీడు.

పేదవాని కితఁడు పెన్నిధి, ధర్మదే
వతకు ముద్దుగూర్చు సుతుఁడితండు,

పరుల విత్తమగుటఁ, బదివీసెలపసిండి
త్రోసినట్టి మేలిమాసి యితఁడు.

నారయ్యదీపమని త
త్కారుణ్యము కతనఁ బెంపుగాంచిన పేదల్
మూరింబోవు కృతజ్ఞత
నౌరా! యొకదివ్య నిడుదు రన్వహ మింటన్

ఓనమాలు రావు, కాని నా తండ్రికి
సాహితీబలమ్ము చాలఁ కలదు
రేల నిరుగుపొరుగు హాలికులకుఁ బురా
ణమ్ము వినుచు నితఁడు నాల్గుగడెలు

చదువకయున్ననేమి, బుధసత్తము లుబ్బఁగ నర్థభావ సం
పద వికసింప భాగవత భారతముల్ వివరించు, హృద్యముల్
తదమల కావ్యపద్యములు ధారణ కగ్గముచేసి వేనవేల్
చదువు నతండు తచ్ఛ్రవణసాహితి దుశ్శక మెట్టివారికిన్

పోతనభాగవతమ్మున
కీతఁడు కడు మురియు; దాని నేఁ జదువంగా
నోతప్రోతమ్ముగఁ దా
శ్రోతలకున్ వక్కణించు సుస్పష్టగతిన్

ఊరిలో నుండినను బొరుగూర నున్న
మాపటఁ బురాణగోష్ఠిని మానఁ డతఁడు;
శబరిచరిత, గజేంద్రమోక్షము, సురారి
సుతునికత లాలకించుచు సొగయు నతఁడు.

కర్మపద్ధతి, జ్ఞానమార్గం బతండు
కా దనఁడు; కాని భక్తియోగమును మెచ్చు;
మాధవప్రేమ కిది ముఖ్యసాధనంబు,
విరతి కిది మూల,మని నిరంతరము నమ్ము.

రేపు మా పతండు శ్రీపతి భజనమ్ము
విడువఁజాలఁ డెన్నియిడుమ లున్న;
విడుచునేని వీతవీర్యుఁడై కొఱగాని
మాసి యగు నశాంతిమగ్నుఁ డగును.

తన భగవన్నుతిలోఁ బో
తన, గోపన కైత లవితరమ్ముగఁ బాడున్;
విని విని నేర్చిన చదువిది;
మనీషిమణు లతని మ్రోల మ్రాన్పడవలయున్.

కెరలి కెరలి హరిని కీర్తించు, చంతలో
మౌని యగును, నవ్వు, మగిడి వగచు,
నతఁడు పరమభాగవతలక్షణమ్ముల
నాఁచికొనియె జవ్వనంబునంద.

గోవించరణసేవా
హేవాక నిరస్త దానవేశ్వరసుతుఁడై
జీవన్ముక్తుండై సుజ
నావళి కతఁడొజ్జబంతియై హవణిల్లెన్

నారయవోని పవిత్రు లు
దారులు పెక్కండ్రు జగతి నబ్బంగలరా!
దూరీకృతసత్యులు దురి
తారంభులు దుగ్ధముఖవిషాబ్ధులు దక్కన్.             25-6-1967

**సతీస్మృతి (తుమ్మలవారి మొదటి భార్య శ్రీమతి రాఘవమ్మ)**

నిండీ నిండని జవ్వనంపుసిరితో నిర్భాగ్యతాపూర్ణమై
పండీపండని కోర్కితీవగమితోఁ బాధస్తరంగాభమై
యుండీయుండని మాయదారి బ్రతు కయ్యో!యేలసాగించి నన్
మండీమండని మొండిఁజేసితి వధర్మంబూని ప్రాణేశ్వరీ!

తరుణీ! నీయనురాగనౌకఁగొని చింతాఘోరవారాశి ని
స్తరణంబున్ ద్రుటిలో ముగించి పరితోషప్రాజ్యసామ్రాజ్య సు

స్థిరపీఠంబు నలంకరింప మది నెంతే నాసగొన్నట్టి నన్
దురవస్థావశుఁ జేసి వీడఁదగునే దోషంబు వాటిల్లదే

పరిశీలించిన యుష్మదీయ మగు లోపం బున్నదే యిందు, దు
ర్భర చింతాహతబుద్ధి నౌట నిను దూఱం జొచ్చితిం గాని యె
వ్వరికేనిన్ దురతిక్రమం బగు విధి వ్యాపార మాపైఁ బురా
దురితం బూరకపోదు శోకహత మెందున్ లోక మోరాఘువా!

నీకు-సాధ్వీవతంసవౌ నీకు-నిర్భ
రాత్మగౌరవసంపూర్ణ వైన నీకు
నిర్మల ప్రేమ చిహ్నమై నివ్వటిల్ల
నంకితమొనర్తు నీకృతి నందు కొమ్మ **ఆత్మార్పణము**

పిన్నతనమునందె నన్ను వీడినరాణి
రాఘవమ్మ కిడితి రమ్యకవన
ఖని నుదాత్తధర్మకలితము "నాత్మార్ప
ణము" ను బ్రణయలక్ష్మణము నొనర్చి

కఱలేని బ్రహ్మచర్యం
బిరువదెనిమిదేండ్లు నే సహించినపిదపన్
సరసకు వచ్చినయిది యొక
శరదన్ ననుఁ బాసె విధివిశంకటతఁ గటా!

తానై యెదియుం గోరని
మానిని యిది, దీని శమ దమ క్షాంతి ధృతి
జ్ఞానములు తత్త్వవిన్మణి
యై నెగడిన తండ్రి సుబ్బయన్ దలఁపించున్

నాకు మేనగోడ లీకొమ్మ, శేషమ్మ
కోరికోరి కన్నకూఁతు రీమె,
మాతృదర్శనేచ్ఛ మది హెచ్చి తెగి యిది
పోయియుండుఁ బుణ్యభువనమునకు.

వెడలుచుంటి సై౦పవే దోస మని పర
భూమి గాఢనిద్రఁ బొందియున్న
నన్ను వేఁడివేఁడి వెన్నెలచీరతో
నేగినట్టి వెలఁది నెట్లు మఱతు 1932

**మాతృస్మృతి (శ్రీమతి. చెంచమాంబ)**

ఆదరబంధురమ్ముగ జొహారిడుదున్, ననుఁగాంచి మంచికిన్
మూదలఁగా మలంచి, జనముల్ పొగడం బులకించి, పాడికిన్
బాదుగ నిల్చినట్టి గుణభద్రకుఁ, బుణ్యశరణ్య, కస్మదీ
యాదిమదైవతమ్మునకు, నక్షరకీర్తికిఁ, జెంచమాంబకున్.

నిన్నుఁజూచి యొడల్ వీడ నున్నదాన
వచ్చితివె తండ్రి! నీ వైభవమ్ము గంటి
గజము నెక్కి యూరేగుట గంటి ధన్య
నని ననున్ నిమిరిన యమ్మ కంజలింతు.

నా నుడిలో నడలోఁ గల
దేని ఋజుత్వమ్ము దానికెల్లను శౌచ
శ్రీనిధి మజ్జనయిత్రి ని
దానం బని యెంతు భక్తితత్పరమతినై

ఇసుమంత యవగడము నా
దెసఁ దోఁచిన నీమె ప్రేమ దిగఁద్రావి ననుం
బసినింబలె గొట్టెను, నా
పసితనముం గనక నీతిపస నెద నిడుచున్.

పున్నెముల కొటారు నన్నపనేని వం
శాబ్ధిసోము లక్ష్మయార్యు తనయ (నిడుబ్రోలు)
చెంచమాంబ వినుతశీల గుణావాల
నారయాఖ్యు నింతియై రహించె.

ఔదార్యం బది చెల్మికత్తెగ, మగం డారాధ్యదైవమ్ముగాఁ,
బేదల్ బిడ్డలుగా, ఋతోక్తి నగగాఁ, బెంపొంది విద్వత్ప్రశం

సౌ ధౌరేయము శాశ్వతం, బుభయవంశఖ్యాతికిన్ దావలం
బై దీపించిన చెంచమాంబ చరితం బాదర్శ మిల్లాంధ్రకున్.

నా తల్లి చెంచమాంబకు
నీ తను విడి నన్ను నాంధ్రి కిచ్చిన కరుణా
మాతకు నివాళిగా నీ
'జ్యోతిన్ వెలిగింతు నమరసూక్తిన్ భక్తిన్ ('గాంధిస్మృతి కవిత 'అమరజ్యోతి')

మఱియు - భర్తృహరినీతిశతకంబు ప్రస్పందనము
చిందు తెల్గున వ్రాసి యిచ్చితిని దల్లి ('తెనుఁగునీతి' అనుకృతి)
కంచితాచారనిధికిఁజెంచమకు లక్ష్మ
యార్య పట్టికి ఋణము కొంతైన దీఱ
నాతల్లి చెంచమాంబకు
నీ తను విడి నాకు లోకహితకవితా వి
ఖ్యాతి ఘటించిన తెనుఁగుం
జోతికి నీకృతి నతి ప్రసూనం బగుతన్!

అయ్యఋణము చేతనైనంతగా నీఁగఁ
బెనఁగినాఁడ నతని పెంపు సెప్పి; ('ధర్మజ్యోతి' కావ్యము వ్రాసి)
తల్లిఋణము కబ్బ మల్లినఁ దీఱునే?
అమ్మ పేర్మి కవిత కగ్గపడునె? (నాకథలు++)

**శ్రీ కాశీనాథుని నాగేశ్వరరావు**

తరలినాఁడా మాతృదాస్యపాశచ్ఛేద
కౌశల్యమును గన్న కర్మయోగి
కానరాఁడా బలి కర్ణ మాంధాతల
విస్మృతికిం దెచ్చు విశ్వదాత
ఏగినాఁడా జగజ్జేగీయమాన సా
హిత్యసామ్రాజ్యంబునేలు బుధుఁడు
పోయినాఁడా దివ్యభూషణమ్ముగ లొసంగి
చదువులమ్మకు సేవ సలుపుబంటు

తెలుఁగువెల్గుల కొఱకు రాత్రిందివమ్ము
రక్తమును ధారవోసిన రాచబిడ్డ
యస్తమించెనె నాగేశ్వరాభిధుండు
దేశమున కెవ్వఁ డీ లోటు తీర్చు నకట!

నెలకొల్పితివి తెలుంగుల వెలుంగులు మిట్టి
పడ నాంధ్రపత్రికా భారతులను
పోషించితి త్రిలింగభూవిరాజదశేష
జాతీయవిద్యానికేతనముల
గౌరవించి తనేక కవిరాజపండిత
కుంజరంబుల నెల్లకోర్కు లొసఁగి
వెలయించితి వమూల్యవిజ్ఞానమయములౌ
కావ్యరాజములఁజొక్కము నటింప
బలియొసంగితి సర్వంబు భరతమాతృ
చరణరాజీవపీఠికాసమ్ముఖమున
ధన్యుఁడవు నీవ సుకృతిమూర్ధన్యమూర్తి!
విశ్వసేవకముఖ్య నాగేశ్వరాఖ్య! (1938 - పఱిగపంట)

**కవిరాజు శ్రీ త్రిపురనేని రామస్వామి చౌదరి**

కావిరి చీఁకటుల్ దశముఖమ్ముల దిక్కుల నావరించె, నాం
ధ్రావలి యాతనాపిహితమై జడమై వెలవెల్లఁ బాఱె, వా
ణీవదనమ్మునందు నొక నెత్తురుచుక్కయుఁ గానరాద క
ల్పావసరంబు తారసిలెనా యిది యేమి విపత్తి చెప్పుఁడీ!

సర్వస్వమును జగజ్జన దాస్యమును బాప
ధారవోసిన మహోదారబుద్ధి
సవనాగ్ని సమ్మితాచ్ఛతర శీలస్ఫూర్తి
నఖిలధాత్రికి నొజ్జయైన గఱువ
పడుచువెన్నెలజల్లు లడరించు కవనంపు
సొంపు లామెత లిచ్చు సుకవిచంద్రుఁ
డాంధ్రప్రసూవైభవాప్తికై ఘనతప
శ్చర్యఁ బాటించు రాజర్షిమౌళి

నిర్నిరుద్ధాశయచ్ఛటానిర్మితాంధ్ర
విశ్వవిప్లవ చైతన్యవిస్తృత ప్ర
థా నిధానుఁడు వీరమార్తాండుఁ డస్త
మించెనా కవిరాజ పీఠాంచితుండు.

అఱువది నిండలేదు, తెలుఁగన్నులకున్ భవదీయకావ్యపుం
గఱ వది తీఱలేదు, మొనకట్టి రచించు చరిత్ర కార్యపుం
బరువది డిందలేదు, చలపట్టి మము న్గికురించి యేటికీ
పరువులు వెట్టితయ్య పొరపడ్డది నీ హృదయంబు సత్కవీ!

చెల్లరె!నీ బహూకృతివిశిష్టత మెచ్చుకవిత్వ మర్థిమై
నల్లిన మా కలమ్ము తడియారకమున్నె విషాదరేఖికా
వేల్లిత చిత్తవృత్తిఁ బలవించుచు మృత్యుకరాళదంష్ట్రికా
మల్లవశున్ నినుం బలుకు మా దురదృష్టము నేమిసెప్పెదన్?

కత్తిపోటును మించిన కలముపోటు
మాటతీపిని గెల్చిన మనసుతీపి
*సంఘరక్తిని మీఱిన జాతిరక్తి *(కులాభిమానము)
నీక చెల్లుఁగదోయి శంబూక సుకవి!

9-2-1942 - పఱిగపంట (మొదటి కూర్పు)

**శ్రీ జవ్వాజి. వేంకటరామశాస్త్రి.**
**(జమీందారు శ్రీ లక్ష్మయ్యనాయుడుగారి కుమారుడు)**

కనుసైగ చేసిన కలికి మేనక కెంత
    సవురున్న నది సంతసానికాదొ
తోడుగోరిన జయంతుఁడు సాధువైనను,
    మిండగానికిఁ దనూజుండు గాఁడొ
గీర్వాణ మెంత నీల్గిన జిల్బిలి తెలుంగు
    నుడి సొంపునకు దిగదుడుపు గాదొ
అమరలోకము నాకమందువా, యగుఁగాక
    విడుపులేని సుఖంబు వెగటు గాదొ
మందార మెంతకమ్మన పంచిపెట్టిన,

జవ్వాది దాని కాశ్రయము  గాదొ
పీయూష మెంతయింపితమైన, నది యావ
కాయయూటకుఁ గ్రింది చేయి  గాదొ
ఏమి బావు కొంటకేగితి వౌగాము
లింత గనక వైజయంతమునకు
వేయి చెప్పవయ్య వేంకటరామయ్య!
శాస్త్రి వయ్యు నీవు ఛాందసుఁడవు

బహిరంతర సుందరతా
మహోనిధి  భవత్కుమారమణి ఫణిదంష్ట్రా
విహర జ్వలనార్చిస్తతి
నిహతించెనె  లక్ష్మణావనీపాలమణీ!

ఎటు లీ శోకము నుక్కఁబట్టెదవు ని న్నే రీతి నోదార్తు  ము
త్కటసౌజన్యవిభాసివై  మనెడు  నీకా యిట్టి దుర్యోగ మీ
కటుకృత్యంబున  కెట్టులోర్చె విధి;  లోకం బెల్ల నీ బంధువౌ
నటు భావించుచు బుద్ధిచెప్పఁగదవయ్యా! కూళ కవ్వానికిన్

(పఱిగపంట - 3-1-1943)

## నేతాజీ సుబాస్ చంద్రబోస్

ప్రాఁతగాథల నిద్రవోయిన
భారతీయుల సమరచండిమ
లోఁతు లోఁతులు చూపి జగముల
లోభపెట్టితివా!

బ్రదుకు బరువై క్రుంగిపోయిన
గతులు కఱవై దెసలు సూచిన
వెతలమున్గిన తల్లికొఱకై
విక్రమించితివా!

మహిషరక్తో రుధిరమేదో
మగ్నకాళీ మాతృరూపము
దహరసీమ ఘటించి ఖడ్గము
దాల్చి నడిచితివా!

జిత్తులన్నిట నందెవైచిన
చేతులే నీయెత్తులోఁబడి
చిత్తుచిత్తై తెల్లవోయిరి
చిన్నవోయిరిగా!

బానిసమ్మునఁ గ్రుళ్ళి కుమిలిన
బ్రదుకుకంటెను జావు మేలని
షానవాజ్ ధిల్లాను సేగాల్
సేన గూర్చితివా!

పొగల పెల్లున సెగల పెంపున
యుగయుగమ్ములు పెరిఁగి పేరిన
పగలు మానిపి హిందు ముస్లిం
బాట దిద్దితివా!

విశ్వభారత వీరకోటికి
శాశ్వత ప్రేమమ్ము గూరిచి
యాశ్వికధ్వజినీ పరంపర
కాజ్ఞ లిచ్చితివా!

రక్తతిలకము దిద్ది భారత
రమణి పౌరుషలక్ష్మియై మన
ముక్తికై నీ కన్నుసన్నల
మోహరించెనఁటే!

కంటగించిన పోటరులు నీ
కంటి యెఱ్ఱన కాఁగఁజాలక
మంటిబొఱ్ఱెలలోన నక్కల
మాడ్కిఁ దూఱిరఁటే!

ఎదురుదొరతన మేర్పరించితి
వెదిరిగుండియ గాలమైతివి
కదరుజెండా యెత్తి యిన్ఫాల్
కదన మూఁపితివా!

చాలుఁ జాలు మహాప్రభూ! మన
సాహసం బొకసారి చాటితి
హేలగా నిఁక సైతు బన్నము
లెన్ని పైకొనినన్!

కట్టుబట్టల నిల్లు వెడలిన
వట్టిమానిసి వీవు, రాజ్యము
లెట్టు గెల్చితి, విన్ని మాయల
నెపుడు నేర్చితివో!

వెక్కిరించిన రథికమండలి
బిక్కమొగమై డిల్లపోవఁగ
నెక్కితివిరా సర్వమానవ
హృదయ పీఠములన్!

జాతి యొకటే లక్ష్య మొకటే
నేఁత యొకఁడే దేశమున కని
నీతి నేరిపి మాకు నాశా
జ్యోతి వైతివిరా!

తారకంబై మమ్ము లేపెను
తావకము "జైహిందు" నాదము
ఘోరవిక్రమ మూని ఢిల్లీ
కోట గెల్తు మిఁకన్!

వీరతాయెతు గట్టినారము
వీరపాణము చేసినారము
లేరు లేరిఁక నడ్డుకోఁగల
వారు మాకెచటన్!

భవ్యభారత మధురమూర్తీ!
దివ్య భారత సవ్యసాచీ!
నవ్య భారత చక్రవర్తీ!
నతులు నీ కివిగో!

పండినది నీకీర్తి మురువై
పాలసంద్రము మీఁది నురువై
నిండినదిరా విశ్వజగతీ
ఖండ ఖండములన్! (పఱిగపంట)

**మహాత్మగాంధి**

మహాత్మగాంధీని 30-01-1948 న గోడ్సే హత్యగావించెను. ఆనాడు కవులు జాతిపితపై స్మృతి కవితలను వ్రాసి తమ అక్షరాంజలులను సమర్పించినారు. మహాత్ముని హత్యావార్త తుమ్మలవారికి చాలా ఆవేదనను, ఆవేశమును కలిగించినది. కవిగారికి మహాత్ముని యందు గలభక్తి, అతని నడవడియందు గల ప్రతిపత్తి, అతని యుపదేశములందు గల ప్రపత్తి-అతివేలము. వారి మాటలలోనే-

శతజన్మార్జిత మామకీన సుకృతస్థానమ్ముగా, నీ జగా
బ్రతుకున్ జాటెడికావ్యమున్ సుకవితా ప్రౌఢమ్ము నిర్మించి నా
బ్రతుకుం ద్రోయఁదలంచుకొంటి మును; పాపం బెద్దియోపండి నీ
మృతిపై నేఁడు కృతిన్ రచించితి మహోర్మింబోని కన్నీటితోన్.

ఆ శోకమునందే తుమ్మలవారు మహాత్ముని మృతిపై “అమరజ్యోతి” అను మధురగంభీరమైన చిన్నస్మృతి కావ్యమును వ్రాసినారు. దీనియందు వారి కవితావేశము వెల్లువగా ప్రవహించినది. దీనిని ధర్మబోధాత్మకకావ్య మనవచ్చును. దీనికి వారి కవితాశిల్పము కావ్యాత్మనిచ్చినది. దీనియందు మహాత్ముని మహనీయ గుణములను, ఆదర్శజీవితమును, మరణమును వివరించి, మహాత్ముని అశాశ్వతమైన శరీరము నశించెనె గాని, అతని శాశ్వతమైన యాత్మ నాశనము కాలేదనియు, అసలు దానికి నాశనము లేదనియు, మహాత్ముడు “లోకలోకములకు వెల్గుజూపు నిరవధికామరజ్యోతి” యని ప్రకటించి, లోకమునకు ఓదార్పు కలిగించుటయే గాక, కవిగారును కొంతయూరట చెందినారు. అంతేగాదు దీనియందు ఆనాటి రాజకీయ అవినీతి, మతమౌఢ్యము కూడ తెలియజేయబడినది. ఇక ఆపద్యములను చదవండి.

**దుర్దినము వచ్చినది (30-01-1948)**

“ఈ సందర్భమున తుమ్మలవారు రసస్ఫూర్తిని కలిగించుటకు ఒకే విధముగానంతమగు పద్యములను వ్రాసినారు. ఇట్టి రచనవలన పాఠకుని ముందుకు వెళ్ళనీయక నిలబెట్టి మహాత్ముని ఘనతను మరల గుర్తునకు దెచ్చి సహృదయుని మనస్సును దు:ఖపూరితముగా జేయును” (రచయిత శ్రీ గొల్లపూడి ప్రకాశరావు)

వచ్చె దర్దినమ్ము వసుధ కహింసా మ
హత్త్వ మెఱుకచేసి యాంగ్లజాతి
బింక మణఁచి తల్లి సంకెలల్ త్రెంచిన
బిరుదు బ్రదుకునందుఁ జరమదినము.

వచ్చె దుర్దినమ్ము వాడివాడి వగర్చు
జాతి కాత్మశక్తి సంతరించి
విశ్వగణ్యమైన విజయమ్ము గూర్చిన
బిరుదు బ్రదుకునందుఁ జరమదినము

వచ్చె దుర్దినమ్ము వగపులో బెదరక
సుఖము నాసచేయ కఖిల వికృతి
దూరుఁడై ప్రసన్నతారూఢమతియైన
బిరుదు బ్రదుకునందుఁ జరమదినము.

**వచనము** : ఆనాటి సాయంత్రము - గాంధి ప్రార్థనాసభ కాయిత్త
పడుచుండె అపుడొక్కరుండు వచ్చి మహాత్మా!

నీతోడ మాటాడవలసి గుజ్జరినేలవా రిద్ద
ఱేతెంచి వాకిట నిల్చియున్నవా రేమందు వనిన
నాతనువునఁ బ్రాణమున్న బ్రార్థనానంతరమంద
చూతు నవ్వారి ననె గురుఁ డుల్కఁగా సూరెలవారు.

వేళతప్పెనన్న వేదన మదిరేఁగ
నింగి నెత్రుడాలు నివ్వటిల్ల
మనుమరాండ్ర మూఁపులను జేతు లానించి
వెడలె జాతిసవిత వేదిక కడకు

రెండు పాయలుగా సభ్యమండలమ్ము
చీలి తెరువునొసంగ దేశికుఁ డెలర్చి
చేతులెత్తి నమస్కృతిచేసె సభకుఁ
గద్దియకుఁ జేర మెట్టుపైఁ గాలుమోపె

**వచనము:-** అపుడు గోడ్సే మహాత్మున కతిసన్నిహితుఁడై జోహారు చేయుటకు వంగినట్లుగా వంగి జేబునందలి పిస్తోలు వెలికి లాగి-

పటపట ముమ్మాఱు ప్రేల్వన్
జటులగతిన్ రెండు గుండ్లు సంయమికుక్షిన్
విటతట మొనర్చి చనె,నొ
క్కటి గుండియలోను సొచ్చి కదలక నిల్చెన్.

మూఁగిన పేదర్మికతనఁ బ్రాఁగోక మూరెఁడు లేక
వేఁగు దీనులఁ గని, కుంది, కుబుసము వీడి మహాత్ముఁ
డేగుండె నెండకు వానకుఁ జలికి నిరవుఁగావించె
నాగుండెపైఁ గాల్చె నతని తమ్ముండ యగ్నిగోళమ్ము

ఈగడ్డవారి నెత్తురును గండల నెమ్ములఁ గుడిచి
వీఁగు నాంగ్లేయుల నెద్రిచి మార్తురు విడిచెడుగుండ్ల
కేగుండె నొడ్డి బాపూ మహీదాస్య మిల్లిగ్గఁజేసె
నాగుండెపైఁ గాల్చె నతని తమ్ముండ యగ్ని గోళమ్ము.

ఏగుండె సూనృతాహింసన తపోర్చు లిన్నినా శ్వోర్చె
నేగుండె దీర్ఘోపవాస భర ముద్వహించుట నేర్చె
నేగుండె విశ్వహార్దమున నార్ద్రత నెనసి జాల్వాఱె
నాగుండెపైఁ గాల్చె నతని తమ్ముండ యగ్నిగోళమ్ము

పలికినట్టి పల్కు బ్రదికినబ్రదుకును
గట్టకడకు సార్థకమ్ము గాఁగ
రామ!రామ! యనుచు రక్తంపుమడువున
గూలె గాంధి మోడ్పుఁ గేలుతోడ (మహాత్మకథ)

**అమరజ్యోతి**

యుగయుగమ్ముల భారతోర్వీతప:పుంజ
మెసరేఁగి జగముల కిడిన పంట
తరతరమ్ములనుండి తరలనిదాస్యమ్ము
కట్లు త్రెంచిన శాంతికదనయోద్ధ

నరనరమ్ముల జీవనజ్యోత్స్నగా నహిం
సను సహించిన యోగిసత్తముండు
పదపదమ్మున సత్య భాషా సనాతన
సౌరభ్యములు చిమ్ము సాధుశీలుఁ
డహరహమ్మును విశ్వకల్యాణలబ్ధి
కొఱకు నాత్మార్పణ మొనర్చుకొను తపస్వి
కూలెనా దుర్మతోన్మాద కుటిలతంత్ర
జుష్టదుష్టచ్ఛటామృత్యుముష్టిహతికి

ఒఱగెన్ విశ్వపతాకలెల్ల వసుధావ్యోమంబు లార్తస్వర
స్ఫురణాకంపిత వీథులయ్యె మిహిరాంశుజ్యోతు లేపారినన్
గఱకుంజీఁకటు లేచి కప్పె దెసలన్ గాకోలకల్పమ్ములై
చరమస్థానము నీవు సేర జగమే స్తంభించె యోగీశ్వరా !

తల్లియుఁ దండ్రియున్ గురుఁడు దాతయు నేతయు నెయ్యతియ్యముల్
చల్లెడిమిత్రుఁడున్ సచివసత్తముఁ డుత్తమబంధు వీశ్వరుం
డెల్లరు లేని దైన్య ముదయించెఁగదా! యిటు లెన్నికల్పముల్
చెల్లునొ మాకు నచ్చతర జీవను లబ్బుటకున్ భవాదృశుల్.

ప్రల్లదుఁ డేచి ప్రేల్చిన తుపాకికి నీ హృదయమ్ము వ్రయ్యలై
వెల్లువకట్టి హస్తిపురవీథుల నీ రుధిరమ్ము పాఱెనా
త్రుళ్ళెడి దుష్టశక్తుల నెదుర్చుట కందలి చుక్కచుక్కకున్
బల్లిదు లిద్ధవీరపరిపాలకు లెందఱు పుట్టివత్తురో !

పూవులతెప్పపైఁ గదలిపోయితివా, యమునాతరంగిణీ
పావనరాజఘట్టమున భౌతికదేహము గాల్చుకొంటివా
నీ వపురస్థి చందనవనీశకలమ్ముల బూదియయ్యెనా
బావురుమంచు నీదు చితి పజ్జల శోకము పొంగెనా ప్రభూ?

బలిసెన్ దావక భూతి మోచు యమునా భాగీరథీ గౌతమీ
బలదా సహ్యసుతా మహేంద్రతనయా భద్రా కవేరాత్మజా

సలిలోర్మిచ్ఛట కీప్సితార్థ సుఖముల్ సంధించుపుణ్యంబు; త
జ్జలసేకంబున భారతక్షితి నహింసాసస్యముల్ పండుతన్!

మందాకినీసరి త్కా
ళిందీ సరస్వతుల నస్థిలేశము కలియన్
హిందూ ముస్లిము క్రైస్తవ
బృందములో నీ మహస్సు పెనఁగొన్నదిరా!

నీ బూదిన్ గొనితెచ్చురైలుఁ గనుచో నేత్రమ్ము లంధమ్ములై
బాబూ! మూర్ఛకుఁ జిక్కినాఁడ మన యీ బంధంబు నేమందువో
నా బాగోగు సమీక్ష చేసికొనుచున్ నాఁడెల్ల వేసారితిన్
నీ బంధుత్వము నాదుభాగ్య మనుకొంటిన్ భక్తినమ్రుండనై

చేసిన సేవయుఁ ద్యాగము
వీసమ యగుఁ గాని కన్నువిచ్చిన పిదపన్
వ్రాసిన దంతయు నీ కథ
నీ సందేశంబ యని వినీతిన్ వినుతున్

రామా! నన్ గురుణించితే పిలిచితే రమ్మంటివే జీవన
స్వామీ! ధన్యుఁడనైతి నంచు భగవత్ సామ్రాజ్యముం జేరితే!
కామాదు ల్విదళించు సామఋషి త్యాగబ్రహ్మకున్ నీ కహో!
సామాన్యంబు ఘటిల్లెనా వరదుఁ డాశాసించు లగ్నంబునన్

కస్తూరి చన్నతఱి నెఱ
కస్తిం బడ, వట్లు నిల్వఁ గారణ మీ వీ
వ్యస్తత కడు నస్థిర మని
యస్తుంకృతి వడసి యుంటయ కద మహాత్మా!

అపవర్గ బాంధవం బదికి లౌకికధర్మ
మాలపించితి నందబాలునట్లు
కనుదిక్కులేక సోలిన మూఁగజీవాల
మూల్గు మాన్పితి శాక్యముని విధాన
సతత క్షమా ప్రేమ శరణమై నరదైత్య

కిల్బిషం బోర్చితి క్రీస్తువోలె
ఆత్మ నిత్యము, దైవ మది యొండె - యని ప్రతి
ష్ఠింపఁజాలితి సోక్రటీసుకరణి
బానిసముద్రేఁగు డించి కింపాకజాతి
కండగా నిల్వఁబడి తద్రహాము పగిది
నద్భుతంబాయె మనుగడయంద కాక
మృతివిధిన్ వీరి ననుసరించెతె మహాత్మ!

నిను రామాదులఁ జేర్చి మెత్తు, రది మన్నింపన్, రిపుగ్రీవముల్
రణరంగమ్మునఁ గోసి రక్తఝరిలో రామాదు లోలాడి రా
పనికిన్ నీకును లేదు పొత్తు, రిపుతన్ బాధించి విద్వేషిపై
నెనరుం జిమ్మెద వీవు చిక్కదు ప్రభూ! నీ యోగ మెవ్వానికిన్

చిరదాస్యమున గ్రుంగి పిఱికివాఱిన జాతి
కలవరించితివి సాహసికముద్ర
మోఁ కఱించి కృపాణములు సలాములు సేయు
నస్త్ర మెత్తితివి సత్యాగ్రహంబు
పరధర్మలుబ్ధులై పరువులెత్తెడి వారిఁ
ద్రిప్పఁ జాలితివి జాతీయవిధికి
అడుగడ్డునకు నడ్డపడిన కోటలఁ గూల్చి
సవరించితివి సమాజవ్యవస్థ
దిక్కెఱుంగక రే పవల్ దేవురించు
ప్రజకు నేర్పితి వాత్మగౌరవసమీక్ష
బాపూజీ! స్రష్ట వీవు నీ చూపు సోఁకి
ద్రష్టలైనారు కొంద ఱీ తరమువారు

ఉత్తమవాగ్మి నా నొప్పారె నురక గ
ర్జించియా? కాదు - వర్జించి నుడులు
అతిలోకబలసమంచితుఁడయ్యెఁ గండలు
పెంచియా? కా-దలయించి యొడలు
చిరజయశ్రీధురంధురుఁ డయ్యె రిపుల ఖం
డించియా? కాదు - పండించి కృపలు
అమృతత్వమందె యాగము లాచరించియా?
కాదు- నిష్కామయోగము వరించి

యతఁడు సామాన్యుఁ డెట్లు? వీరత కపూర్వ
జీవములు వోసి వాసిదెచ్చిన మహాత్ముఁ
డతని నడచిన బాటలయందు నడిచి
పందయును విక్రమక్రమాస్పందుఁ డయ్యె.

సాత్వికనిరోధసంగరస్రష్టయై జ
గమ్మునకు నవ్యభవ్య మార్గమును జూపి
వర్తమానయుగాచార్యవర్యుఁ డన్న
కీర్తిగాంచిన సాధుతామూర్తి యతఁడు

వేయి గాదు లక్ష విశ్వకళాపరి
షత్తు లెన్నినాళ్ళు మొత్తుకొన్న
నేర్పలేని తెల్వి నీ వీ జగమ్మున
కిచ్చినాఁడ విరులు విచ్చి వీడ

పెఱబాసల కొల్వునకున్
బొరలుట జాతికి విషమ్ముపోయుట యని తెం
పరివై చాటితి విఁక నె
వ్వరు దిక్కో దేశిపల్కు వఱువ ట్లుడుపన్

నీ పల్కు గాక యీ నిఖిలభారతమహీ
చక్రంబు ద్రిప్పుశాసనము గలదె
నీ యున్కిగాక పండిన పాపముల నెల్ల
రాపాడు పుణ్యతీర్థమ్ము గలదె
నీ కిన్క గాక మానిసి గుండెలోఁ దూఱి
చెడుగుపాదు పెకల్చు శిక్ష కలదె
నీ కూర్మిగాక నిర్ణిద్రయోగసమాధి
బడలి సంపాదించు పదవి గలదె
కలదె నీ జీవనపథమ్ముగాక లోక
శర్మ సంపత్తి నొదవించు ధర్మశాస్త్ర
మద్వితీయంబు నీ తపస్యా విధాన
మెవ్వని మనీష నిల్చు నిన్నెఱిఁగి పల్క

నీ పరమోపవాస మశని ప్రతిమం బయి శైల సాగర
ద్వీప విశిష్ట విశ్వజగతిన్ వడఁకించు తఱిన్ భయార్తులై
పాపులు బల్లెముల్ మరతుపాకులు బాఁకులు పెట్టి తావక
శ్రీపదపీఠిపై నొరగి సిగ్గిలి రేమి తపస్సురా ప్రభూ!

అనఘ! నీ వీశ్వరుని దూత వగుట విశ్వ
మానవీమానవుల్ భగవాను పట్లఁ
దేటపఱుపని భక్తి నీ దెస వెలార్తు
రసలు కంటెను వడ్డి ముద్దైన యట్లు

అంకిలివీడి నిర్భర వయ: పరిపాకమునందె యింద్రి యా
హంకృతి దూల్చి పూనితి మహామతు లోర్వని బ్రహ్మచర్య; మీ
బింకము లేనినాఁడు వలపించి జగంబులనెల్ల నిట్లు నీ
లెంకలఁ జేసికోఁ దగవు లే! తెలిసెం గిటుకెల్ల బాపుజీ!

వలపుల్ చిమ్మెడు పూలచెండ్లవలె సేవాధర్మ నిర్మాతవై
మలపిండంబుల నెత్తివైచితి; .*వసీమత్యాగమై ప్రాణముల్ (*అపూర్వత్యాగము)
బలిదానంబిడఁ గంటి విశ్వహితముం బాటించి; నీ బాటలో
నిలువంజాలిన మానవుండెవఁడు గాంధీ! ఖండఖండమ్ములన్

స్వమత విధుల్ ప్రశస్తములు, సత్యము లంచు భజింతు, వన్య ధ
ర్మముల సమాదరింతు, వపరాజిత సూత్రములన్ గణింతు వీ
సమరసదృష్టి ప్రాక్తనులు శంకరముఖ్యుల కింత యున్నచో
సమరము లెన్ని క్రిందువడి శాంతి యదెంత ఫలించి యుండునో!

లాటీ నెత్తి విశాలభారతము నేలం జూచు దుష్టప్రభు
త్వాటోపం బడఁగించు టెట్టులని తీవ్రాలోచనామగ్నమై
బాటం గానని యోధమండల మెలర్పన్ నాఁడు "క్విట్టిండియా"
యాటంబాంబు సృజించి డించితివిరా! యాంగ్లేయరాజ్యోద్ధతిన్

దారిద్ర్యంబు నవిద్యయుం గవిసి పంతాలాడ సంపన్నులున్
బేరుల్ నెత్తురు పీల్చి పీల్చి బహుధాపీడించినన్ జీవనా
ధారంబై జగ ముద్ధరించు బడు గార్తప్రాణబంధుండు రై
తే రాజ్యంబున కర్హుఁడంటి వది సిద్ధిం బొందు టేనాఁటికో!

వలదు పరాన్నభుక్కుల నివాసము లీ పురముల్; పదం బిటన్
నిలుపక పొండు పల్లెలకు; నేర్పుఁడటన్ జదువుల్ సదర్థముల్
వెలుఁగులు నింపి భారతసవిత్రికి నాయువుపట్టులైన యా
పొలములు దున్నుచున్ నలిఁగిపొం డని తోలితివోయి ! పౌరులన్

బడలెద వేకువోలె మన భాగ్యము పంటకు, రాట్నపాకుగా
సుడివడె దార్తరక్షణకు, సూత్రమవై సకల ప్రజావళిం
బడుగునఁ బేకలోఁ గలిపిపట్టెద; వెట్టివిపత్తి మూఁగినన్
జడియక నిచ్చలున్ బిగియసాగెదురా! కదురై మహాప్రభూ!

మొద్దుగ నుండుఁగాక వెల ముమ్మర మయ్యెడుఁగాక దీక్షమై
ఖద్దరు కట్టి పేదలకు గంజిని బోయుఁడు భారతార్థి కా
పద్దశ దీనఁ బాయు నని పల్కితి, వూపిరిలేనిరాట్నపున్
ముద్దియ తేటి తెప్పిఱిలి మోహనసూత్రము లాలపింపఁగన్

నీ కదలించిన ఖద్దరు
నీ కీర్తివిధాన జగతి నిండారెఁగదా
రేకెత్తిన జాతీయత
కాకల్పం బిది పతాకయై అంపిలుతన్

వంటయు, నంట్లు తోముటయు, వల్లభుచేతి విలాసవస్తువై
యుంటయు గర్భరౌరవ దురుద్ధతి కోర్చి ప్రజాపరంపరన్
గంటయుఁ గాక లోకమును గానని భారతనారి నీ కృపన్
గెంటెఁగదా పరప్రభుతఁ గెవ్వునఁ గేకలుపెట్టి పాఱఁగన్

నీ వస్పృశ్యుఁడ వీ వవాచ్యుఁడ విసీ! నిన్ జూచినం బాపముల్
ప్రోవై చుట్టు నటంచు శిష్టు లెవనిం బోనాడి, రా మాల, యా
జీవన్మృతము వెల్గెడిన్ హరిజన శ్రీనాముఁ డారాధ్యుఁడై
యీ వే దివ్యసమాధిలో, దలఁచితో యీ పేరు యోగీశ్వరా!

శంబుకువంటి సాధువులఁ జంపక సంపద లేమి యన్న భే
దంబులు లేక సర్వజనతాసమతా సహజన్మతల్ నభ
శ్చుంబులు గాఁగ శాంతిపరిశోభితమై నుతిగాంచు రామరా
జ్యంబున కాసచేసి చరితార్థత నందకమున్నె సాగితే!

ఒడ్డారించి నినున్ వధించి కుటిలవ్యూహమ్ము పండించి మా
జడ్డల్ పోయె నటంచుఁ బ్రేంఖణములన్ సారించి కజ్జాయముల్
లడ్డుల్ పంచినమూఁక భారతము నేలన్ నేలదయ్యాల కే
యడ్డం బాఁకయు లేని రంగ మగుఁగాదా భావి యెట్లున్నదో!

కుల వర్గములఁ గ్రుళ్లి కుమిలిన నీ మతం
 బుద్ధరింపఁగఁ జక్కదిద్దు కతన
మాలకై మందారమాల కైసేసి నీ
 దేవాలయము తల్పు దెఱచు కతనఁ
బొగలతో సెగలతోఁ బొగులు హిందూ ముస్లి
 ముల కౌఁగిలింతలు వలచుకతనఁ
బేదసాదుల నెత్రు పీల్చి గబ్బునఁ ద్రేఁచు
 సాహుల నదలింప సాగుకతనఁ
బ్రజ నెదిర్చిననాఁడు మీ బ్రదుకు లేదు
లే దనుచుఁ గింప్రభుల మందలించు కతనఁ
గాల్చితఁటరా మహాత్ముని గర్మయోగి
లోకమూర్ధాభిషిక్తు గోడ్సే కిరాత!

శతధా, కాదు, సహస్రధా తునియలై సామ్రాజ్యవాదం బహో!
యతలంబున్ సుతలంబు నంటుతఱిఁ బ్రాజ్యంబుల్ ప్రజారాజ్యముల్
క్షితినెల్లన్ వికసించువేళ నసురస్స్పృహ్యం బసహ్యంబు నౌ
మతరాజ్యంబున కుద్యమించితఁటరా! మాత్సర్యధుర్యాగ్రణీ!

మతము పే ర్వెట్టి కపట ధర్మములు పల్కి
మోస మెఱుఁగని సాదుల ముంచి ముంచి
బొజ్జ పెంచెడు వారికి బుద్ధిసెప్ప
కాల మేతెంచె నని యెఱుంగవె జడాత్మ!

పుట్టుకతో నాధిక్యము
పెట్టెన్, సోమరికిఁ బెద్దపీఁటను వైచెన్
ముట్టుకొనరాని మానవుఁ
గట్టా! నీ మెచ్చు మతమ కద సృజియించెన్

బుక్కు లొకనికి నొకనికిఁ జెక్కభజన
ప్రభుత యొకనికి, నొకనికి బానిసమ్ము
గ్రామ మొకనికి, నొకనికిఁ గసటు గూడె
మేమి సౌభ్రాత్ర మేమి హిందూమతంబు

సావర్కా రిసిరో! "విజ
యావహ మగుఁగాక! నీ ప్రయాణం" బని నిన్
దీవించి పంపి నాఁడటె!
కావిరిచీఁకట్లు వీని కను గప్పె నొకో!

తరతరమునం "దహింసా
పరమోధర్మ" యని నొక్కి పల్కిన మతపుం
బరు వెఱుఁగలేని దామో
దరుఁ డితఁడా నీకు దైవతం బధరమతీ!

ఆనాఁ డేసు పవిత్రరక్తమున దాహం బార్చుకొన్నట్టి యూ
దీ నాఁ డెందును దిక్కులేని పురుగై యేఁకారుచున్నాఁడు; నీ
వే నీచత్వము నేలెదో మఱియు నేయే హింసలం గూలెదో
దీనత్రాణపరాయణున్ బుషివరున్ దిన్నాఁడ వేన: ఖనీ!

చిత్తయినారులే దనుజశేఖర నీ ఖరవృత్తి ముం దిలా
భృత్తనయున్ వధించిన మహీంద్రుని సానుజ సాశ్రితంబుగాఁ
గత్తులబావిపాట్ట కెరగా నొనరించిన - వృద్ధమౌని వాల్
కుత్తుక నొత్తి అంపమునఁ గోసిన నాఁటి ప్రబుద్ధులందఱున్.

బోయఁడు విప్రుఁడై భువనపూజ్యుని రాముని కీర్తి నిల్ప రా
మాయణ సృష్టి చేసి నుతు లందె నొకానొకనాఁడు, విప్రుఁడే
బోయతనమ్ము నంది బుషిపుంగవు నేఁడు వధించె రామసే
వా యజనార్థ చిత్తుఁ దన వంగస మాఱనిలజ్జఁ గ్రుంగఁగన్

వేదము క్రోల్చి ధర్మపదవీనదవీయసియైన బుద్ధికిం
బాదులు కట్టి పుణ్యముల పంటలు నూర్చి యనంతశాంతికిన్
మూదలయైన విప్రకులమున్ బిశితాశి యితండు నేఁడు దు
ర్వేదనపాలు చేసె నపవిత్రుల పుట్టుక లిట్టివేకదా!

విప్రకులంబె కాదు కనువిచ్చిన హైందవసంఘమెల్ల నేఁ
డప్రతిమ త్రపాపిహితమై భయ దు:ఖ ధురా పరిచ్యుత
క్షిప్రతమై ఖలుం డొకఁడు చేసిన పాపము జాతికే వినా
శ ప్రద మంచు నేడ్చు నవశమ్ముల ముప్పదికోట్లగొంతులన్

ఏడ్చుటె కాదు భీష్మతరమీ ఘటనన్ విను చెంద ఱెందఱో
యూడ్చిరి మేను, క్రైస్తవులు యూదులు ముస్లిము లెల్లవారలున్
మోడ్చిరి మోము నెవ్వగల ముంపులతో దిగువాఱి కంటి నీ
రోడ్చిరి విశ్వవీథి విలయోదధిపొంగులు రేఁగెనో యనన్

చచ్చిరి దేశభక్తులు, *విశాంపతు లిద్ధకవుల్ ప్రవక్తలుం (*రాజులు)
జచ్చిరిగాని ము న్నెవని చావునకుం బ్రజ లిట్లు క్రుంగి; రే
సచ్చరితుండు పోవునెడ సర్వజగంబు లిటుల్ వెలార్చె న
త్యుచ్చతరాదరంబు హృద యోద్గత భక్తియు సానుభూతియున్.

నాపై బాంబులు ప్రేల్చినట్టి మనుజున్ నాపాలి చుట్టమ్ముఁగా
నా పుణ్యమ్ముల పంటఁగాఁ దలఁచి లేనవ్వుల్ వెలారించుచున్
దాపం బింతయు లేక యే నరిగినన్ దా మప్పు డా నన్ను వా
ణీ పారమ్యముఁ జూపి మెచ్చుఁడని తండ్రీ! పల్కు పండించితే!

క్రుళ్ళిన యెముకకై కుక్క గుంపులవోలె
        నధికారమునకుఁ గొరాడువారి
లంచాలగడ్డి కాసించి సేవాధర్మ
        నియమముల్ బలిసేయ నేర్చువారి
కుహనా వణిజ్యోపగూహ నోద్రిక్తులై
        సుధవోలెఁ బ్రజనెత్రు జుఱ్ఱువారి
పరమతద్వేషాగ్ని మరగి నారీ వృద్ధ
        శిశుమండలిని జీల్చి చెండువారి

దేశహిత కృత్యముల పేరఁ దెచ్చు నర్థ
మాత్మబంధువులకుఁ బంచు నట్టివారి
బ్రతుకుఁ గనలేక కన్నుమూసితివి గాని
కలఁడె నీ గుండెపైఁ బ్రేల్వఁగల మగండు

నిన్నుం గొల్చినయట్లు కొల్చి నిను ఖూనీ చేసి రే గోముఖ
చ్ఛన్న వ్యాఘ్రము లే పయోముఖ విషస్థాలుల్ దయా సూనృత
స్కన్నుల్ వారలె నీకు దేవళములం గట్టించు పన్నాగముల్
పన్నం బూనిరి స్వప్రయోజనకర ప్రజ్ఞావిధా చుంచువుల్

బుద్ధుని యెంపముక్కల కపూర్వములౌ గుడు లిట్లె కట్టి సం
విద్ధన మెల్లఁ జూపి రపవిత్ర విధుల్ కథలుం బురాణముల్
వృద్ధియొనర్చి రాతఁ డుదయించిన భూములనుండి యెన్నఁడో
బౌద్ధము నెట్టివైచిరి జపాను సయాముల నాశ్రయింపఁగన్

అతని హృదయంబ మధురశిల్పాభిరామ
నిలయమై ప్రీతి సంధించు నీ కెవండు
బ్రదుకులోఁ జావులో నీదు బాట ద్రొక్కి
పీడితప్రజకై సల్పు నూడిగంబు

మనుజుఁడవుగావు నీవు కోమటివిగావు
బడలిపోయిన భారతీయుఁడవు గావు
కావు గాంధివి - లోకలోకముల వెల్గుఁ
జూపు నిరవధి కామరజ్యోతి వోయి! **(అమరజ్యోతి - ఫిబ్రవరి - 1948)**

బుద్ధుండు జీసస్సు పోయిన పిదప
నంత వాఁడుగ నితం డవని కేతెంచె
నని జగం బెవనిఁగొండాడె నాసుకృతి
బాపుజీ పోవ మ్రాన్పడె నెల్లజగము

సేవతో నీవితో సిద్ధించుఁగాని
తోమాలెతో హెూమధూమాలతోడ
రాదు కైవల్యంబు రాదన్న యట్టి
బాపుజీ పోవ మ్రాన్పడె నెల్లజగము.

సాధారణజగత్తు చంద మిట్లగుట
తప్పదు,గానీ స్థితప్రజ్ఞుఁడైన
గాంధి పోయినపోక కడుమేలిపోక,
తనలోకసేవ తద్దయు సాగుచుండ

బుద్ధి తేజస్వంతముగ వెల్గుచుండ
మానసస్థితి పూర్ణిమారాత్రిపోలెఁ
బరమప్రసన్నమై భాసిల్లుచుండ
నుత్తరాయనమున నొడలు చాలించి

సుజనప్రియంబైన శుక్లమార్గమున
నరిగి బ్రహ్మీభూతుడయ్యెను గాంధి;
ఉపనిషద్రాజమై యొప్పిన గీత
యౌనన్న పుణ్యాత్ముఁడయ్యెను గాంధి

యెసరేఁగి యేరులై యెల్లకామములు
వెసవెసన్ దనలోఁ బ్రవేశించుచున్న
దెరలక పొరలక తిరముగా నిల్చి
యలలేని జలరాశి యయ్యెను గాంధి,
సరిలేనిశాంతిని సాధించె గాంధి;
ఇతఁడు లేఁడని ప్రజ కేల మ్రాన్పాటు?
ఇతఁడు లేఁడని ప్రజ కేల యుమ్మలిక?
ఇతని మన్గడ చంద మిచ్చఁ బాటించి
జగ మందుకొనుఁగాక సర్వదా జయము!
జన మందుకొనుఁగాక సర్వదా శుభము! (గాంధిగానము-)

ఇతఁడహింసారణాచార్యు, డితఁ డభేద్య
సత్యకవచుఁడు, భువనైకశాంతి దూత
యుగయుగమ్ములు కల్పముల్ ముగియుఁగాక
తరణియై మింట మెఱయు నీతని పతాక

నశ్వరమైన కాయము వినాయక ధూర్తుఁడు కూల్చెఁ గాని నీ
శాశ్వతమైన యాత్మ నెటు చంపఁ గలం డతఁ; డస్త్ర శస్త్ర తీ
వ్ర శ్వసనాగ్ను లేకమయి వచ్చునపో! యది లెక్క సేయ; దీ
విశ్వము దాని చల్వ శుభవృద్ధము సత్యము సుందరంబగున్.

ఆకాలమ్మున గౌతముఁ
డీ కాలమునందు గాంధి; యిద్దఱు హింసా
వ్యాకుల జగతికి శాంతి
శ్రీకరులు దయావిధేయ జీవన నిరతుల్.

గుడుల కేగలేదు గుహలకుఁ బోలేదు
ప్రజల నడుమఁ గడపె బ్రదుకు నెల్ల;
ఒడలు దేశసేవ కెడఁద రాముని సేవ
కప్పగించి ముక్తినందె గాంధి

బాపుగాఁ గర్మయోగంబు రూపుదాల్చె
భక్తి విడరాని చుట్టమై పరఁగె, దాని
కెఱుక చెలియయ్యె, నయ్యోగి నరసి మనుట
ధరణిఁగల సర్వపుణ్యతీర్థములఁ గనుట.

పతిత జగత్సముద్ధరణ భారము నౌదలఁ దాల్చి ధాత్రిపై
బ్రతికిన యన్నినాళ్ళు పలుభంగులఁ గర్మము లాచరించి తు
ట్టతుదకు నిర్మమత్వము కడల్కొన బంధము లూడ్చి భారతీ
యతకు మెఱుంగు పెట్టిన మహాత్మ! భవత్కథ మమ్ముఁ దేర్చుతన్!

(మహాత్మకథ)

**శ్రీ ఏటుకూరి వేంకటనరసయ్య**

ఒసపరితెలుంగు నీ కై
వసమ్మురా! నీ వచించువాణికి నసువై
పసగుల్కున్ నుడికారము
ప్రసన్నమై రసికభావ పర్వోదయమై

తెలుఁగుంబల్కుల తీరుతీయనలకున్ దిక్కన్న దిక్కన్నచోఁ
దల లూగింపని ప్రోడలుండరుగదా! తన్మాధురీ సాధురీ
తులకున్ నోఁచిన యేటుకూరి కవిచంద్రున్ ధన్యుఁగా నెంచు నీ
"యలరాజున్" బలనాటికృష్ణుఁ గని సర్వాంధ్రమ్ము నిస్తంద్రమై.

భవదీయంబగు "వీరభారత" మహో! ప్రత్యక్షర ప్రౌఢమై
నవలావణ్య శరణ్యమై ఋషివరుల్ నన్నయ భట్టాది స

త్కవి మూర్ధన్యుల శిల్పసంపదలకున్ గాణాచియై యుంట నీ
భవమున్ ధన్యముగాఁ దలంతురు రసప్రాణుల్ కళారాధకుల్

సురభిళమీ మహాంధ్రకవిసూనము పంచినతావి సోఁకి మై
మఱచితి, మింతలోనె మటుమాయ మొనర్చెను దైవ మీ విరిన్;
పరిణతగంధమై ప్రభునిపజ్ఞ సుమంబిది వెల్గుఁగాక, తె
ల్గు రసికలోకమీ కొఱఁతకున్ గలకాలము కుందకుండునే? (సమదర్శి)

**శ్రీ పొట్టి శ్రీరాములు**

ఓ! తెనుంగు రాష్ట్రమా! తుట్టతుద కెంత
కడిఁదిపనికిఁ బాలుపడితి వమ్మ!
శుద్ధ సత్వమూర్తి సుతుఁ డొక్కఁ డాహుతి
వోవు దనుకఁ దరలిరావు నీవు

నీ పే రాంధ్ర చరిత్రలో నమరమై నిల్చెన్, దపశ్శీలమౌ
బాపూ ధర్మము నుద్ధరించి దురహంభావోద్ధతుల్ తాంత్రిక
వ్యాపారప్రియు లాత్మదర్శన దవీయాంసుల్ త్రపావీచులన్
ద్రోపాడంబడున ట్లొనర్చితివి సాధుల్ మెచ్చ శ్రీరాములూ!

జతనంబుల్ పొనరించి రన్నలు స్వరాష్ట్ర ప్రాప్తికై నల్వదేం
డ్లితరుల్ నవ్వుట కాక వచ్చినది యేమీ? సత్యమున్ ధర్మమున్
వితథంబయ్యెనపో! యటంచు హృదయోద్వేగంబునన్ వచ్చి దూఁ
కితె సత్యాగ్రహయజ్ఞకుండచటులాగ్నిన్ లోక ముఱ్ఱూఁగఁగన్

ము న్నీ వెవ్వఁడవో యెఱుంగని ప్రజల్ మూర్తీభవత్త్యాగమై
యన్నా! యామరణోపవాసభర మీవై జాతికై పూనుటన్
గన్నుల్ విప్పరె! ప్రాణముల్ పణముగాఁగన్ నీవు దివ్యత్వ మీ
కొన్నంతన్ జకితాత్ములై సొగసి నీకున్ జోత లర్పింపరే!

ఒకదెస గాంధితత్త్వమున కూపిరిపోసిన వాసి గంటి; వెం
కొకదెస నంధ్రజాతికి మహోదయపర్వవిధాత వైతి; వే
టికిఁ బదికోట్లమంది వికటీకృతబుద్ధులు? నిన్నువంటి సా
ధకుఁ డొకరుండు సాలునుగదా! కనిపెంచిన తల్లితృప్తికిన్

పదుగురు కర్మయోగులు భవాదృశు లబ్బినచో స్వరాజ్య సం
పద నొకయేఁటఁ దెత్తునని పల్కఁడె మున్ను మహాత్ము; డబ్ర మె
య్యది కల దిందు? రెండు నెలలైనను నిండని నీ తపస్సుతో
నెదురయి వచ్చె నాంధ్ర విజయేందిర; యెంతటి నిష్ఠరా! ప్రభూ!

సిరులను ద్రోయవచ్చు నిరసింపఁగవచ్చు సుఖానుభూతి, రా
చఱికము రోయవచ్చు, నిజసంతతి నింతిని వీడి సంయమ
స్థిరత వనాంతరమ్ముల వసింపఁగవచ్చును గాక, తాముగా
నెఱిఁగి యెఱింగి ప్రాణముల నెంద ఱిటుల్ బలియిత్తు రుర్వికిన్

జాముస కొక్కముక్క వరుసన్ దనువంతయు రాష్ట్ర సిద్ధికై
హోమము చేసి లోకముల నూఁపి యభీప్సిత మందుకొన్న శ్రీ
రాములు వందవందల తరాలకుఁగా నొకసారి పుట్టు; స్వ
క్షేమము నెంచి తాదృశుల శీలము జాతి జితించుకోవలెన్.

బలియు దధీచియున్ శిబియుఁ బ్రాఁతయుగమ్ములనాఁడు ప్రోడలై
యలయక ధర్మరక్షణకుఁ బ్రాణము లొడ్డి రటన్న మాటకున్
వెల నిడలేని వెఱ్ఱికి వివేకము సెప్పితివే! తెలుంగువా
రల కిక నీవ రాముఁడవురా! యవురా! యవిరామసత్కృతీ!

పరుల యాచింప నొల్లని, పక్షపాత
మిచ్చ గింపని, కికురింతమచ్చలేని,
యడుగులకు మ్రొక్కు శిరముపై హజ్జ నిడని
పొట్టి వయ్యు మిన్నందిన దిట్ట వీవు

కోమటి భారతప్రజలకున్ ఘటియించెను రాజయోగమున్
గోమటి వీవు తెన్గుప్రజకున్ గడియించితి రాష్ట్రభోగమున్;
భూమి వణిజ్యతంత్రమున బ్రుంగి కలంగునెడన్ విముక్తికిం
గోమటిగా కొరుండెటు తగున్, జరితార్థము నీకులం బహో!

**(1954 - ఉదయగానము)**

వీరత యన్నఁ దెల్గునుడి విజ్జినదేశము సర్వ మేకమై
తీరఁ దృణమ్ముగట్లు నిజదేహము నుగ్రతపోగ్ని వేల్వఁగా
నోరిచినట్టి పొట్టిఋషి దొక్కనిదే యను టొప్పు; వీని కై
వారమొనర్చి మోహములు వాయుద మీ నవవత్సరాగతిన్

ఆంధ్ర సవనాగ్నికి హవిష్యమైన ధీరుఁ
దెనుఁగునేలకు వాసిదెచ్చిన యుదారు
మఱవకుఁడు పొట్టివీరు నమాత్యులార!
పెట్టుఁ డీ మేటి పే రొక్క పేఁట కేని

తెనుఁగు నధికారభాషగాఁ దెచ్చు తలఁపు
తగినదే కాని "శ్రీరామనగర" సంజ్ఞ
మన విధానసభా ఖండమునకు నైన
నిర్ణయింపుఁడు మంత్రితా నియతులారా!

పేఁటకా, వీటికా, కాదు పెద్దసీమ
కే ప్రకాశమునామంబు గీలుకొల్పి
త్యాగి దెసఁ గృతజ్ఞత చాటినట్టి నాఁటి
తెలుఁగు సచివుల యౌచిత్య మలఘుతరము (ఎక్కట్లు - మే, 1976)

**శ్రీ యార్లగడ్డ రామనాథబాబు (కారంచేడు)**

"మామగారూ! నమస్కార; మేమిపనికి
నిటకు వచ్చితి?" రనుచు న న్నెచటఁ గన్న
నెమ్మి నమృతప్రవాహమ్ముఁ గ్రుమ్మరించు
సాధు విల వీడెనా? రామనాథబాబు.

మా యేర్లగడ్డ భూపతి
మీ యల్లుండగుట నేను మీ యల్లుఁడఁ గా
నా?యని వావిం దెలుపుచుఁ
దీయము ప్రకటించుబాబు దివికిం జనెనా?

"బస్సు కల" దని యే నెంత పల్కుచున్న
ననుమతింపక "డ్రైవరూ! అప్పికట్ల
కీ కవీంద్రులఁ జేర్చి రమ్మీ!" యటంచు
నన్నుఁ గరఁగించు బంధు వీనాఁడు లేఁడె?

తాతలు తండ్రులు నేర్పిన
దాతృత్వము వలచి యితఁ డుదాత్తవితరణ

స్రోతస్సులఁ బరఁగించెను
మాతృమహీదీనతా ప్రమార్జన రతుడై

బావలై మామలై జగత్ప్రథిత దాన
గణ్యులై పుణ్యులైన జాగర్లమూడి
వారి నోడింపవలె నన్న వలపు హెచ్చి
యిచ్చెనా? యిన్నిలక్షల నితఁడు ప్రజకు.

పంతమున కిచ్చుఁగాక యీ స్పర్ధ సుజన
మోహనము విశ్వకల్యాణమూల మగుట
మెత్తు రీదృశ భావనాయత్త హృదయు
నుత్తములు బుద్ధిమత్తముల్ యుగయుగాలు.

రామనాథసుకృతి నీ మృతిపట్ల మా
యెడఁద కలఁగి నలఁగి యడలుఁ గాని
కాకివోలెఁ జిరము కోకిల నిల్చునా?
తక్కువైన నేమి దానిబ్రదుకు?

ఊహింపన్ జెడినది నీ
దేహమ, నీ వెట్లు చెడుదు దేహివి? మాయా
వ్యూహమునఁ జిక్కి దేహికి
దేహమ్మన కున్న వేర్మి తెలియరు మూర్ఖుల్

తేజోమయమగు తత్త్వము
లోఁ జేరితి వీవు నీకు లుప్తము లేఁక న
న్నా! జనన మరణ రోగ జ
రా జంబాలములు సంసరణబంధనముల్

(సమదర్శి- 3- 10- 1960)

**నెఅదాత శ్రీ జాగర్లమూడి. కుప్పుసామి చౌదరి (కాఅంచేడు)**

ప్రాగబ్ధివీచికాపటలంపు నిటలంపు
మురువు నింపెడి క్రొత్తనురువు క్రాఁగ
సింహాద్రినరహరి శ్రీవక్షమున వ్రేలు

పరువంపుఁ దెలిదమ్మి సరము కాఁగ
శ్రీగిరిభ్రమరాంబ చిన్నారి పొన్నారి
కొప్పుపై విరజాదిగుత్తి కాఁగ
దిరుమల ప్రభుమౌళి దీర్ఘబాహుచతుష్క
సంలిప్త చందన చర్చ కాఁగ
ధన్యతర సర్వమానవాదర్శ మృదుల
మధుర జీవన సాధి తామ్లానకీర్తి
కాయ మిట డించి పుణ్యలోకమ్ము నేలు
కోర్కిమై నేగినాఁడవా కుప్పుసామి!

వలచివచ్చిన గౌరవమును మెచ్చితి కాని
పదవికై తంత్రముల్ పన్నఁబోవు
అది ప్రజాసేవగా నరసి డస్సితి కాని
యధికార మనుచు నహంత గనవు
ఈర్ష్యాళువుల పట్ల హితమ కోరితి కాని
మచ్చరించుట కెన్నఁ డిచ్చపడవు
తెరువు దప్పిన వాని దిద్ది తీర్చితి కాని
కడుపుపైఁ గొట్టు టెన్నఁడు నెఱుఁగవు
గర్తపురమండలము నిరాఘాటగరిమ
నేలినన్నాళ్ళు నీ వొక యింటివేల్పు
నటులు పాలితహృదయంబు నాఁచి కొంటి
వప్ప! నీ కెవ్వఁ డెనవచ్చుఁ గుప్పుసామి

తాత ముత్తాతలు దాఁచియిచ్చిన మేటి
కలిమితో, నడవడి బలిమి తోడ
అన్వయశ్రీ దత్తమై రాచసిరి గుల్కు
ఠీవితో, నెనలేని యీవి తోడ
దిగ్దంతు లగువారు తెలతెలఁబోవు వి
ద్వత్తతోఁ బ్రతిభామహత్త్వ తోడ
కవిరాజ పండి తాఖండల శ్రేయోను
రక్తితో, దృఢదేశభక్తి తోడ
నొక తెలుఁగునాటికే కాక సకల దక్షి
ణాపథమ్మునకును మాపు ఱాపు లేని

రాణ దెచ్చిన కర్షక ప్రభుని నిన్నుఁ
జెప్పి యొరుఁ జెప్పవలెఁగదా కుప్పుసామి!

వినయాశ్రయమ్ము నీ వితరణమ్మునఁగదా
యొక యింటిదై జగత్ ప్రకట మయ్యె
కమ్మహాస్టలు భవత్కారుణ్యమునఁగదా
మిన్నంది లాలించెఁ బిన్నవాంధ్ర
ఉన్నవమంత్రి నీ వొసఁగు పెంపునఁగదా
స్త్రీ జనాభ్యుదయమ్ము సృష్టి చేసె
ఆంధ్రరత్నమ్ము నీ యండతోడనకదా
చీరాల పేరాల పోరు నడిపె
ఎన్ని చెప్పనేర్తు మీ వొసంగిన మహా
దానములను నిరూపమానములను
గాంధి మెచ్చు ధర్మకర్తగా బ్రతికిన
మేటి వీవు పుణ్యపేటి వీవు

కులమునకు రాజకీయ సంకుచిత భావ
సరణికి మతమ్మునకు లొంగి సంతసించు
మానిసివి కావు సమతాభిమాని వీవు
విశ్వకల్యాణకాముకవృత్తి వీవు

అడిగిన నిచ్చు సత్పురుషు లచ్చట నచ్చట నుంద్రు గాని నీ
వడుగని వారికిన్ ధనము నంపెదు వందలు కాదు వేలుగన్
పుడమిని నిన్నువంటి కృతబుద్ధులు నిచ్చలు నుద్భవింతురా
పొడముదు రెప్పుడో ప్రజల పుణ్యము పండి శతాబ్ది లేగఁగన్.

మఱల భువికి నంపు సురలోకమునఁ గాదు
జననమరణ దుష్ప్రసక్తి లేని
నెలవునందు నీవు నిలువుము నీ వెల్గు
లఖిల విశ్వవీథు లావరింప

శ్రీ చంద్రమౌళి నభినం
ద్యాచారప్రియుని యుష్మదాత్మజుఁగని మే

మాఁచెదము నేఁటి యలమట,
చూచెద మీ చిఱుత ననుఁగుఁజుట్టమ పోలెన్ (పైరపంట - 3-1-1961)

**శ్రీ వేపా కృష్ణమూర్తి (ప్రముఖ ఇంజనీర్)**

తల్లి! కృష్ణానదీ! భవత్తటమునందె
మ్రోసె నాంధ్రపతాక ముమ్మొదటి దెగసి
తెనుఁగునావలు నీదు దీవనలు పడసి
యెత్తెఁ దెరచాప దీవులనెల్ల నొత్తె.

సుకృతఖనివి నీవు; సకలభూములవారి
యర్చలందు మల్లికార్జునుండు,
కనకదుర్గ, నీకు గాదిలి చుట్టముల్
నతసమాజ! సహ్యనగ తనూజ!

నీవు కరుణానిధివి; కాన నీతటమ్ము
లాశ్రయములయ్యె బౌద్ధవిహారములకు;
సుగతసంస్కృతి నిపుడేని పగటు నిచటి
జనత; పున్నెపుదొంతి! కృష్ణా స్రవంతి!

వాసిరెడ్డివారు నీ సన్నిధిన్ బ్రజ
నేలునాఁడు, లోకహితము నెంచి
విడుచు దానధార వడకారు నందేని
నింపె నీకు వఱద సొంపు తల్లి!

నిన్ను దుర్గవీట నిలిపి తల్లి! వేఁగి
నాటి నుండి కమ్మనాటి దనుక
జీవనార్తి నుడిపె నే *విజ్ఞుఁ డాదయా (‘సర్ ఆర్థర్ కాటన్)
పేటి కేటి కోళ్ళు‘కాటను’ నకు

నీవు చల్లని తల్లివి; నీదు కరుణ
బ్రదుకుచున్నది ప్రజ పాఁడి పంట లొదవి;
నిక్కమే కాని యిట్టు లొక్కొక్క తడవ
రెచ్చి భీకరాకృతిని ధరింతు వేమి?

సహ్యగిరి సానువుల మెల్ల సాగిసాగి
యలఁతి వాఁగుల నీలోనఁ గలిపి కొనుచుఁ
బెల్లుబికి సుళ్ళతోఁ బఱవళ్ళు త్రొక్కు
కృష్ణవేణమ్మ! నిలు! నిలు! మించుకంత

ప్రావృడభ్రమ తనకంటఁ బడిన వెంట
హర్షపరవశమై యాడునఁట మయూర
మకట! తన్మేఘజలపుష్టవైన నిన్నుఁ
గన్గొనిన యంత మా కింత కలఁత యేల?

గట్ల నొదిఁగి యొదిఁగి కదలెడి నీ సాధు
మూర్తి మాకు మోదమును ఘటించు,
దరుల నొరసి యొరసి పఱచు నీ రూక్షరూ
పమ్ము మాకు భయభరమ్ము గూర్చు.

మేలు కలుగ నుబ్బు మెయి నేర్చితిమి గాని
కీడు గదుర నోర్చు కీ లెఱుంగ;
మెనిమిదేండ్ల నాఁటి దీ వొనరించిన
చెట్ట నేఁడు నుదిలపెట్టు మమ్ము

ఆనాఁడు నీ వానకట్ట నట్టిట్టు లాడించి త్రెంచి
పైనము సాగించునపుడు, లేఁబొట్టపైరు లిఁ కేమి
కానున్నవో యని కర్షకు లడలి కంపించునపుడు,
దీనమై కర్తవ్య మిది యని జగము తేల్ప లేనపుడు

జాలి పొంగి పొరలి సాహస స్ఫూర్తిమై
నిన్ను నిలవరింప నిలిచినట్టి
పుణ్యపురుషుఁ డతఁడ పో! కృష్ణమూర్తి వే
పాన్వయ ప్రభూతుఁ డమరకీర్తి

నేఁ డధికారగర్వమున నిప్పులు క్రక్కెడివారు, ధర్మమున్
జూడక లాఁతివారి సిరి జుఱ్ఱఁ గడంగెడివారు, లోక మే
కీడున బ్రుంగి యెంత తలక్రిం దయినన్ దయరానివారుఁ గా
కోడక యిట్టి త్యాగమున కొగ్గెడివా రిల నెంద ఱుందురో!

తన యధికార మెల్ల జనతాసుఖసాధనకే యటంచు న
మ్మిన మహనీయు నెట్లు దిగమ్రింగితి వీని? మహాస్రవంతి! మా
కనులఁ దొరంగు బాష్పముల కాల్వలు పట్టియుఁ బట్టనట్టులే
చనియెద; వింత బెట్టిదము సైఁచుట కీ వెటు లిచ్చగించితో!

ఏల నీ కింత పొం? గిది యెన్నినాళ్ళు
నిలువఁగల దోసి!మా యింజనీరు కృష్ణ
మేను కబళించితివి గాని వాని విశద
కీర్తికాయమ్ము చెనకఁ గల్గితివె నీవు ?

అది నిర్వికల్పమ్ము కర్జ మెఱుఁగని యధికారి యెడఁదఁ
గుదురుకొన్న తమస్సుఁ జీల్చి చెండాడు క్రొత్త వెలుంగు,
కదలి విజయవాడకు నరుదెంచెడి గఱువల కంటి
తుద నది యశ్రు లూరించి భక్తి హేతువుగాఁ జెలంగు (పైరపంట 18-6-1961)

**శ్రీ జవ్వాది లక్ష్మయనాయడు**

రాయలకైవడి లక్ష్మయ
నాయఁ డహెూ! కవులపాలి నందనవనమై
మాయని కీర్తి గడించెను
తీయని చుట్టముగ బ్రదికెఁ దెనుఁగుం బ్రజకున్

కొందఱ మెప్పుం గను వా
రెందఱొ కన్పింత్రు; నాయఁ డెంతసుకృతియో
యందఱమెప్పుం గనె; నీ
చందము వా రప్పుడపుడు జనియింతు రిలన్

(సమదర్శి 1-5-61)

**మహాకవి శ్రీ కాటూరి వేంకటేశ్వరరావు**

ఆకాలమ్మున గౌతముఁ
డీ కాలమునందు గాంధి యిద్దఱు హింసా
వ్యాకుల జగతికి శాంతి
శ్రీకరులు దయావిధేయ జీవన నిరతుల్

అన్నా!వారల తెన్నులు
కన్నులు బాష్పాంబుఝరులు గాఁ గరఁగించెన్
నిన్నును నన్నును; నివి మన
పన్నిన కైతలకు మూలబంధము లయ్యెన్

ఎందఱెందఱో కవీశాను లీనాఁడు
జనులమనసు చూఱగొనిరి గాని
నాకు మిగుల నచ్చినకవీంద్రుఁ డల వేంక
టేశ్వరుండ యితని కేటికోళ్ళు

పసిఁడి మేడలఁదలిరాకుఁబాన్పులందుఁ
గనని సౌఖ్యము గుడిసెలోఁ గటుతరార్త
సేవలోఁ గన్న లేజంట దేవునట్లు
వెలసె నింటింట నీ తెన్గుఁబలుకుపంట

పిండితివి రావణుని ఱాతిగుండె నుండి
భక్తిరసమును; హరిజన ప్రాభవాను
రక్తిమై నీవు పల్కిన సూక్తు లెల్ల
నంధ్రవాగ్దేవి "గుడిగంట" లగుచు మొరసె

ఓహెూ! కవిలోకమణీ!
జోహారులు కొనుము, చంద్రచూడ సపర్యా
దోహలుఁ డెబ్బిన మధుర
వ్యాహారము నీకుఁ దక్కె వంశానుగతిన్

ఈ సర్వము నొకయెత్తుగ
నీసునకున్ గర్వమునకు నెంతయు దవ్వౌ
నీసుజనత యొకయెత్తుగ
దాసిన చుట్టంబ వైతి ధర నెల్లరకున్

ఒండొరులు చేరినపుడు "కాటూరి" కులుఁడు
మిక్కిలిగ నన్నె నన్నె ప్రేమించు ననుచుఁ
బెనఁగుదురు నీ ప్రసక్తిలోఁ దెనుఁగువార
లెంతపండి తహెూ! వేంకటేశ్వరకవి!

కదలినా౨డ వీవు వదలి యీ జంజాట
మిటకు౨ దిరిగిరాని యెడకు౨ గడకు;
నిన్ను మఱవ౨జాలకున్నారు మాదృశుల్
మదిని ముమ్మరించు మమతకతన

నీ సంస్కృతి చిహ్నముగా
నీ* సత్కృతి నీ కొసంగి యే నిపుడు సమా (*నేను)
శ్వాసిత చిత్తు౨డ నయ్యెద
నో సుకవీ! స్వీకరింపు ముడుగర దీనిన్

నామనుగడ నా పలు కే
నేమమ్ముల వెలయు నవియ "నే" నను కృతిగా
నీమహితాత్మున కిచ్చితి
సోమించిన తనివితోడ౨ జొక్కుచు దానిన్ ("నేను" 5-1-1963)

**శ్రీ గద్దె లింగయ్య (తెలుగులో శరత్శ్చంద్ర సాహిత్య ప్రచురణ కర్తలు)**

స్వీయదేశ స్వతంత్రతాసిద్ధికొఱకు
నైకముఖసేవ లొనరించి యలసి యలసి
గఱువ లిడు గద్దె వడసిన గద్దె లింగ
యాఖ్యు౨ డిల వీడెనా! షష్టియైన౨ గనక

సరసతయు సానుభూతియు సందడింప
నొరులతో ముచ్చటించు నేర్పరి యితండు
నేర్పుగా దిది యెనలేని యోర్పు గాని
యుక్తిగా దిది సరిలేని రక్తి గాని (సమదర్శి 27-12-63)

**శ్రీ శొంఠి రామమూర్తి**

యుగయుగమ్ములు బొజ్జ నునిచి నాగానది
    యాంధ్రుల కొస౨గిన యమృతవీచి
తరతరమ్ముల నుండి తల౨గని కఱ వార్చి
    పశ్చిమాంధ్రులకు౨ దోడ్పడినయన్న
దండకాటవుల౨ గేదారఖండమ్ములు

వెడలింపఁ బెనఁగిన గడుసుకాఁపు
సకలాంధ్రజాతీయ సంపత్ప్రవంతులు
వెల్లిగొల్పిన సంవిదుల్లసితుఁడు
గణితశాస్త్రముతో జగత్కర్త గుట్టు
నూఁచముట్టుగఁ జూచిన యుత్తమర్షి
శౌంతి కులజుఁడు నమ్రతాసుందరుండు
కదలెనా! రామమూర్తి సత్పదముదెసకు

మర్త్యుఁ డిట నెల్ల కాలమ్ము మనఁడు గానఁ
బ్రాజ్ఞుఁ డితఁ డేగె నని డిల్లపడను గాని
యితనికిన్ దగ్గపీఠము నీయలేక
చెడెఁగదా తెల్గువాఁ డని సిగ్గువడెద. (సమదర్శి 6-2-64)

**శ్రీ గొల్లపూఁడి సీతారామశాస్త్రి**

జోహారు! స్వామిజీ! జోహారు! నీకు
జోహారు! గాంధేయ శోభాశరణ్య
ధన్యతామూర్తి! సీతారామయోగి
జోహారు! వినయాశ్రమాహుతప్రాణ!

నిఖిలభారతభూమి నేఁడు నీపూజ
నెఱపుచున్నది భక్తి నిష్ఠమై నిలిచి
సేవామయం బైన, చిరతర త్యాగ
తేజోమయం బైన నీ జీవితమ్ము

దలపోసి పులకించి తనియు చున్నది మ
హాకవి కావ్యమ్ము నట్లు నీ బ్రదుకు
సకలమ్ము లోకైక సందేశమయము
వికృతుల నన్నింటి వేలిచి వేల్చి
శాంతి నార్జించిన సంయమ వీవు
నిష్ఠానిధీ! నీవు నిల్చిన యడవి
తీర్థమై మహినెల్లఁ దిగిచె నచ్చటికి
బాపుజీ వేంచేసె భన్సాలి వచ్చె

వచ్చె భావేబుషి వచ్చె రాజేంద్రుఁ
డభినవభారత ప్రభ కాది కార
ణములైన పెద్దలందఱు వచ్చి తనిసి
రద్దిరా! నీ వినయాశ్రమక్షోణి
యాచార్య పీఠమై యలరె యోగీంద్ర

అర్థంబు కామంబు నామిక చూపి
ధర్మవు నణఁచి తైతకలాడు నేఁడు
నీవు లేవని మేము నిట్టూర్చు చుందు
మీవు లేవని క్రుంగి యిల్లిగ్గుచుందు

మొకవినోబా తప్ప నిఁక నేఁడు మాకు
దిక్కెవ్వరయ్య గాంధియుగమ్ముపేరు
నిలుఁపగా నత్యంత నియతిమైఁ బెనఁగు
వలఁతుల కార్తసేవాతత్పరులకు

సర్వోదయోద్యమ సంచాలకులకు
భవదీయ శీలంబు భవదీయ తేజ
మండగా దండగా నలరారుఁగాక!
అభయం బొసంగి మే లని పల్కుఁగాక! (సమదర్శి 28-3-1964)

జీవమును మాతృమహీ
సేవనమున కప్పగించి చిరతరకీర్తి
శ్రీవాల్లభ్యము నందిన
కోవిదు మా గొల్లపూఁడి కులజున్ దలఁతున్

తెల్లవాని గుండె తెర్లె సీతారామ
శాస్త్రి నితని విన్న జలదరించి
కుంటు వడక వచ్చు గుంటూరి వాసికి
వాసి దెచ్చె వీరవర్యుఁ డితఁడు

కత్తి కఱకు లేని కదన మీ సర్దారు
నేర్పినాఁడు తెనుఁగునేల కెల్ల

బోసినోటి నవ్వు పొంగులతో "విజ
యో" స్తటంచు గాంధి యుగ్గడింప

నిర్భయుఁ డితండు నమ్రత నిండి తొనఁకు
మానిసి యితండు దైవసంపదలనెల్ల
నాఁచికొన లెస్స పెనఁగిన యనఘుఁ డితఁడు
సిద్ధి వడసిన సాధక శ్రేష్ఠు డితఁడు

భారతీయధర్మ పరిపాకమూర్తిగా
సంన్యసించినట్టి స్వామి యితఁడు
కావి గట్టుఁగాక సేవకు దవ్వుగాఁ
జనఁడు ప్రాజ్ఞుఁడన్న సాధు వితఁడు (సమదర్శి 2-4-1965)

దేశము స్వతంత్ర మైనను దృష్టిపడక
పదవులకు నారటింపక పట్టువిడక
తనువు నుజ్జన కావించుదనుక నొరుల
నొవ్వు లణఁచిన మా స్వామి కెవ్వ రీడు

తేటతెల్లమైన తెలుఁగున వేదముల్
వెలువరించె ధర్మవీరుఁ డితఁడు
తాఁకరానితనము పోకార్చి యర్చింపఁ
దగినబాఁపఁ డాయె ధన్యుఁ డితఁడు

హరిజన ప్రవేశ మంగీకరించిన
తెలుఁగునాటి మొదటి దేవళమ్ము
కలదు కలదు మాకుఁ గల దని కావూరి
కవిని నేను గుల్కఁ గత మితండు

ప్రజల కొఱకు బడలి బడలి పోయిన సుచ
రిత్రు నితని సంస్మరించు కొనుచు
నంధ్రజాతి గణ్య మగుఁగాక! స్వామీజీ
వెలుఁగు లిరుల ననుభవించుఁగాక! (సమదర్శి 2-4-1966)

అలఁతగనని సేవ వలచి బాపూమది
కొల్లగొన్న జోదు గొల్లపూఁడి;
గణన కెక్కఁజాలెఁ గావూరు మాయూరు
శాస్త్రి చలువ శాంతి సమరములను

శాస్త్రి పఱపిన వెల్గు మా జనపదమున
గుదురుకొన్న తమస్సును జిదిమి వైచె
నేను గాంధిమహాత్ము నాస్థానకవిని
గాకపోవచ్చు నీవెల్గు సోఁకకున్న

శాస్త్రి యెది యొనర్చిన నది శస్త్రధార
పైని బరువెత్తినట్ల యత్రమును గూర్చు
నదిర! తుదినాళ్ళ నితఁడు జిహ్వాది పొగరు
డింప నీ కొన్నసరణి కడింది కరణి

మూన్నాళ్ళకు నొక పూఁటగఁ
దిన్నాఁ డితఁ డన్న; మదియుఁ దిక్తచ్ఛదమే
యన్నన్న! యిట్లు తినుచున్
బన్నిద్దఱు చేసినంతపని యొనరించెన్

ప్రాచీనులగు మహర్షులఁ
జూచితి మాశాస్త్రి యందుఁ జూచితి దైవ
శ్రీ చెలువ మవల మోహము
రాచితి నౌచిత్య మెఱిఁగి వ్రాసితిఁ గవితన్ (నాకథలు - 1968)

**నరేంద్రుఁడు (శ్రీ ముళ్ళపూడి తిమ్మరాజు కుమారుడు) తణుకు**

తాతయుఁ దండ్రియు నన్నయు
హేతువుగ నరేంద్రుఁ డంతకృప నేర్చె ననన్
జేతం బొప్పదు "ఋషివా
లీ" తీర్థమె బీజ మతని లెస్సకు నెల్లన్

ఆర్తసేవ యీావి యణఁకువ కృప యప
రిగ్రహమ్ము నెమ్మి ఋతవచస్సు

గఱపు శిష్యతతికి గురుకుల; మది మది
వెఱపు దీర్చి బ్రదిమి కొఱపు గూర్చు

సిరులు హెచ్చినపుడు నరుఁడు దానము సేయ
వచ్చు నీవి కొగ్గవచ్చుఁ గాని
కృపను జూపఁగలఁడె? కృప పేదకైనను
గలుగవచ్చు నార్తుఁ గన్నవేళ

కృప యన్న నేమి? కరఁగుట,
విపన్నుల యవస్థఁ జూచి వేఁగుట; శీతా
తపబాధల నీరెండిటి
నెపుడున్ వరియించు సుకృతి యెన్నాళ్ళుండున్?

ఉండ కమ్మనిస్వి కొండిక నాఁడె యీ
పుడమి నుజ్జగించి పోవుఁగాక
పోదు వాని కీర్తి భువనమ్మున రవీందు
మండలముల రుచులు మలయుదాఁక

వేదులసూర్యుని కవితయు
నాదరువై యతని మెఱయు నాంధ్ర ధరిత్రిన్
స్వాదూక్తికి శుచివాణికి
రాదుగదా చేటు యుగపరంపర చనినన్

తిమ్మరాజ! సాహితీ బాంధవమ్ము నీ
కహరహమ్ము నిష్ఠ మగుట కతన
నింత చేసితివి నరేంద్రునకున్, బల్కఁ
దగిన, పాడఁదగిన తండ్రి వీవు

అతఁడు నీ నరేంద్రుఁ డైన నీ వడలుట
తప్పు గాదు కాని తత్ కృపాళు
వెల్లమానవుల నరేంద్రుఁ డైనాఁ డిఁక
వలదు నీకు దిగులు వలదు రాజ!      (సమదర్శి 12-3-66)

## శ్రీ వేలూరి శివరామశాస్త్రి

కావ్యసృష్టి సేయఁ గాఁడుపో? ఋషిగాని
వాఁ డటన్న మాట వాసి నిల్పి
తెలుఁగువాని కన్ను తెఱచిన శివరామ
శాస్త్రి వెడలి తేమి జగతి వీడి

అందఱు నేగెడువా రని
మందునకుం దెలియుఁ గాని మహనీయుఁడు పో
వం దెలివిసెడి నరుం డెదఁ
గుందుఁగదా కుడిబుజమ్ము కోల్పడ్డ గతిన్

ప్రాఁబలుకుఁదొట్టి బవినీంద్రపాటదనుకఁ
ద్రచ్చిన మహామనీషి సత్తముఁడ వీవు
ఇంత డయ్యుట వలనన యెంతకడిఁది
చదువు నైనను వివరింపఁ జాలి తీవు

అన్న! నీదుకృతులు కొన్ని కాలిన వను
వార్త మదిని గలఁచివైచుఁ గాని
యొక్కపలుకు చాలు యుష్మదీయము బుధ
వ్యూహవినుతు లంద యుగయుగాలు

విత్తదాహ మెగసి చెత్త చెదారము
పూఁట కొక్క బండి ప్రోవు సేయు
కవులకతన వాపుగాక సాహితి కెంత
బలుపు వచ్చు నెంత పొలుపు సొచ్చు.

ఈవు కాటూరి వేటూరి కోవిదుండు
శిష్యులై తన్ను సేవింపఁ జెళ్ళపిళ్ళ
కనినతృప్తికి మితిలేద మును పొనర్చు
పున్నెములు పండి యతని కీవన్నె వచ్చె

మతము కులము శాఖ మఱచి యెవ్వని పాల
నొఱపు లున్న మెఱయ నోర్తు వీవు

ప్రజలు భవదుదార భావమ్మునకు సత్య
నిష్ఠ కంజలింత్రు నింత్రు ముదము

ఒరుల మెచ్చుట తక్క నీ వెఱుఁగ వాత్మ
శంసన మహంత యెఱుఁగ వీర్వ్యయు నెఱుంగ
వఖిల దైవసంపదయు ని న్నా శ్రయించె
నిఖిల దేశము నిను దేవునిగ భజించె

ప్రాత స్స్మరణీయమ్ములు
నీ తెన్నులు దంభమోహ నిర్మూలకముల్
జోతింబలె నీ వాంధ్రుల
చేతమ్ముల నుందు వెపుడు శివరామసుధీ! (సమదర్శి 19-4-67)

**శ్రీ జాస్తి వేంకటనరసయ్య**

నరసయ్యా! నీ మనుగడ
నఱువది యేండ్లైన నిండ వదియేమి మహిన్
దొఱఁగితి వీ మాత్ర కెటన్
సురిఁగితి సచ్ఛాత్రబంధు సుహృదులు కుందన్

నా మేనల్లుఁడ వనుచున్
నామెఱుఁగులు కొన్ని లేని నాదార వటం
చేమఱి చులుకం జేయక
వేమఱు ప్రేమించి గౌరవించితి నిన్నున్

నీ జనకుఁడు జనకధరి
త్రీజానికి దొరయగున్ బ్రతిష్ఠితబుద్ధిన్
నీ జీవన మీ సుబ్బయ
తేజునకున్ దేజు గూర్చె ధృతయమ నిష్ఠన్
ఔపనిషదార్థ మెఱిఁగితి, వఫలసంగ
యోగమర్మము గంటి, గీతోక్తి త్రచ్చి
మూఁడు నాలుగు బాసలఁ బ్రోడ వైతి
పెద్ద లౌనన మనువును దిద్దుకొంటి

నిప్పువంటి బ్రదుకు నీది, జితేంద్రియ
చక్రవర్తి వీవు వక్రమార్గ
గామి గాని దృష్టితో మహర్షివిధాన
మంటి వీవు, గెలుపుగంటి వీవు

పెదపూఁడి వీడి పండిత
పద మీకొని చిలుకలూర బహువత్సరముల్
కుదురుకొని శిష్య సంతతి
మదికిన్ వెలుఁ గిడితి రేపు మాపు మనస్వీ!

మతము కులము లేని మానిసివై చిల్క
లూరిపేఁటవారి యుల్లములను
దోఁచుకొంటి వీవు శౌచనిధాన! నీ
ప్రజ్ఞ చూడ జగము పండ్లు పులియు

ఆలుబిడ్డలు కలవారి నరయుచుట్ట
లుర్విఁ బదుగురో యిరువండ్రొ యుంద్రు గాని
దారి దప్పని యూర్ధ్వ రేతసుని నిన్నుఁ
గాచు బందుగు లింటింటఁ గానిపింత్రు

మున్నీరు వోలె వెచ్చని
కన్నీరు వెలార్చు దాత కన్నయ నీకై
వెన్నకు మెత్తన నేర్పిన
యన్నకదా జాస్తి నరసయార్యుం డనుచున్

కూడు లేక నవఁత గడుచు పేదలు నీవు
పోక తమకు ముప్పు రాక యనుచుఁ
బేఁట నాల్గుదెసల బెగ్గిల్లి యేడ్చుట
వింటి నిన్ను మెచ్చు కొంటి సుకృతి

వందలుగా నపుడప్పుడు
చందాల నొసంగి దాన శాసనముల కె
క్కం దలపోయవు దీనుల
కింద మనుచుఁ బరక వీస మిచ్చెద వెపుడున్

పూఁటకూటి కీవు పోవుచు దారిలో
నాఁకటం దపించు ననదఁ జూచి
దయకు లోఁగి నీదు దరిని విస్తరిని వే
యింతు వతని కెవ్వఁ డింత కరఁగు?

కరఁగి యిచ్చిన దల్పమౌఁగాక, యదియ
నిక్కమగు నీవి, జగము మన్నింపఁ దగిన
దాతయు నతండ, తాదృశు లే తదవని
భరము సైరింతు రుక్కుఁగంబములవోలె

తల్లి బానిసమ్ము తలఁగ నూనూఁగు మీ
సాలనాఁడె చెఱకుఁ జని నలంగి
దేశభక్తి చాటితివి; లోకసేవార్థి
కెదిరి పెండ్లి; యనుచు నెంచి తపుడె

ఈవు గ్రంథాలయోద్యమ సేవనమున
ముగ్గినాఁడ వటం చేల యుగ్గడింప
ఉద్యమము లెన్ని సాగె సర్వోదయమున
కవి సమస్తము సేవ్యంబు లాయె నీకు

కృతులు రచించితి విద్యా
చతురులు దావూదు వంటి సత్కవు లిడఁగాఁ
గృతు లందితి ప్రజ మెచ్చన్
బ్రతికితి నరసయ్య! కీర్తి పండెను నీకున్

జగము నా తలపై విరుల్ చల్లునపుడు
కనెదు కనకాభిషేకసుఖమ్ము నీవు
*చిన్నకృతినైన నీకు నిచ్చితిని గానఁ *శబల
గుడుతు నీ పట్ల నరసయా కొంతశాంతి (సమదర్శి)

**ఇచట యా యంకిత పద్యములను చదవండి**

నా మేనల్లున కిల్లు వాకిలియుఁ గాంతావిత్తముల్ కామ్యముల్
గామిన్ బెద్దకలంగి డీల్పడుదు రక్త స్పర్శ మూలమ్ముగన్

సీమల్ దాఁటిన తద్విరాగము కృతిస్వీకారభోగాహిత
ప్రేమంబై వడితగ్గి నా మదికిఁ దృష్టింజూపె నీ నాఁటికిన్

ప్రతిభకుఁ గాదు, నేరిచిన ప్రజ్ఞకుఁ గాదు, వయఃప్రమాణ గ
ణ్యతకునుగాదు, లౌకికమహత్త్వకుఁ గీర్తికి మూర్తి కేని గా
దితని జితేంద్రియత్వమున కేను గరంగి కృతిప్రదాతనై
సతత సుఖాయురున్నతి వశంపడ దీవనలిత్తు వీనికిన్

ఈతని తండ్రి సద్గుణ మహిష్ఠుఁడు, పండితుఁ డస్మదీయ ధీ
చాతురి కాదితీర్థ మభిజాతుఁడు సబ్బయ మామ కీన మీ
రీతి నెఱింగి పొంగు నను దృష్టియు నేత దుపాయనం బిడన్
హేతువు; పుత్ర రూప గురుఁడేకద! వీఁడు శ్రుతిక్రమమ్మునన్

అటు గురుని ఋణము దీర్చుట
కిటు సోదరి బిడ్డవలపు నీడేర్చుట కొ
క్కటి చాలున్ బని యని వేం
కట నరసయ కితని కిడెదఁ గవితన్ శబలన్

పతితోడ నపవర్గపదముఁ బాలించు నీ
జనని శేషమ్మ వత్సలత నింపి
కృతికన్య నన్ను కిచ్చితి మని దివినున్న
యనుఁగుఁ జెల్లెలు రాఘవమ్మ పొంగి
నీ కాఁపురంపు వెన్నెల వెల్లిఁ దోఁగి మా
తామహి చెంచమ్మ తనుపు వడసి
తన కుదు ర్వెలయింపఁ దలకొన్న నిన్నుఁ బౌ
త్రుఁ దలంచి చల్లయార్యుండు సొగసి
తరుణతరుణ, కుంకుమహరిద్రా సువర్ణ
శబల, సురభిళ, సుమన-యాసారధార
లెసఁగ దీవింప నిత్యసాహిత్యరాజ్య
రమను గైకొమ్ము జాస్తి వంశమణిదీప!

శిక్షితచిత్తవృత్తిని వశీకృతవైదుషిఁ గావ్యశిల్ప స
ద్గక్షమధీ నుదారత నిరర్గళదేశికతన్ స్వదేశ దా

స్వక్షతికై చెఱన్ బడిన యార్తి పరంపరఁ గన్నకీర్తి నీ
యక్షర సంప్రదాన మసువై నిలుపన్ బొలుపందు మల్లుఁడా! (శబల - మార్చి 1955)

"శబల" నిచ్చితిని యశఃక్షీరమును బిండ
నెరసుకంపు లేని నరసకవికి
నేల పెక్కుమాట లితఁ డాధునిక భీష్ముఁ
డార్తలోకమునకు నమరశాఖి

ఇతఁడు మేనల్లుఁ డగుట నా కించుకంత
సొమ్ము ముద్రణవేళ నీఁ జూచెఁ గాని
వలదురా, పట్టు సాగిపోవలయు నాది
నను నిలుప హట్ట మున్నది నాఁగ నాఁగె

బ్రహ్మచారి యితఁడు పదిరూకలు లభించు
దారి నుండె నితఁ డుదారుఁ డితఁడు
ఎట్టిఁ డైన నేమి? కట్టు కట్టడ నాది
దాని మాన్ప బ్రహ్మతరము గాదు (నాకథలు - 1968)

రేపే యని నేఁడే యని
యీపూఁటన యని త్వదీయ మృతి నెఱిఁగింపన్
నీ పడసిన పాండిత్యము
నీ పూనిన జపము తపము నెఱి యెట్టిదియో!

ప్రన్న ప్రన్నని విరులలో నిన్ను ముంచి
ముడుఁగు మోములఁ బితృవనమ్మునకుఁ జేర్చి
పేఁటవారెల్ల నీ దెసఁ జాటినట్టి
చరమగౌరవ మేనాఁడు మఱవఁ జాల

శోకము మోహము పుట్టని
చీఁకటి చిన్నియలు లేని సీమకుఁ జని య
వ్యాకుల మతి నున్నాఁడవె!
నీ కొదవుత శాంతి గుణఖనీ! యవిరతమై

మీయమ్మ శేషమాంబకు
మా యక్కకు నిన్నుఁజూచి మైగగ్గురుతో
డాయు నుదాత్త చరిత్రకు
నాయంజలి సెప్పవోయి! నరసమనీషీ!

చెల్లి రాఘవమ్మఁ దల్లితో నిలిచి నీ
తనువు నిమురు పిన్నదాన్నిఁ జూచి
యేమి తప్పు చేసె మామయ్య? నీ విట
కేల వచ్చి తోసి బేల! యనుము

దీనికొఱ కేను దపసినై తీవ్ర దీక్ష
నూఁదితిని జవ్వనమ్మును మీఁదు కట్టి
మెఱపువోలెఁ దళుక్కున మెఱసి యపుడ
కదలె నిది నన్నుఁ బాసి లోకమును రోసి

ఈమె యెడ నింతవక్కణ యెఱుకలేని
చేఁత యగుఁ గాని నరసయా! నా తలంపు
నా కనులు చెమ్మగిల్లుచున్నవిర యిచట
వ్రాయని మ్మింతమాత్ర నావంత సమయ

నవ్యఁబోకు మోయి నన్ను బాధించెడు
మమతఁ జూచి విడని మఱఁపుఁ జూచి
సుఖము దు:ఖ మొక్క చూడ్కి నీక్షించిన
జ్ఞాని వీవు మోహధాని నేను

శుకుని బ్రదిమి కీడు జోడుగా బ్రదుకుట
నేర్చి తీవు; నీవు నిల్చుకతనఁ
జిలుకలూరిపేఁట తెలుఁగునాటం దన
పేరు సార్థకమ్ముగా రహించె

నిన్నుఁ దనగడ్డలో దాఁచుకొన్న పేఁట
తెలుఁగువారికి నరసయా తీర్థమయ్యె;
ప్రజలు యుష్మత్సమాధిపైఁ బ్రసవమాల
లునిచి నీ శౌచ మెంతురు యుగయుగాలు (సమదర్శి - 4-5-1967)

**శ్రీ క్రొత్త రాజబాబయ్య (రాష్ట్రపతి అవార్డు పొందిన ఆదర్శ హెడ్మాస్టర్**
**సంగంజాగర్లమూడి, గుంటూరు)**

నిప్పువంటి నడత, నెఱవణిగల నేర్పు
కష్టసుఖసమీక్ష గనని దీక్ష
రాజబాబయాఖ్యు 'నాజానజము లౌట (‘పుట్టుకతో వచ్చిన గుణములు)
దేశమున కితండు దీప్తి దెచ్చె

సత్యమును నేర్పె, ధర్మసంసక్తి నేర్పె
వీటిఁబోవు టెఱుంగని విద్య నేర్పె
నితఁడు నేర్పని విన్నాణమెద్ది బుడుత?
కోజలకు నోజ యయ్యెఁబో! రాజబాబు

మదికిఁ బదనువెట్టి, హృదికి వెన్నెలఁ జేర్చి
శిష్యతతికిఁ గ్రొత్త చేవదెచ్చి
ప్రథితి గన్న రాజబాబయ్య పోయెనా
గురుకులమ్ము లార్తిభరము మోయ

అంతేవాసి హృదంతర
సంతమస చ్ఛేత్తృ, ధీప్రసాదను, మోహ
భ్రాంతి దవిష్ఠుని, సుకృత ని
శాంతుని, శాంతుని దలంత్రు సజ్జను లొజ్జన్ (సమదర్శి 23-7-1967)

**శ్రీ అల్లూరి సీతారామరాజు**

చక్రవర్తులు రాజులు సచివముఖ్యు
లుత్తమోత్తమయోద్ధ లనుత్తమాంధ్ర
కవులు పుట్టినగడ్డయై గణుతిగన్న
గర్తపురసీమ “బొప్పూడి” గ్రామ మలరు.

ఆయూరఁ గలరు శత్రు ని
కాయ మదోన్మథన శౌర్యగణ్యులు విశ్వ
శ్రేయోర్థులు బాహుజు; లం
దాయత యశమున్ గడించి రల్లూరి కులుల్

ఈ వంగడపువారు కొందఱు బాంధవాదులఁ బట్టి
మహిత పశ్చిమ గౌతమీ మండలమున
బేరుగాంచిన చాళుక్యభీమవరము
చెంత నలరారు "మోగల్లు" చేరి, హలము
పట్టి పంటలు పండించి రిట్టలముగ

**మంజరి :** ఇందు వేంకటకృష్ణనృపతి సుతుండు - వేంకటరామ పృథ్వీపతి సూర్య
నారాయణాంబికా నాథుఁడై దీప్తి - రాశి సీతారామరాజను తనయుఁ
గనియె, నబ్బాలుండు కాలక్రమాన - జినచిన్న చదువులఁ జేవనార్జించి

యావెన్క నున్నతమగు పాఠశాల - నాశ్రయించెను, గాని యచట బోధించు
నాంగ్లభాష రుచింపదాయె నాతనికి - నది భారతీయత నణఁగించు భాష
యది బానిసతనమ్ము నడరించు భాష-యది కూడదని తోఁచె నాబాలకునకు;

నతనిలో రాజకీయాగ్ని దీపించె-వానిలో స్వాతంత్ర్యవాంఛ రేకెత్తె
విద్యాలయంబును విడనాడె రాజు; - దేశాన నలుగడఁ దిరిగెను రాజు
కూడుగుడ్డలు లేక కుమిలెడిపేద - లజ్ఞాన భరముతో నల్లాడుపేద
లే సీమ, నేయూర , నీవాడఁ గనిన - గన్పించి రతని కగ్గలముగా నప్పు;
డీ దురవస్థకు నింగ్లీషువారి-యాధిపత్యమె హేతువని నమ్మె రాజు
పరుల యేల్బడి కగ్గపడిన ధరిత్రి-యెదియుఁ గోల్కొనదని యెంచెను రాజు

ప్రజలలోఁ జైతన్యబలము హెచ్చించి-ప్రజలలో విప్లవ ప్రవణత గూర్చి
తెలవాని జెండాను దింపి, జాతీయ-వైజయంతిక నెత్త వాంఛించె రాజు;
క్రన్నన భద్రాద్రి కడనుండు వనుల-కే తెంచి (1922)కోయల, నెఱుకలఁ,జెంచు
వారలఁ గాంచి మీ వనటల కెల్ల-నీ ప్రభుత్వమె కదా హేతువు, దీని
నణఁగింపకున్న మీ కబ్బునా సుఖము-కట్టెకు దుంపకు గడ్డికి వెదురు
బియ్యమునకుఁ బన్ను విధియించురాజ్య-మెన్నాళ్ళు సైఁచెద, రెన్నాళ్ళు బేడ
కూలితోఁ గంకరగుట్టలు మోసి-ఱాబాట నిర్మింత్రు, రాచఱికమున
కాఁకటి కోర్వలే కక్కటా! చింత-పప్పు జావనుద్రావిభయదరోగముల
నెన్నాళ్ళుమూల్గెదరీ నీతిలేని-మూఁకనునెన్నాళ్ళుమ్రొక్కెద రనియె
నతని పల్కులు నచ్చె నాటవికులకు-నతఁడు దైవతమాయె నాప్రజాతతికి

వచనము : వారి నాయకులు గాము గంటముదొర, మల్లుదొర యనుసోదరులు
యోగి వేషమునం దనరు సీతారామరాజునుకలసి యయ్యా! మీరు మాకు

నాయకులుగా నుండి కృష్ణదేవుపేఁట రామాలయమున నివసింపవలయు అని వేఁడగా, రాజు వల్లెయనియె. అంతరాజు గాము సోదరులతో కలసి మన్నెమునం గల ప్రజలను జైతన్యవంతులను జేయ సాగె. అపుడు ప్రభుత్వమువారు కృష్ణ దేవుపేఁట వదలి నరసీపట్టణమునంద నిలువవలెనని శాసించగా,రాజు అచటకు చేరెను. అయితె అతడు నిశాసమయమున మన్నెము చేరి ప్రజలం గలసికొని వారికిఁ దిఱుగఁబాటు తెఱఁగుం గఱప మొదలిడె - అంత

ఆటవికు లధికారులమాట వినక
మూటముల్లెలు మోయక మొక్కవోని
పట్టుదలఁ జూపఁ బశువులఁ గొట్టినట్లు
కొట్టి రవ్వారిఁ బొగరుపైకొనఁగ దొరలు

ప్రజలు తాల్మివీడి బాఁకులు బల్లెముల్
పట్టి రామరాజుపజ్జ నిల్చి
రరుల గుండె లదర, నార్చిరి విప్లవ
శంఖ మొత్తి రాకసమ్ము ప్రిదుల.

వచనము : అల్లూరి వీరుఁ డీదండుతోఁ గదలి చింతపల్లి మున్నగు తావులఁగల పోలీసుఘట్టముల నాక్రమించి, యందలి యాయుధములఁ బరిగ్రహించె. అపుడు ప్రభుత్వమువారు రాజును బంధించ నిలువ మూఁకను (Reserve Police) పంప, నది విఫలమయ్యె - అంతట మలబారుసేన వచ్చె - అదియును పరాభూత మయ్యె -పదంపడి అస్సాము నుండి శతఘ్నిదళ మేతెంచె - అపుడు రాజు తన అనుచరులతో-

మన్నెజోదులార! మనపాలి పండువు
పొలిచె నేఁడు పుణ్యములు ఫలించి
పగఱు పిచ్చలింప మగపాడి మెఱయించి
త్రెంపరయ్య బానిసంపుఁ ద్రాళ్ళు

తనువు నిలువ దెన్ని తంటాలు వడినను
యశ మొకండె నిత్యమై వెలుంగు
యశముకొఱకు నసువులర్పించి రెందఱో
బిరుదుమగలు విశ్వ మరుదుపడఁగ

కోరఁడు కోరఁడు భారత
వీరుఁడు రుజ నింట నొడలు వీడుట నెపుడున్
దారుణరణమరణంబున
కారటపడు నాతఁ డెట్టియాపద నున్నన్

ముక్కంటికైన మానము
దక్కనె మన ముందు కత్తి తాల్చి నిలిచినన్
మిక్కిలిన తెల్గుమగఁటిమి
నుక్కఱి పరసేన పఱవ నుద్ధతు లగుఁడీ!

కూటికిఁ బెనఁగెడి సైన్యము
పోటీపడునొక్కొ మాతృభూమీ దైన్య
స్ఫోటవ్యగ్రధ్వజినీ
ధాటికి; జంకేటి కాయితంపడుఁ డన్నల్!

అనుడు నతని పల్కు లావేశమును బెంప
ననికి నుత్సహించి రాటవికులు
గొనయ మెక్కువెట్టి ఘోరవిషాక్త బా
ణములు పఱపి రరిగణమ్ము దెసకు.

పేల్చిరి తుపాకులను, బెద్దపెద్దఱాల
విసరి రహితుల మస్తముల్ వ్రీలు పగిది
నెల్లయెడలఁ దానై మొన కేపుగూర్పఁ
దొడఁగె సింగపుఁగొదమ కైవడిని రాజు

**వచనము :** అంత సర్కారువారిసేన మరతుపాకులు, ఫిరంగీలు కాల్చసాగె-సంగరము ఘోరముగా సాగుచుండె-ఇరువాఁగులఁ బెక్కండ్రు జోదులొఱఁగిరి-ఇంతలోఁ బ్రొద్దుక్రుంకి చీఁకట్లలము కొనంజాగె-అపుడు రాజుదండు తెగించి శత్రువ్యూహమును భేదించి అడవిలోనికి పోయె-సర్కారు బంట్లపుడు ప్రజలను చంపసాగిరి-అంత రాజు తన దళమును బంపె - ఈ పెనఁకువ విప్లవ యోధులు అగ్గిరాజు, మల్లుదొర మొదలగువారు పగతురకుం జిక్కిరి-తన వారికిం బాటిల్లిన దుర్దశ కెంతేని కలఁగి రాజు కర్తవ్యముం దడవు చుండ

మింటికి నంటెడు మంటలు
కంటికిఁ గన్పించె; రిపులు గ్రామములకు ని
ప్పంటించిరిపో! యని, యా
వెంటన సడిసన్న తెల్గువీరుఁడు లేచెన్.

వెఱవకుఁ డో ప్రజలారా!
వెఱవకుఁ డిదె వచ్చుచుంటి విమతధ్వజినీ
శిరములఁ ద్రుంచుట కనుచున్
గరవాలమె తనకుఁ దోడుగా నతఁ డెగసెన్

ప్రళయరుద్రు నట్లు పరుగెత్తు రాజును
బొంచియున్న పగఱు కాంచినారు
బెదరి యెదురలేక పొదనుండి గుండ్లను
బ్రేల్చినారు ధరణిఁ గూల్చినారు (7-5-1924)

విప్లవము వర్ధిలునుగాక! విప్లవంబు
వర్ధిలును గాక! యనుచు జీవములు వదలె
నాంధ్రయువమౌళి రామరా జరిభయంక
రాతిమానుష కదన క్రియావిధాత.

**శ్రీ కన్నెగంటి హనుమంతు**

వంగభూమిఁ జీల్చి వాలింపఁ గర్జను
తీంద్ర సూపినట్టి దినముఁదొట్టి
దాస్య దళనమునకుఁ దహతహపడుచు జా
తీయ సేవ మరఁగెఁ దెలుఁగునాఁడు.

మోహనుఁ డుపదేశించిన
సాహాయ్యనిరాకృతికి హసా దనియెను స
త్యాహింసారణ దీక్షా
దోహలమున నిలువరింపఁ దొడఁగెను బ్రభుతన్.

బెజవాడపురికిఁ గాంగ్రెసు
యజమానులు వచ్చి యుజ్జ్వలాదేశములన్

బ్రజ కున్మేషము గూర్చుట
నజడమ్ముగ సాగె నాంధ్ర మసహాయవిధిన్.

తెలుఁగునాఁటికినెల్ల నుద్దీప్తి నొసఁగి
పేరుగన్న ధరిత్రి గుంటూరిసీమ
దేశహితజీవనమ్మున కాశపడిన
మగల మగువల మనికి యీమండలమ్ము.

వచనము: ఇందు వీరత్వమునకుం గాణాచియై-పల్నాటిగడ్డ వెలయు-దీనం గానలుహెచ్చు-ఇచటి ప్రజలు పుల్లరి నిచ్చుటమాని యానాఁడు సర్కారు నెద్రిచిరి

పలునాడు కాంగ్రెసునకున్
గలుకోటగ మాఱెఁ గన్నెకంటికుల కృషీ
వలుఁడు హనుమంతు జనతా
దళనాయకుఁడాయె ధీరతారుచు లెగయన్.

వచనము: కోలగొట్లకుఁ జెందిన మించాలపా డితని-కాఁపురించుపల్లె-అచటి గ్రామముల కాఁపులు హనుమంతునాయకత్వమునఁ బ్రభుతన్ ధిక్కరించి కానలం దమ పసుల మేపికొనందొడఁగిరి-అంతట సర్కారుబంట్లు వచ్చి యెంతజంకించినం బ్రజలయుక్కు మొక్కవోకనిలిచె-అపు డుపమండలాధికారి కోలగొట్ల వచ్చి కరవ్యవహారము చర్చింపనెంచి, వెంటనే రమ్మని హనుమంతునకు నుత్తరువు నంపె-పదంపడి-

తెల్లదొరతనమ్మునకున్
బుల్లరి నిచ్చుట హుళక్కిపో! యని ప్రజ తీ
రెల్లం దెల్లమిసేయఁగ
నుల్లాసంపడుచు నాంధ్రయోధుఁడు కదలెన్.

వచనము: ఊరుదాఁటి వచ్చుచున్న యమ్మేటి నాఱడుగులపొడుగున్నవానిం గన్న పోలీసుపెద్ద

అతఁడె కన్నెగంటిహనుమంతు మన పర్వు
పదటఁ గల్పుచున్న పలువ యతఁడె

చంపవలయు వాని జంకకుఁ డనుచు ము
ప్పంద్రు బంట్ల తోడ బలసె నతని

టపటపమని నల్దెసలన్
దుపాకిగొట్టములు మ్రోసె దుస్సహకీలా
విపదాకుంచిత 'వపువై ('శరీరము)
విపులాస్థలిఁ గన్నెగంటివీరుం డొరగెన్.

మంజరి: అతఁడు దాహము దాహమని మెల్లపల్క నీయరైరి పోలీసు లించుక, నీర
మిదె జలంబని ప్రజ లీఁబోవుచుండ మొదటిబంటు తుపాకీమొన చూపె వారి
కతని దుశ్చేష్టకు హనుమంతు కనలి "యోరిదురాత్మ! నీ యుదు టెన్నినాళ్ళు
నిలుచుఁ? గర్షకులు కన్విప్పి రీనాఁడు కార్మికుల్ తమపాలి కర్తవ్యమెఱిఁగి
రెదిరించి రేల్బడి నెద జంకులేక కిగ్గాడి! నీకు నెంగిలికూడు వెట్టు
తెల్లవాఁ డీధరిత్రిని గుల్కఁ డిఁకను
సాగదురా! వానిశాసనం బిచట-మాకాఁపుబిడ్డ లీమహి నేలఁగలరు
మాకూలిపెద్ద లీమహి దిద్దఁగలరు-మారాజ్య మిఁకవచ్చు, మాపెంపు వచ్చు
మాగాంధి జెండాకు మహిమమ్ము వచ్చు;-నీచుఁడా!పొంగకు; నిలువని మేని
కొఱ కేను విలపింప గోరంతయైన-దేశంబునకు సముద్దీప్తి రావింప
నాయన్న లీపలనాటి హంవీరు-లెందఱొ తనువూడ్చి రేగిరి దివికి
నచ్చమౌ కీర్తికి నధిపతులైరి-కవిశేఖరుల మెప్పు గాంచిరటంచు
నెఱ్ఱటోపీవాని నెదిరించి పల్కి-దీనదృక్కులఁ దన్నుఁ దిలకించు జనుల;
కడలరా దడలరా దరి నీయరాదు-సాగింపవలె మీరు శాంతిసంగరము
పల్నాటిమగఁటిమిన్ బ్రదికింపవలయుఁ-దెలుఁగుదేశంపుఁ గీర్తిని నిల్పవలయు
నాయకునకు లొంగి నడతేరవలయు-జయమందవలె నని సందేశ మొసఁగి
దగతోడ మరణవేదనతోడ రెండు-జాములపాటు వేసారి వేసారి
యక్కటా! కనుమూసె నంతఁ బల్నాటి-కడిమికి నెఱపాదు కనెగంటిజోదు;
ప్రజ లెంతకిన్క యేర్పడిన నహింస-విడనాడనొల్లక విమతుల సైఁచి
హనుమంతు కుణపంబు నావేశమడరఁ-కాహళీ శంఖ ఢక్కా వేణు పటహ
దుందుభి మర్దల తూర్యఖండాది-వాద్యనాదములు దైవాఱ దిక్కుద్య
పాటన క్షమములై పరఁగ మహాత్మ-గాంధికిజే! కన్నెగంటివీరునకు
జే! కాంగిరెసునకుజే! యను రవళి-ఱంపిల్లగా మూఁడురంగుల పడగ
మెఱయ నల్దిక్కుల మెఱవణిచేసి;-గుణగరిష్ఠులు కోలగొట్ల చెంగటను
జాల్వాఱు వాఁగుపజ్జకుఁదెచ్చి మాఁటి-పెనుపారు భక్తిమైఁ బ్రథులచైత్యంబు
నద్దానిపైఁ గట్టి, హనుమంతుచరిత-నందుఁ జెక్కించి, యహంతమై వీఁగు

నాంగ్లప్రభుత్వము నడలించినట్టి-ప్రజలకై పోరాడి బలివోయినట్టి
శూరునిదెస( బేర్మి( జూపి రీ పగిది-వీరునిదెస( గూర్మి వెలయించి రిట్లు

**లాల్ బహదూరుశాస్త్రిజీ!**

నియత చిత్త వృత్తి నిప్పునా బ్రదికి నల్
గడల వీను మిగిలె లాల్‌బహద్ద
రితఁడు వోయె నన్నకత వియద్వాణిలోఁ
గడల నుదరి సొమ్మ గంటి నేను.

బాపుజీ లేని, జవహరపండితుండు
కానిపింపని కొఱఁత యెవ్వానిమదికిఁ
దోఁపనివిధాన లాల్‌బహదూరుశాస్త్రి
పరఁగె సాత్త్వికరాజసప్రభలు ప్రమ్మి

భారతప్రధానపదమున కెనలేని
కీర్తి దెచ్చినట్టికృతి యితండు
దేశశాంతికై విదేశమం దలయుచుఁ
దనువు నూడ్చి నట్టి ధన్యుఁ డితఁడు. (నాకథలు)

మాతృమహీవైభవ సం
ధాతృ మహావీర ధర్మతత్పర! గాంధి
చ్ఛాత్రవర! శాంతిరణమఖ
హెూతృమణీ ! లాల్‌బహద్దరూ! శౌచఖనీ!

లోకం బంతయు మాది మాది యనుచున్ లోభానువిద్ధాశయుల్
పాకీస్థానమువార లుద్ధతి వెలార్పన్ ధీరతా వీరతా
శ్రీ క్రేళ్ళుబ్బి పరాక్రమించి సమరస్థేయుండవై శాత్రవ
ప్రాకారమ్ముల మూలబంధము లగల్పన్ నీక చెల్లెన్ గృతీ!

పాకీస్థానమే కాదు దానికి విషత్పాత్రక్రమం బూఁదుచున్
దోఁకాడించు పెకింగు చిల్వయును నీ దుర్వారవిక్రాంతి రే
ఖాకార్కశ్యము గాంచి వంచె ఫణ; మల్కంగొన్న హిందూర్విపై
దూఁకం జాలుమగండు లేఁడని ప్రజల్ తోషింప ఘోషించితే!

నీవొక పొట్టివాఁడ వని ని న్నదలించుట కేండ్లుపూండ్లనున్
గావలెనా? యటం చయుబుఖాను తలంచి తుపాకి నెత్త నా
చేవ నెఱుంగవో యని హసించుచు మెల్లన సాఁగిసాఁగి తా
రావసథమ్ము దాఁటితి వజాండకటాహము వ్రయ్యవాఱఁగన్

ఓజన్ దక్కి పురావధుల్ కడచి యేవోతంత్రముల్ పన్ని మా
పొఁజున్ బోరికి రెచ్చఁగొట్టు చయినాపాషండుఁ డాపన్నుఁడై
యాజిం గూలిన గుంట కే నొసఁగ నార్యక్షోణిఁ జో టన్న శ్రీ
రాజేంద్రుండును నీవు నొక్క తెగవారా! చాఁగురే! శాస్త్రిజీ!

జవహర్లా లతిలోకశక్తులఁ బ్రశంసాపాత్రుఁ డయ్యున్ రణ
వ్యవసాయం బన డయ్యుచుంట కతనన్ వైరుల్ నిరాఘాటులై
యవనిం దోఁచిరి .నాఁడు; నేఁడు నిరవద్యక్షాత్రరోచిర్మయా
జవసంజాతుఁడ వీవు నేత వగుటన్ స్రగ్గెన్ దదాటోపముల్

కృతమతి జవ్హరుండు పదునెన్మిదియేండ్లు ప్రధానమంత్రిగా
జతనము లెన్నియో సలిపి సల్పి గడింపనిపేరు పెంపు నం
దితివటె! సార్ధవత్సరము నిండియు నిండకమున్నె శాత్రవ
ప్రతతి నెదిర్చి కీ లెఱిఁగి వాతలుపెట్టి మనీషిసత్తమా!

నమ్మఁగరానిపాలసుని నమ్మ, వహంత నెఱుంగ, వార్తలో
కమ్మను గుస్తరించెదవు, కాఁపులగోడు గణింతు, వుక్తులం
జిమ్మక చేఁత కొగ్గెదవు, సింగపుఁబీటను జాఁపనొక్క చం
దమ్మునఁ జూడనేర్తువు, సదాతనకీర్తివి నీవు శాస్త్రిజీ!

ఎల్లరపెంపు నియ్య కొనుటే తన పెం పను ధర్మసూత్రమున్
బల్లెలవారు నేర్పవలెఁ బౌరుల కందువు; గ్రామజీవికిన్
దల్లడపాటు రామి మనధాత్రికి రక్ష యటందు; వౌర! నీ
యుల్లము జాతిజీవనపు టోరలు కన్నది విద్వదగ్రణీ! (ఓరలు =అంచులు)

ఆర్థికంబగుసవరింత కారటించు
దొరతనము, తాళి, వెనుక ముం దరయవలయు
ప్రాఁతక్రొత్తలతో జతపడినమార్పె
సైఁచుఁ బ్రజ యన్న నీ మనీషను గణింతు.

గీతకు నీ వుదాహృతివి, కృష్ణుఁడు దిద్దినక్రీడి వీవు, నీ
చేతము మోహపుందెరలఁ జీల్చి స్వధర్మము నాదరించి శీ
తాతప సౌక్యసంకట జయాపజయమ్ముల భేద మెంచమిన్
బ్రీతమనస్కుఁడై హరి వరించె భవద్రథసారథిత్వమున్

ఈశ్వరానుభూతి కీవు నోఁచితివి నీ
వ్రేఁగునెల్ల నిడితి వేల్పుమీఁద
వెఱపు నిన్ను గదియ వెఱచె బహద్దరూ!
వలచి నిలిచె నీదువలన గెలుపు.

నిండింపరానికోరిక
లండలుగా నెగసి రేసి యాసురశక్తిన్
దీండ్రించు వారిబింకము
గండిపడెన్ నీదుమ్రోల గగ్గోలుపడెన్

అది గెల్చితి మిది గెల్చెద
మెదు రెవ్వరు కలరు మాకు నిమ్మహి నొకటన్
గొదలేనివార మను దు
ర్మదు లెల్లిదు లైరి నిన్ను మార్కొని శాస్త్రీ!

ఇఁక నొకవేయివత్సరము లేగెడుదాఁక నశింప వీ ధరి
త్రికి నిపు డీవు నేర్పిన వితీర్ణియు, శౌర్యము, నైకమత్యమున్;
తికమకలాడుచున్ భరతదేశము దిక్కులుచూచువేళ నా
యక పద మంది మందిహృదయమ్ము నలర్చితివా బహద్దరూ!

చక్కఁదనమ్ము లేదు, సడి సన్న బి.యే. మొదలైన పట్టముల్
దక్కను లేదు, లేదు ధనధాన్యపటుత్వము నీకు; నైన నీ
వెక్కిన పీఠ మిమ్మహి మహీయ మహో! నినుఁ జేరినట్టి యీ
పెక్కువ చొక్కంపు బ్రదుకు పిండినసారమురా! బహద్దరూ!

ఎండుచు వాడుచున్ బ్రతిఫలేచ్ఛ యెఱుంగని లోకసేవలోఁ
బండినయోగమూర్తి తలపైఁ బ్రజ మల్లెలు చల్లు గాని లో
నిండినలాభలోభముల నిచ్చలు నిచ్చకముల్ వెలార్చు దు
ష్పండితు మెచ్చునా? యతనిపన్నిక లెన్నికసేయఁ జొచ్చునా?

వలువవేవికతన వచ్చునా, సుచరిత్ర
వలన వచ్చుఁగాని విలువ నరున;
కేల డంబమందు, వెంద అమాత్యు లీ
కరణి వక్కణింపఁగలరు? శాస్త్రి!

కాలము సాయమై చిఱుతగద్దెకు వచ్చిన వారలే ‘వెసన్ (‘ వెంటనే)
దూలములేని కొంపలను ద్రోసి విహాయసచుంబి రమ్యహ
ర్మ్యాళి రచించి రర్థపతు లైరికదా! మఱి పాకయైన నీ
పాలిది కానరాదఁట! సెబా సిది చాలు భవన్మహత్తకున్

పేదవుగా జనించినను బెన్నిధివంటిపదమ్మునందు న
ష్టాదశవర్షముల్ నిలువఁజాలితి, వైన నకించనత్వమే
యాదరణీయ మంటి; విది యౌనని మెచ్చెదఁ గాని సాధ్వి నీ
పైదలి యెంత యె త్తిడఁగ బ్రాఁకితి వీ కొసకొమ్మజుంటికిన్?

నగలమాటకేమి నల్లబంగారము
మాటకేమి యింటిమాట యైన
నెత్తలేదె యెన్న డిల్లాలు మాయురే!
లలిత నీ తపఃఫలమ్ము శాస్త్రి!

అల్లాడించు నికృష్టవాంఛలకు లోనై పల్లియల్ పట్టణా
లెల్లల్ దాఁటిన విత్తదాహమున నిస్సీ! ధర్మువున్ రాచునాఁ
డుల్లీఢస్ఫటికోపలోపమ చరిత్రోదాత్త! యుష్మాదృశుల్
ఢిల్లీ కబ్బుట మా తపమ్ములు ఫలాశ్లిష్టమ్ములై నెగ్గుటే!

మనసిరి యుండుచోట మనమానస ముండును గాన మానవుల్
ధనమును ముక్తిరాజ్యమున దాఁచుట మంచిదిగాని, బంధకా
రణ మగు నిమ్మహిన్ నిలుపరా దని రాదిఋషీంద్రు; లీ నుడిన్
మననము చేసిచేసి ఋజుమార్గము గంటివి నీవు కోవిదా!

ఐహికం బగు నుద్దీప్తి నరయుపట్ల
బారమార్థిక లాభతత్పరత విడని
విజ్ఞుఁడవు నీవు దేశాభివృద్ధి కొఱకు
విశ్వహితము నేమఱని వివేకి వీవు

ఈ జగత్తు సర్వ మీశ్వరు సొ త్తౌటఁ
బరులసిరుల కాసపడక నరుఁడు
బ్రదుకవలయు నీవిపంట; నన్న మహర్షి
వాణి కీవు తారకాణ వన్న!

ఒరుని మొఱకుఁదనము నోర్తువు గాని, నీ
యజ్ఞతను సహింప వలఁతి నైన
బాట క్రుంగి నీవు పాలించురైల్ వడ
విడితి వొక్కనాఁడు ప్రెగడతనము.

మంత్రిపదము వీడినంతన సర్కారు
కారు నెక్కు హక్కు కడచె నంటి
వింటి కేగి జీత మిగిరిన దిఁక నొక్క
యిగురు చాలు నంటి వింతి తోడ

నీవలె నచ్చపుంబ్రదుకు నేర్చి, సుఖమ్ముల రోసి, జాతికిన్
సేవ యొనర్చు నాయకుఁడు సీమకు నొక్కఁడుగా లభించినన్
లేవు నిరాశ, లీరసలు లేవు, రణంబులు లేవు, బాపుజీ
రావలెనన్న రాజ్య మది రాకకు నాఁకలు లేవు శాస్త్రిజీ!

నీవలె నర్థకామముల 'నెట్టికసీలతనమ్ము నూఁదినన్ (' సదాచారము)
నీవలె 'నార్జవంబును గణించిన గర్వము డిగ్గనాడినన్ (' శీలము)
నీవలె గూర్మియుం గృపయు నేర్చినఁ దియ్యనిపల్కు పల్కినన్
దేవుఁడయై నరుండు జగతిన్ వినుతిన్ బడయున్ బహద్దరూ!

ఆయం బొప్పమి నన్ను మున్ పద్రుచు పుణ్యక్షేత్రయాత్రారతిన్
ద్రోయన్నేర్చితిఁ గాని నేతృపదమందున్ నిల్చి యి ష్టాకొదన్
బాయంగంటిని సర్వభారతము నాపాలన్ మహాతీర్థమే
యాయెన్ నేఁ డని లోకసేవకు విశాలాధ్వమ్ము సూచించితే!

చైనారక్కసి దొంగపోటుకతనన్ సవ్రీడమై క్రుంగు దే
శానన్ నూతన దీధితుల్ వొడమి తచ్ఛౌర్యంబు దుర్ధర్షమై
నానారాజ్యనుతుల్ గడించుదనుకన్ నా కాఁకలిన్ నిద్రయున్
రానేరావని పట్టుపట్టి విజయారావమ్ములన్ జొక్కితే!

పడవవాఁడు మెత్తఁబడనినాఁ డుత్తుంగ
భంగభయదయైన గంగ నీఁది
వీథిబడికిఁ జన్నవేళనే ప్రజలు నీ
గుండెబిగువు మెచ్చుకొనిరి శాస్త్రి.

దోవతి మాని కేవలవధూజన వేషము పూని చారులన్
గావలికాంట్రఁ గన్మొఱఁగి గాంధిపతాక ప్రయాగరథ్యయం
దీ వలనాఁడు నిల్పినపుడే భవదీయము కార్యదీక్ష స
ర్వావని కబ్రమయ్యె; వల పబ్బుఁగదా చిఱుమొగ్గ కేనియున్.

'జైజవాన్', 'జైకిసాన్' రవస్రష్టవై వి
శిష్టచైతన్య మావహించితివె ప్రజకు
కత్తి కఱ్ఱు నిరాఘాటగరిమ గన్న
దేశ మవమతిసెందునా లేశమేని.

ఆటోపించిన భారతీయభటుఁ డుగ్రాస్త్రచ్ఛటల్ గుప్పి పాక్
పాటన్‌టాంకుల జెట్‌విమానముల డిప్పల్ రాల్చి లాహోరు పెన్
కోటన్ ముట్టిననాఁడు దేశ మిది నీకూర్పాసమై బాహు వా
స్ఫోటింపన్ రిపుకోటి యుడ్డుగుడిచెన్ భుగ్నాశమై శాస్త్రిజీ!

పిఱికికండలేని బిరుదు నా సడిసన్న
నీవు దేశమునకు నేత వగుట
నగుర! తెగువ హెచ్చి మగఁటిమి రెచ్చి మై
మఱచి పగఱ నెద్రిచె మనదళమ్ము.

జాతి గౌరవమ్ము సడలమికై ప్రాణ
మిడుటకంటెఁ గృత్య మేమికలదు
మంచి తరుణ మొదవె మాయురే! యని మన
బంటు నడిచె నుర్వి పల్లటిల్ల

రాజపదాభిరాముఁ డపరాజితశస్త్రుఁడు రామభద్రుఁ డాం
ధ్రాజవసంభవుండు జగదద్భుతలక్ష్య విపాటనక్రియా
భ్రాజితదృగ్ధురా వహనపండితుఁడై పడఁగొట్టె నట్టె! ఘో
రాజికిఁ దారసిల్లు విమతాభ్రచరమ్ములఁ గాకులంబలెన్.

మచ్చరికించి శ్రీనగరమండలమున్ విదళింప జివ్వనన్
వచ్చెడు గాలియోడఁ జిఱుప్రయ్యలుగా నిలఁగూల్చి నీ నెఱా
మెచ్చు గడించుకొన్న బలుమేటియుఁ దెల్గుల పోతరాజె! యీ
చిచ్చఱపిడ్గు పే ర్వినినఁ జెమ్మటలూరు నరాతికోటికిన్

మనపగతైన ముస్లిములు మామహి నాకము పుణ్యలోక మం
చనిశము చాటుచుండినను హైందవసంస్కృతి విశ్వమానవ
ప్రణయపతాకయౌ కతన భారతదేశమహమ్మదీయులున్
బెనఁగి రహో! దివిన్ భువిని బిండిరి నెత్తురు మాతృభూమికిన్

ఆలము నల్లెమున్ సమత నారయుజోదు హమీదు గుండెకుం
గాలము కాఁగ శత్రువు కకావికలై సకలోర్వి నున్న చు
ట్టాలను జీరి చీరి యకటా! గతిగానక చేతులెత్త నీ
నేలను గడ్డిపోఁచయు మనీషిమణీ! తలయెత్తె నేడ్తెఱన్

నీ కగపడ్డ నిగ్రహము నేర్చుట కెలరు కారు; శైలమున్
డీకొని వ్రక్కలించు నశనింబలె గట్టితనమ్ము, తమ్మిపూ
రేకు వలెన్ మృదుత్వము ధరించిన డెందము నీది; బాపుజీ
పోకడ లాఁచికొన్న నెఱప్రోడవు నీవు బలా! బహద్దరూ!

విక్రమరాశియౌ భరతవీరుఁడు శాంతిని కోరు; శాత్రవుం
డక్రమ చర్యకుం గడఁగినప్పుడు నిప్పులు చిమ్ము; వైరి నా
వక్రత సైఁపు మన్న హిమవన్నగ మౌ; ననుసత్యమున్ మహీ
చక్రమునందుఁ జాటితివె శాస్త్రి! వజీరు లజయ్యు లౌననన్

భుట్టో మానవధర్మమున్ మఱచి పెంపుం దక్కి పెన్ రచ్చలోఁ
బట్టం బగ్గములేని చందమున దుర్భాషాతతిన్ భారతిన్
దిట్టన్ "బాప! మపత్రపన్ మునిఁగి శాంతిం గాన కిట్లయ్యె నీ
దిట్టం" డంటి వహో! ప్రతిష్ఠితమతీ! తేజస్తితిక్షాకృతీ!

పరుసనిపల్కు లల్కయు నపాస్తవివేకునిలక్షణంబు; లీ
మొఱకును సైఁచు టొప్పనుచు మున్ను వచించిన సంయముల్ భవ
ద్గురు లని యెంతుఁ గాని బుధకుంజర! యెంతయహింస యెంత ని
బ్బరికము నెంత సత్త్వము నుపాస్తము కావలె నింత చేఁతకున్!

"మీమహి కస్మదుర్వికి నమిత్రములైన మహాపిశాచముల్
లేమిని, రోగమున్, దెలివి లేవడి, నడ్డి యణంచు టొప్పుఁ; గా
నీ మన మస్రవాహినుల నీఁదుచుఁ గయ్యముసేఁత చెల్లునా!
యేమి యయూబ! సెప్పు" మని యీవు సృజించితె శాంతి; శాస్త్రిజీ!

కూడు గుడ్డ నెమ్మి కోరుఁ గాని జనాళి
దారుణాహవమ్ము కోర దెపుడు
నెఱుకబలిమిలేనిదొర దీనిఁ గన కేచి
యేఁచు నవని నంటివే మనస్వి!

అంతచేసిన రిపుమ్రోల నంత గెలుపు
చేపడినవేళ నీ వింత చెలిమి తోడ
నింతమన్నన తోడ భాషింతు వెంత
నిండుమది నీది యెంత వినీతి నీది!

పగతుర దాఁకి, లోకము సెబా సనఁ గయ్యమొనర్చి, గెల్పునన్
సొగసితి మన్నలార! యిఁక సుస్థిర శాంతి జనింపఁగా జగా
తెగువలు చాటి నేఁటి మనదీప్తికి వ్యాప్తిని గూర్త ముర్వికిన్
బ్రగతి ఘటింత మన్న తుది పల్కులు నీవి యనర్ఘ రత్నముల్

గాంధి పుట్టిన దేశము, కరుణ, ప్రేమ
సత్యము సముద్ధరించిన జాతిపిత జ
నించిన ధాత్రి శాంతికి నేస్త మగుట
సముచితం బన్న నీవాణి యమరవాణి

ఏను బోయిన మీరు పోయినను మన ప
తాక పోరాదు పోరాదు తమ్ములార!
భారతక్షోణి శాశ్వత ప్రాభవమున
మనవలయు నన్న నీమాట మాకు బాట

కూలిన గాంధి వచ్చె నని కుల్కితి నిన్నని; ప్రాంత గాథలన్
మూలుగుచున్న జాతిజవమున్ బ్రకటించె బహద్ద రద్దిరా!
చాలినవాఁ డితం డనుచు సంతసమందితిఁ గాని దైవ మీ
మేలు సహింపలేక విషమించెఁ గదా లతితాహృదీశ్వరా!

లేవా! నీ విఁక మాకు, లోకములు తూలెన్ నేఁడు, దిక్కుఁడ్యముల్
శావుల్ వాసెను, మానవావళి ప్రతిష్టబ్ధప్రభన్ దీల్పడెన్
ద్యావాభూములు కాఱుఁజీఁకటుల కాస్థానమ్ములై, కల్పవే
శావిర్భూతికి హేతులై, ప్రజల నల్లాడించెడిన్ శాస్త్రిజీ!

లోకము సర్వ మొక్కత్రుటిలో భరతోర్వికి దూఁకి బాష్పధా
రాకుల నేత్రమై వగచె నక్కట! నిన్ మృతుఁజూచి; 'కోసిగిన్ ('రష్యా ప్రధానమంత్రి)
నీకొఱ కేడ్చె నన్న నది నీ విజయంబె! యయూబు నీదెసన్
శోకము చాటె నన్న నది సూనృతకింకర! నీ ప్రభావమే!

పొగ నడఁగారి యారి పొలుపున్ బలుపున్ సుడివోవఁగా మహా
యుగముల పాటు వహ్ని కొనయూపిరితోఁ బడియుంటకంటె నొ
క్క గడియసేపు అంపిలి ధగద్ధగలన్ మెఱయించి డిందినన్
మగసిరి కేమి లో టనెడిమాటకు మూదల వీవు శాస్త్రిజీ!

మే నిది నీటి బుగ్గ కుపమేయము, పూరుషుఁ డాత్మదేశ క
ల్యాణము సంతరించు సమయమ్మున నక్కఱపాటు వుట్టుచో
దీనిఁ దృణమ్ముఁగా విడుచుతెంపరి కావలె నన్నసూక్తికిన్
బ్రాణము నీదు జీవనము ప్రాజ్ఞతకున్ శరణమ్ము శాస్త్రిజీ!

చావఁడు మత్తనూభవుఁడు చావఁడు, చచ్చె నటన్న వార్త సం
భావన సేయరాని దని పల్కిన నీజనయిత్రి సత్యవా
క్సేవధి, శాంతికై తపము సేయు నరుం డిల నుండునంతకున్
జావవు నీవు, నీజనువు సార్థక మయ్యె నహెూ! మహామతీ!

భారతభూతధాత్రిఁ గనుపట్టు చరాచరవస్తు సంతతిన్
జేరె భవన్మహ; స్సది నశింపదు వానకు నెండ కగ్నికిన్
మారుతధాటికిన్ నిశిత మార్గణ కోటికి నస్త్రశక్తికిన్
దారకలన్ సడల్చు భయదప్రళయోద్ధతికిన్ బహద్దరూ!

అల తాష్కెంటునఁ దీవ్రవాదముల కీ వల్లాడి ప్రాణమ్ములన్
బలిగా నిచ్చి గడించినట్టి చెలిమిం బాటించి నిత్యమ్ములై
నిలుచుంగావుత రెండు దేశములు; నీనేస్తమ్ము నానాఁటికిన్
బలుపుం గాంచి యఖండభారతము నాపాదించి రంజించుతన్!

### "మహాత్మకథ"ను అంకితమొనరించుట

ఈతని సంస్కృతికిన్ గుఱు
తై తనరం జేసితిని మహాత్మకథేతి
ఖ్యాత బృహద్రచనమ్మును
నాతపమున మేలిపంట నాఁ దగిన కృతిన్ (1968)

బానిసపు మోపు త్రోపాడ బా పొనర్చె
నెన్నికోల్తల, లాపద లెన్ని సైఁచె
నెట్లు జనతను మేల్కొల్పె, నీసమస్త
మరసి వర్ణించినాఁడ మహాత్మకథను

నిను నిర్భీకు నితాంత సత్యకరుణా నిష్ఠానిధిన్ నమ్రతా
ఖని నంధ్రోక్తి మయప్రపంచమునఁ జక్కన్ నిల్పి ధన్యత్వమున్
గనఁగా మత్కృతమున్ "మహాత్మకథ" నీ కావ్యంబు నీ కంకితం
బొనరింతున్ శుచి మంజు శిల్పసుషమా యోగాఢ్యమున్ శాస్త్రిజీ!

అచ్చపుఁదీరుతీయముల కాత్మ కరంగి తెనుంగువారి కే
నిచ్చితి నెన్నియేనికృతు లింతకుమున్ను తెనుంగువాఁడుగన్;
ఇచ్చెద భారతీయుఁడుగ నిప్పుడు నీకు నజాత వైరికిన్
మచ్చ యొకింత లేని బుధమౌళికి నీకృతి లాల్‌బహద్దరూ!

ఈపొలి నీకుఁగా కెవని కిచ్చెద; మస్కరి నంచుఁ దస్కర
వ్యాపృతి నేర్చి భోగములు వాయని మానవుఁ జూచుచున్ నెఱా
కాఁపురమున్న నర్థముల కల్మికి మార్గము లున్నఁ జిన్నమున్
దాఁపఁగ లేక చన్న గృహధర్మపరాయణ చక్రవర్తికిన్

ఈపొలి నీకుఁగా కెవని కిచ్చెద - బాపు తపమ్ము పంటగాఁ
జేపడినట్టి రాచసిరిఁ జిందఱ వందఱసేయ వంచకుల్
పాపులు భారతమ్ము నలుప్రక్కల మూఁగిన వేళ విక్రమా
టోపముఁ జూపి జాతి కుదుటున్ గదియించిన శౌర్యమూర్తికిన్

ఈపొలి నీకుఁగా కెవని కిచ్చెద - గాంగఝరమ్ముపోలె ఛా
యాపతిరీతి మారుతమునట్లు ఫలప్రతిపత్తి వాంఛకున్

లోపడ కూఱటం గనక లోకహితక్రియ సల్పి దంభ ద
ర్పాపహశీలమున్ మెఱసినట్టి నిరత్యయ కర్మయోగికిన్

ఈ పొలి నీకుఁగా కెవని కిచ్చెద - దేశవికాసలబ్ధికై
రాపిడు లోర్చి యోర్చి రుచిరంబగు జీవన సౌరభంబు నల్
వైపులఁ జిమ్మి చిమ్మి పొడవాసిన గందపుఁ జెక్కకున్ బృహ
త్తాపము సైఁచి స్రగ్గి జనతన్ దనియించిన ధూపవర్తికిన్
(జనవరి 1968 - మహాత్మకథ)

**శ్రీ బోడేపూఁడి. వేంకటరావు**

పాండిత్యమునన్ గవితను
బండుటకు నుదాత్తమైన బ్రదు కందుటకున్
జండతరదీక్ష నెత్తురు
పిండి తహెూ! బోడేపూఁడి వేంకటరాయా!

ఏడెనిమిదేండ్లు బాపట్ల నీవు నేను
వడ్లమూడియు, నబ్బరాడ్వంశభవుఁడుఁ శ్రీవడ్లమూడి. వేంకటరత్నము
దెనుఁగుటొజ్జలమై భారతీవికాస శ్రీఅబ్బరాజు. వీరరాఘవయ్య
రతి నొనర్చిన సేవ విస్మృతికి రాదు.

క్షితి నెవ్వండును సర్వ
జ్ఞత వడయంజాలఁ డన్నసత్యము గని ప్రా
జ్ఞత నెఱయ నపుడు పెనఁగితి
మితరేతర దేశికత్వ మీకొని సుకృతీ!

త్రచ్చి త్రచ్చి శాబ్ద తత్త్వ, మర్థవిశేష
మాహరించువఱకు, నాద్యులైన
నన్నపార్యతిక్కనల గుట్టు భేదించు
వఱకు మనము తెప్ప వాల్పలేద.

కాసులకొఱకీ వేసట
మోసితిమా లాఁతినుడులముసుఁగునఁ దెనుఁగుం

బాసపాడ యడఁగ రా దను
రోసమునకుఁగాక సద్గురుత్వవిభాసీ!

భావసరణియందుఁ బల్కున నడతలోఁ
దెలుఁగుముద్ర సొంతవెలుఁగుముద్ర
యంటవలయు నన్న యారాటమున శిష్య
పట్ల మనము లెస్స పడితి మపుడు.

చలిదికూటికిఁ జాలని సంబళంబు
నిస్సిరో! నాఁడు ఁడు లెట్లిచ్చినారొ
సాహితీమూర్తి మాతృభాషాగురుండు
పాఠములు క్రోల్చె నొకమూఁడుపదుల కొప్పి

బానిసీని కింటిబాడిగ కివి బొటా
బొటిగ సరిపడంగ బువ్వ బట్ట
యీవి తావి పెద్ద లిచ్చిన యాస్తితో
వెళ్ళఁ బుచ్చె ధర్మవీరుఁ డితఁడు.

కాటూరి వేంకటేశ్వరు
బోఁటిమహాకవులఁ దీర్చి పొంగుటగా కే
పాటి సువర్ణము తెనుఁగుం
బీఁటను వేంచేసి చెళ్ళపిళ్ళ గడించెన్?

తెలుఁగునాట నెల్లదెసల నీ శిష్యులు
కలరు వైదుషీప్రకాశఖనులు
సకలవైభవప్రశస్త మాచార్యక
మవధరించి ధన్యుఁ డైతి వీవు.

మీ శిష్యుఁడు వీఁడని యొక
దేశమ్మును బనుచు బిరుదు తెల్పుచు వినయ
శ్రీ శేవధియై మ్రొక్కఁగ
దేశికుఁ డొరుఁ డందలేని తృప్తిన్ గుడుచున్.

ఒజ్జకంటె నన్యుఁ డుండునె కై సేయఁ
దగినవాఁడు సభ్యజగమునందు;
చాలుఁ జాలు గురుఁడు సాక్షాత్ పరబ్రహ్మ
మనెడిపల్కు నిచ్చ మనెడితళ్కు.

చదువులం దాఱితేఱి యొజ్జనము నెఱపి
కన్నకీర్తి చిరంబగుఁ గైతకతన
నీకు నిది దక్కెఁ దొంటిపున్నెములు పండి
మాధురీ సాధురీతి సమగ్ర మగుచు.

గాలివాలు చూచి కబ్బ మల్లవు; ధన
తృష్ణ కోడి భారతిని గలంప;
వంటువడిన నుడుగు నాదరింపవు; సము
న్నిద్ర సంప్రయోగనిష్ఠ నీది.

ఉన్నతికి గభీరతకు నన్యూనగతికి
నూఁతయై నిన్ను నుద్దించు కైత నీది
దక్షిణాపథ విశ్వవిద్యాసదస్సు
లాదరించి దానిహొరంగు మూదలించె.

రాచసిరిగుల్కు కులమునఁ
దోఁచుట నీ వాంధ్రశౌర్యధూర్వహనకళా
శ్రీచుంచువుకథ వ్రాసితి
వౌచిత్యవిదుల్ మనీషు లయ్యారె! యనన్

తనివి పరమభాగ్యమని విశ్వసించిన
గఱువ వగుట నీవు తఱి యెఱింగి
క్రమ ఫణితిఁ గూర్పుఁగంటి “తృష్ణావర్త”
కృతిని లుబ్ధలోకహితముపొంటె.

తగినవాని కంకితము చేసితివి సదా
శివున కీ యుదారకవనధార;
నతఁడు సర్జ నయ్యు నతిసంచయము నొల్ల
డతఁడు సాహితీప్రగతికి నలఁగు.

కవులు వేయిమంది కనిరి నీ యట్లు నా
గార్జునాద్రిఖచిత మమరశిల్ప;
మీవు గాక దాని నెందరు కైతకుఁ
దెచ్చి యందుకొని రతీవగరిమ?

కరుణ సత్త్వశుద్ధి కలమానవుండు గా
కెల్లవాఁడు చాలఁ డిట్టిపనికి
నెంతగా ద్రవించి సంతరించితి "కళా
క్షేత్ర" మది రసప్రసిద్ధి సృష్టి.

జాలిలేనివాఁడు శాక్యగౌతము, సత్య
వాణివలపులేనివాఁడు గాంధి
నుగ్గడించుఁగాక యుసుఱుండునా వాని
నుడికిఁ గుంటిగ్రుడ్డి యొడలు తక్క

ఇతివృత్తమునకు దీ టగు
బ్రతు కే కవి కుండు నతని పల్కు రహించున్
మతిమన్మఖ్యుల కది యా
మెత లిడు నుడివోని మేలిమేలిగుణాలన్.

చదురులేని మడుఁగుమదిలేని పేరాస
నెదురలేని కలుచబెదరులేని
బడుగు లెగసి కైత పరు వూడ్చు తఱి నీవు
లేకపోక తద్ద లేమి నుడికి.

డెబ్బదేండ్ల బ్రదిమి యబ్బిననేమి కీ
ర్తిపడని కీర్తి యగ్గపడిన నేమి
నీకు నిహముతోడి నెయ్యంబు తొలఁగుట
మాకు సైఁపరానిమంట గూర్చు

వాసిరెడ్డి సుకవివరు నధునాతన
హాలచక్రవర్తి నాప్తబంధు
నెనసి కావ్యగోష్ఠి నెలరారుచుంటివా
చీఁకుచింతలేని లోకమందు.

మంచిది! నీ హృష్టి నపే
క్షించుట మాపాల విహితకృత్యము కానన్
సంచితసుకృతమ్ములు ని
ర్వంచితమగు శాంతి నొసఁగ వాసింపు మటన్

ఉపనిషద్రాశిఁ ద్రచ్చినయోగి వీవు
తత్త్వ మెఱిఁగిన శేముషీధనుఁడ వీవు
దేహదేహాంతరము గన్న దిట్ట వీవు
నీకు డెప్పరమా శాంతినివృతిలబ్ధి?

వీరగురుని బ్రహ్మవిన్మౌళిసేవగా
మాననీయకవి నమస్య కొగ్గి
యొరులపెంపుఁ జూచి పరితృప్తి నందిన
నీకు నరుదె వికృతి నికృతి సిద్ధి.

పితృభక్తిపరాయణు నీ
సుతుని చిరంజీవిరావు శుభమెంచుచు నీ
కృతి నిఁక నుడిగింతు భవత్
స్మృతి కొగ్గిన తెనుఁగులెంక నేను యశస్వీ! (కదంబకైత- 4- 6- 1970).

### శ్రీ మార్టిన్ లూథర్ కింగ్(అమెరికాగాంధి)

ఆత్మ నిత్య మాద్య మచ్ఛేద్య మను సత్య
మెఱిఁగినప్పు డెవ్వఁ డెవనిఁ జంపు?
చంపఁబడు నెవండు? సంహననంబు న
ణంచి జడుఁ డహంకరించుఁగాని.

అల సోక్రటీసు చచ్చెనె,
పొలిసెనె జీసస్సు, గాంధి పోయెనె, రవిసో
ములు నిల్చుదనుక వారలు
నిలువరె నిరవద్య కీర్తి నిధులై ధరణిన్.

అమరు లమ్మహాత్ము లఖిల భూతమ్ముల
యందుఁ గనిరి తమ్ము; నఖిలభూత

సముదయమ్ముఁ గనిరి తమ యందు? సమదర్శ
నానుషక్తచిత్తు లాత్మరతులు.

మిన్ను మీఁదఁబడిన వెన్నిచ్చు టెఱుఁగని
మగలు వారు పెల్లుతెగువ యున్న
నించుకేని వినయ మెడయరు వా రెట్టి
బెడఁదనైన మృదుత విడరు వారు.

హంతలగువారి యజ్ఞాన మరసి యరసి
జాలిపడఁ జాలినట్టి సజ్జనులు వారు
తుందుడుకుమీఱఁ దెగినమృత్యువును జూచి
నవ్వనోర్చినధృతి నేర్చినారు వారు.

అరిదియగువారి వలచిన
తెరువునఁ జని నీవు విశ్రుతిం గనిన మహా
పురుషుండవు మార్టిను లూ
థరు కింగూ! భవదుదారతకు జోహారుల్.

తనలోని తమోనైల్యము
గనఁజాలక యొరుని మేనికప్పం గని భ
గ్గున మండువానిఁ దేర్పం
బెనఁగిన నీ ప్రేమరసము పేర్మిని మెత్తున్.

ఖలునజ్ఞతకున్ బలియై
కలకాలము నీవు నిల్వఁగంటి వయారే!
తలఁపించి తహింసకు మూ
దల నా నుతిగన్న ధన్యతము మా గాంధిన్.

దంభమానమదమ్ములఁ దగిలి పొంగు
లోకమున కడ్డుకట్టగా లుప్తధర్మ
దృష్టులకు వెల్గుగా భవాదృశులచరిత
లుపకరించు మార్టిను లూథరూ! చిరమ్ము.

నీ కథలముందు నాకథ
లే కొలఁదివి? యైన వీనినే ప్రీతిమెయిన్
నీ కిడి కృతార్థతం గన
నాకాంక్ష యొనర్తు నందుమా! యీ యుపదన్.

అస్మ దాంధ్రత భారతీయత దలంచి
యిచ్చితిం బెక్కురకుఁ గృతు లింతదనుక;
మానవత నెంచి యిమ్మహామానవునకు
నిడెదఁ 'గింగు' న కీ ₁కైత నెడఁద పొంగ. (నా కథలు అను కవిగారి గ్రంథము)

(14-10-1972.)

## శ్రీ క్రొత్త భావయ్య

క్రొత్త భావయ్యచౌదరి చిత్తశుద్ధి
వడసిన మనీషి సంఘసేవానిరూఢ
జీవనుఁడు, పావనుఁడు, మనస్విప్రియుండు,
గద్యమునఁ బద్యమున నేర్పుగన్న మేటి.

కమ్మవారి చరిత్రముగా నితండు
సంతరించిన కృతి తెల్గుజాతి గాథ
సర్వమును బాహిరించు కోశము, తెనుంగు
దేశమున కమరప్రథన్ దెచ్చు రచన

కావ్యములు రెండు వల్లించి కవిత నల్ల
వచ్చుఁ గాని చరిత్రను ద్రచ్చి పలుకఁ
జాల దీ నేర్మి; వేనవేల్ శాసనమ్ము
లరసి వేసారవలె నైతిహాసికుండు.

భావయ రక్తము మాంసము
జీవము విత్తము చరిత్రసృష్టిని హుతమై
త్రోవం జూపెనువాఙ్మయ
సేవార్థి కటంచు మానసింతురు ప్రాజ్ఞుల్.

ధన్యుఁడు భావయచౌదరి
మాన్యుఁడు సకలాంధ్రజనసమాజంబున; కా

ధు న్యద్రి వన సముద్రము
గణ్యం బగు నితిని కీర్తి కమనీయ విభన్. (కదంబకైత-- 19-7-1973).

## శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రి

పలుకు విలువ గన్న పండితకవిరాజు
భోగిరీతిఁ దోఁచు యోగిమౌళి
మనసుపండినట్టి మానవతావాది.
యిఁకను మనకు లేఁడె కృష్ణశాస్త్రి.

ఋషినోట వెల్వడిన యుప
నిషదుక్తులు కృష్ణశాస్త్రి నిగదితకృతు; లీ
సుషమకు నెలవై తెనుఁ గు
న్మిషమై పరభారతీ సమీడిత మయ్యెన్.

తెనుఁగు రవీంద్రుఁడు నా నితఁ
డనవధియశ మందుకొనె; నిజాధ్వమునకు రాఁ
బెనఁగెడి కవులన్ బెక్కురఁ
గనుఁగొనె; ధన్యత్వ మింతకంటెను వలెనా?

పరమసత్యమైన పలు కే మతమ్మునఁ
దోఁచుఁగాక దాని సైఁచు నితఁడు
సమత సర్వయోగసారముగా విశ్వ
సించునట్టి మధురశీలుఁ డితఁడు.

లిబ్బికొఱకు వ్రాయలేదు కైత, చెనంటి
కట్టెకొఱకుఁ బదము కట్టలేదు
పలికెఁ గృష్ణశాస్త్రి పరమేశ్వరప్రీతి
కొఱకు సత్యధర్మగుప్తికొఱకు.

శాస్త్రి కూర్చు మేఘసందేశమున్ విని (మల్లీశ్వరి సినిమాలోని'అందాలటి! మేఘమాలా!" అనుపాట)
కాళిదాసుఁ డెంత కరఁగినాఁడొ
యితని గీతి మఱవ దీ జాతి పయ్యెర
వీచు దనుక మల్లె పూచు దనుక.

కరుణ కలదు, ప్రేమ కల, దీవి కల, దాత్మ
కలదు కృష్ణశాస్త్రి కవిత యందు;
టన్ను బరువు దాని కున్నదా? యని నొస
లెత్తి యడుగువాని కేటికోళ్ళు.                    (కదంబకైత - 14-3-1975).

### క్రొత్త సత్యనారాయణ చౌదరి

క్రొత్త సత్యనారాయణ కోవిదుండు
గురుఁడు కవి విమర్శకుఁడుగా గరిమ నందె
నిన్ని నేరుపు లొక్కచో నిరవు కొంట
యబ్బురం బని భావించు నాంధ్రజగము.

ఆస్తికతయందు నితఁడు ప్ర
శస్తిం గనె వేంకటేశచరణార్చకతన్;
ప్రస్తాఖిలవేదనుఁడై
స్వస్తిం గను నితఁడు నేఁడు జలజాక్షుకడన్.

పున్నెములకుం గొటా రగు
నన్నయ తిక్కన్న యెఱ్ఱనయు సోమనయున్
జిన్నయసూరియుఁ గన్పడ
మిన్నందిన తనివి నితఁడు మెలఁగుచునుండున్.

నా కథాసరిత్సాగరవాకు నీదు
గద్యమునఁ దోఁచు నని యనవద్యుఁడైన
వేదము బుధుండు కొనియాడ వినతుఁడగుచు
బాష్పములు రాల్చియుండు నీపండితుండు.

మానవత్వదృష్టిలేని పురాణముల్
ద్రచ్చి, నిజము వెలికిఁదెచ్చి తనుచుఁ
త్రిపురనేని సుకవి దీవింప "నిది నీదు
కరుణ" యని యితండు కరఁగియుండు

(9-11-1975) - కదంబకైత)

**భారతీదేవి సంస్తుతి (అఖిల భారత కర్షకనేత ఆచార్య యన్.జి. రంగాగారి సతి)**

పండి కైవ్రాలిన బంగారు వరిచేలు
        విశ్రుతంబైన నీ వినయరేఖ
ప్రాగర్ణవ తరంగపటల మేప్రొద్దు నీ
        మదిని ఉంపిలు దేశమాతృ భక్తి
కపురంపు టనటుల కంచెలో ముగ్గిన
        ద్రాక్ష నీ దయితానురాగరుచులు
ఆతపార్తులు సైఁచి యాశ్రితాళికి నీడ
లొసఁగు మ్రాఁకులు నీ కృపోదయంబు
పెల్లువిచ్చిన చిన్నారి మల్లెపొదరు
బడలిబడలి గడించు నీ పరమయశము
చాటు చున్నవి భారతీ! జగమెఱుంగ
నీవు లేవని కుందు మా కిచ్చి జడత

1 బసవయగారి సంస్మృతి సభాస్థలి నిల్పి, తదీయ జీవిత1 (కావూరు వినయాశ్రమస్థాపకులు)
ప్రసవ నిసర్గ సౌరభము పంచితి వంచిత శబ్ద మాధురిన్,
వెసవెస నిల్లు చేరితివి, వీడితి జీవ మహో! నినుంబలెన్
గొసగడె వచ్చుదాఁకఁ బ్రజకున్ శ్రమపడ్డ వెలందు లుందురా!

తను వసత్పదార్థమని యెఱుంగుదు, మాత్మ
నిత్యవస్తువన్న నేర్మి గంటి,
మైననేమి, చిత్త మవశమై భారతి
లేమి నెంచి విహ్వలించు నదిర!

మూఁడు నాల్గుమూరల నొడల్ ముడిఁగియుండ
నాత్మ జగమెల్లఁ దిరుగు నిచ్ఛానుగతిని,
మర్త్యమది, యిది మృత్యువున్ మందలించు
నైనను మనమ్ము కలఁగు దేహాత్యయమున.

అవధిలేని ధునీ ప్రవాహమ్ము వంటి
దాత్మ; బహుదేహములు దీని నావరించి
పాయుచుండు; వివేక మీపాటి మనకుఁ
గలదు గాని చెన్నఁటిమాయ కన్నుగప్పు

పండిపండి ప్రతిష్ఠిత ప్రజ్ఞుఁడైన
మనుజుఁ డిట నుమ్మలించుట మానఁగలఁడు;
కాని శిక్షితచిత్తుండుకాని వాఁడు
నిగ్రహమ్మును బాటింప నేర్చునొక్కొ!

భారతదేవి యన వీరపత్ని యనఁగ
వీరనారీమతల్లి నాఁ బేరుగన్న
వెలఁది కద, తెల్గుజాతి గర్వింపఁదగిన
మగువకద, యీమె నెప్పాట మఱవఁగలము

సత్యమునకు నహింస కాస్థానమైన
పుణ్యయుగమున జన్మించి, భోగములను
మఱచి, బ్రదుకు సర్వము త్యాగమయ మొనర్చి,
చనిన భారతీ! నీ పెంపు సంస్మరింతు.

ఒక్కత్యాగముచే ముక్తి చిక్కుఁగాని,
జన్మములచేత, సిరిచేత, సంతుచేతఁ
జిక్కదని పెద్దవిశ్వసించిన వివేక
ధన్య భారతి, రంగాకుఁ దగిన పొలఁతి

పతి కెనలేనిగౌరవము బల్మియు నేర్పడఁ దత్పథమ్మునన్
బ్రదుకు టపేక్షణీయమని భారతి భారతమాతృవేదనా
చ్యుతికి నతీవకష్టముల నోర్చి, నపారతపమ్ము సైఁచె, సం
తత మగుసేవ, కీవికిని దా నొకమూదలగా నిలంబడెన్

నడివేసంగితఱిన్ ఖరాంశుఁడు జగానన్ నిప్పులన్ గ్రక్క న
య్యుడుకున్ సైఁచి, విదేశవస్త్ర విపణివ్యూహంబు మ్రోలన్ నిలం
బడి నీవై పికిటింగు చేసిన కథల్ భావంబునన్ దోఁచి మా
యొడలెల్లన్ బులకించు నిప్పటికి; నోహో! దేశసేవాకృతీ!

ఒక్క చెఱఁగాదు రంగా
యెక్కడ నేచెఱలఁబడియె, నీవును నాయా
యిక్కట్లఁ బడితి, వోడక
నిక్కపు సహధర్మచారిణీత్వము వెలయన్.

పదవుల కాసింపక, సం
పదలకు నారాటపడక, పతితసమాజా
భ్యుదయము నర్థించిన నీ
బ్రదుకు నెలంతలకు మేలుబంతిగ నిలుచున్

కట్టా! యేమగునో భవత్ప్రియుఁడు రంగాయంచు నీపోకతో
నట్టేటన్ సుడివడ్డ నావకరణిన్ మాచిత్త మువ్వేత్తుగా
నిట్టట్టూఁగెను, గాని యోగి యగుటన్ హేమాద్రి మాద్రిన్ విప
ద్ఘట్టోలంఘన సల్పి నిల్చె నతఁడక్కా! లోకమక్కా! యనన్

"భారతిచెప్పె నిప్పగిది, భారతికియ్యది గిట్ట" దంచు నూ
రూర నిజప్రసంగముల యుష్మదపార వివేక మెన్నుచున్
నీ రమణుండు నీయెడల నిర్భర గౌరవమున్ వెలార్ప నీ
నేరిమి లోఁతులన్ గని మనీషికదంబము విస్మయంపడున్.

అంతవిరివిగా రసార్ద్రమ్ముగా సత్య
బంధురమ్ముగా సభల్ నుతింప
నేమగండు పల్కె నిల్లాలి కథ కళా
ఖండమగుట, నీ మగండు తక్క.

అకట! భారతి పోయెనా యని వగర్చు
మనుజు లీనాఁడు త్యాగమ్ము మరగవలయు,
నిదియ తత్సతికిన్ శాంతినిచ్చు, నిదియ
తత్పతికిఁ దగినట్టి యోదారు పగును.

కలదు కస్తూరి, బాపుజీ కలఁడు, నీదు
క్రేవలన్ దలిదండ్రులై ప్రేమగురియ;
చింతలను మాని శాంతి నిశాంత మనఁగ
దివ్య భూముల భారతీదేవి! నిలుము. (1976)

## శ్రీ కావూరి వెంకయ్య (పల్నాటిగాంధి)

ఇతని యింటిపేరు జతపడె మాయూరి;
కెవ్వఁ డితఁడు? మమ్ము నేల విడిచె?

విప్లవంబు లెవ్వి వెంకయ్య నల పల
నాటి కనిపె నాగులేటి దరికి?

పలనాటి రాజునకు మా
వెలనాటి మహీశునకును వియ్యము గదురన్
దళవాయిగ వెంకయ పె
ద్దలలో నొకఁ డలుగురాజు దండకుఁ జనెనో!

కాకుండిన వెంకయ్యకు
నీ కడిమియు బరవసంబు నెమ్మొయి దక్కున్
లోకోత్తర వీరాగ్ర
శ్రీ కుల్యలు వీని శిరలఁ జిందులు త్రొక్కున్

తాతముత్తాతలకు శిరోధార్యమైన
యుద్ధవీరము వెంకయాఖ్యుని యెడంద
ధర్మవీరముగా నవతారమెత్తె
భావగతి మాఱి బాపుజీ ప్రభలు చేరి

పలనాటికి నితఁ డెంతయు
వెలుఁగిచ్చెన్ బగలు రేయి వేసటపడుచున్
వెలివాడల మలనీడలఁ
జెలరేఁగు పిసాళి కాఱుఁజీఁకటు లణఁగన్

మరల మహికి వచ్చె మన బ్రహ్మనాయండు
కుటిలకులవిధాన కుడ్యవీథి
విటతటమ్ము సేయ వెంకయ్యగా నని
పలికె నితనిఁ జూచి పల్లెనాఁడు

పుంజ నంజ యయ్యె బుడిబుడి కాలువల్
సాగిసాగి కృష్ణ జలము నింప;
వెలిఁగె నింట నింట విద్యున్మహస్సు లీ
పరహితైషి గాసిపడుటఁ జేసి

ఇతని సేవ కతనఁ గృత బుద్ధులై సము
న్నత పదంబు లంది నుతులు పడయు
దొరలు గలరు నేఁడు హరి, గిరిజనులలోఁ
బల్లెపట్టు నుండి ఢిల్లివఱకు

సజ్జ కంకు లేఱి చలిదికిన్ జాలక
నవయు నూళ్ళు రాజనాలఁ దినుచుఁ
ద్రేఁచుచుండె నిపుడు; దివి నున్న శ్రీనాథుఁ
డబ్రపడఁగ లజ్జ నడఁగి మడఁగ

తెల్లదొరతనమ్ము చెల్ల దీ మహి నన్న
దిట్ట యితఁడు గాంధి చుట్ట మితఁడు
పురుగు లురలు కసటుఁబులుసు పాయసముగాఁ
ద్రాగె నితఁడు చెఱల కేగియేగి

ఇతని సేవ యీవి యిట్టి దట్టిదియని
పలుకనేల వేయిపద్యములను;
వీరనారి యైన భారతికిన్ బ్రాణ;
మనఘుఁ డైన రంగ కాత్మ యితఁడు

చావ లే దితండు చచ్చినాఁ డని విశ్వ
సించువారు తెలివిసెడినవారు;
గాంధి చచ్చినపుడె కావూరి వెంకయ్య
చచ్చు రవియు శశియుఁ జచ్చు, నపుడె ( కదంబకైత - 25-8-1976)

## శ్రీ జయప్రకాశ నారాయణ

మంచిపని చేసితివి మహామతి! జయప్ర
కాశనారాయణా! క్రుళ్ళి గౌలుగొట్టు
నీతి కిరవైన దేశాన నిన్ను వంటి
యోగి నిల్చి ఘటించు నభ్యుదయ మెద్ది?

ముసలితల లెన్నియున్నను ముగిసినది జ
యప్రకాశ నీ తోడ మహాత్మయుగము

మరల నతిమానుష త్యాగమయ చరిత్రుఁ
డెప్పటికి నిన్ను బోఁటివాఁ డిచటఁ బుట్టు?

నీ కొమ్మ కోరుటయు నీ
వీకొంటయు బ్రహ్మచర్య మిల కబ్బురమున్
జేకూర్చుఁ గాని యీ నెఱి
లేకున్న జయమ్ము నీకు లేదు ప్రకాశా!

కలుపుచున్నారు నీ బూది నలసి సొలసి
బహుసరిత్తుల భారతప్రజలు నేఁడు
నీర మిది క్రోలి జన మధీకార దాహ
దూర మగుఁకాక లోకబంధూ! ప్రకాశ! (సందేశ సప్తశతి - 1981)

**శ్రీ గుళ్లపల్లి పున్నయ్య శాస్త్రి**

గుళ్ళపల్లి పున్నయ్యశాస్త్రి కూడ దివికిఁ
గదలెనా! పట్టువిడువని గాంధిబంటు
నవకమునఁ దోఁగు కూఁకట్ల నాఁడె యితఁడు
ముందడుగు వైచెఁ దెలవానిఁ గ్రిందుసేయ

అచట సాబర్మతీతటి నసహయోగ
సమరదుందుభిరావంబు సాగె; నిచట
గుళ్ళపల్లి పున్నయ్య శాస్త్రి గొంతునుండి
వెడలె గాంధికి జే! యన్న వీరవాణి

తెలుఁగునేల నితఁడు తిరుగనిసీమ లే
దపుడు కాంగ్రెసునకు నండ యగుచు
పశ్చిమాంధ్రభూమిఁ బ్రాభాతభేరి మ్రో
గించె నితఁడు దెసలయంచు లదర

ఒకకాలు బందిగమ్మున
నొకకాల్ గుంటూర నిడి మహోద్యమ నిర్వా
హకుఁడై పున్నయ యా నాఁ
డకుతోభయుఁడై యెదిర్చె నాంగ్లప్రభుతన్ (సందేశసప్తపతి - 1981)

**శ్రీ తెన్నేటి విశ్వనాథము**

తెన్నేటి విశ్వనాథుఁడు
మిన్నేటి నదల్చె మేలి మేలియశానన్
కన్నీటివఱద నాంధ్రము
మున్నీటిన్ దొరసె నాకమున కితఁ డేగన్

ఏనరుఁ డీవికి శుచితా
స్థానంబగు బ్రదుకునకు నిదర్శన మఖిల
క్ష్మానుతికిన్ జాలినవాఁ
డా నరుఁ డని విశ్వనాథునయనము చాటెన్

తొమ్మిదవపదినుండి పందొమ్మిదేండ్ల
యువలకైనను దెన్నేటి యొజ్జయయ్యె
నౌచితి నెఱింగినట్టి నాయంకునకును
గవికిని వయస్సు తెచ్చు నిక్కట్టు లేదు. (సందేశసప్తశతి - 1981)

**శ్రీ గోగినేని లక్ష్మీనారాయణ**

హే! లక్ష్మీనారాయణ!
యేలా సశరీరయాత్ర నిస్సీ! యనఁగం
జాలితివి బంధుమిత్రుల
యాలుంబిడ్డల యెడంద లలమటఁ జిక్కన్

ఔను నీ తప్పు కాదులే, దాన ధర్మ
సత్య సౌహార్ద నమ్రతా శౌచరోచి
రుజ్జ్వలం బగువేళ నీ వుద్భవించి
యెదిగితివి సాధుశీల సంపదల తోడ

తెల్లవాని నెదిరితివి సబర్మతి యతి
యిడిన హేతితో నహింసతోడ
నరక కల్పమైన చెఱసాల నిల్చితి
వలరుఁ దోఁట నిల్చినట్లు వలఁతి!

పదవులకుఁ జదువు లమ్మక
పదుగురకై లెస్స గాసిపడితివి; ప్రజ్ఞా
నిధి యంగీకృత జనతా
భ్యుదయుఁడు రంగాకుఁదగిన సోదరుఁడవుగన్ (విశ్వకర్షక నేత ఆచార్య యన్.జి. రంగా)

గాడిదలకు గుఱ్ఱములకుఁ
దేడా కన్పింపనట్టి దినముల, సిరియే
ఱేఁడగు దినముల, బ్రదుకుట
కూడదని తలంచి చేరుకొంటివి పరమున్.

అటఁ గన్పించిన బాపూ,
పటేలులకు నేఁటి కుటిలభారతకథ తె
ల్పుటకుం బూనకు, మందఱు
పటుశాంతిం గనుఁడు తత్త్వపరతంత్రమతిన్.

మా గొడవలు చిరకాలము
సాగవులే, సమసమాజ సంక్రాంతిమయూ
ఖాగమ మేర్పడుచున్నది
రాఁగల దిఁక ఫలము నిన్ను రాచిన కృషికిన్ 10-6-1981 చక్కట్లు

**శ్రీ ఆచంట నాగయ్య**

విదియజాబిల్లి రేకల వేయిమార్లు
కనెడి భాగ్యము దక్కె నాగయ్య!నీకు
ఎన్నఁదగు నాయు విదియైన నిన్నుఁబోలు
లోకసేవకునకు నల్పమే కదయ్య!

సంతత ప్రజాసేవలో స్రగ్గువారు
పరులసుఖ మాత్మసుఖముగా నరయువారు
దవ్వగుట యోర్వఁజాలదు ధర, నిరంత
రాయురారోగ్యములు వారి కాసచేయు

కర్షకప్రజావికాసంబు దేశంబు
నుద్ధరించు నన్న బుద్ధితోడ

నిన్న మొన్న గాదు నీ వర్వదేఁడుల
నాఁడె నడుముగట్టి నలఁగి తౌర!

అచట నచట భవాదృశు లబ్బుకతన
గడలుకొన్నది రైతురంగా మహత్త
విశ్వకర్షకనేతగా విమలశీల
దాతగా నుతులందె నుదాత్తుఁ డితఁడు

ఈ సజ్జన చూడామణి
నీ సేవానిష్ఠ, నీ మనీష నిజోప
న్యాసమ్మున మునుమెచ్చక
యేసభ నేసీమఁ బల్కె నితరాంశములన్?

బడియైన బాటయైనను
సడిసన్న కళాతపస్వి సత్కృతియైనన్,
బొడమినదా! నీవు కడుం
గడు వేసటపడక యప్పికట్ల పురానన్.

అప్పికట్ల యనిన నాచంట నాగయ్య
మదికి వచ్చు సర్వమండలముల
మఱవలేరు నిన్ను మానవుల్ తెమ్మెర
వీచుదనుక, మల్లెపూచుదనుక (7-6-1981 - దివ్యజ్యోతి)

## శ్రీ వినోబాభావే

ఎన్నఁడో పోయెను మహాత్ముఁడు
నిన్న భావేబుషియుఁ బోయెను
కాఱుమబ్బులు క్రమ్ముకొన్నవి
భారతాభ్రమునన్

కత్తిపట్టని నెత్తురోడ్వని
క్రాంతితో నుతిగన్నగాంధికిఁ
దగిన శిష్యుఁడుగా వినోబా
జగము నలరించెన్

నరుని మదిలో గుఱ్ఱువెట్టెడి
కరుణ మేల్కొనె నితని పల్కున;
పరుగులిడె భూదానగంగా
ఝరులు నల్గడలన్

ప్రథమదాత యెవండు? పోచం
పల్లివాఁడే తెలుఁగువాఁడే
రామచంద్రారెడ్డి యితఁ డప
రాజితయశుండు

వాఁడు నా కంటెను దరిద్రుఁడు
వానికిన్ బొల మిండు ముం దని
చెప్పిన మహామానవుని సృ
ష్టించెను వినోబా

నీవు చక్కనిదాన వబలా!
నేను దుష్టుఁడ నన్నుఁ గదియకు
మిదె జొహా రను మేలిమానిసి
నితఁడు సృష్టించెన్

సఖ్య ముడిగి మరుత్సుత జరా
సంధులై చెడు నన్నదమ్ములు
రామలక్ష్మణు లైరి యీ యతి
రాజు హితవాణిన్

ఉన్నకుంటలు నాల్గు పేదకు
నొసఁగితి నిఁకన్ గూలి కేగెద
నిదిగొ పత్రం బను దయాఖని
నితఁడు మన కిచ్చెన్

వేడ్కతో నర్పించు దాతలు
వినతిమైఁ గైకొను దరిద్రులు
చట్టములతో రారు యతి స
ద్రమాట్టు నుడుల వినా

బొజ్జపెంచినసాహు లందఱు
పూనవలె నపరిగ్రహవ్రత
మిది వినోబాయతివరేణ్యున
కిష్టమగు చేఁత

గోవుకుత్తుక గోయుచెన్నఁటి
గుండెలో నెన రెపుడు పైకొను
నపుడు భావేగురుఁడు శాంతికి
నాలవాల మగున్ 16-11-82

ఆత్మవిచ్చివిచ్చి యల్పాల్పమగు మేన
నిముడలేక కవిసె నెల్లదెసల;
లేదు మనకు నిఁకను లేదు భావేయతి
ప్రభువుతనువు పాంచభౌతికమ్ము

యోగి భాస్కరుం డయో! క్రుంకినాఁ డని
కుందరాదు నరుఁడు కందరాదు;
ఇతని దీప్తి నిల్ప నేను లేనా యని
నిలిచి యెల్లవాఁడు నెగ్గవలయు

మూఁడునాల్గేఁడులా పదుమూఁడుసమలు
ధాత్రి జయపెట్టఁగాఁ బదయాత్ర సల్పి
బాపుజీ శిష్యుఁ డిమ్మహాపండితుండు
చాటె మనకు వేయేండ్లకు జాలునీతి

తత్త్వవిద్యకు విజ్ఞానతంత్రమునకు
సఖ్య మేర్పడవలయు విశ్వము సుఖింప;
బుద్ధికిని మనస్సునకును బొసఁగుపాటు
లేనిచో నుర్వి చెడు నన్న జ్ఞాని యితఁడు

ఎల్లమతముల సారంబు నెఱఁగు నితఁడు
సర్వధర్మంబులును మెచ్చు సాధు వితఁడు
సకల భాషలు విద్యలు చక్కనేర్చి
వాణిమగరూపుగా నుతుల్ వడసె నితఁడు

వేదముల నరణ్యవీథులఁ దోఁచిన
ఋషిని గంటి మీ వరిష్ఠునందు;
అజర మమర మమల మవికార మగు పెను
వెల్గుగా కితండు వేఱు కాఁడు (కదంబకైత - 22-11-82)

ఆతఁ డుగ్రతప: కృశీభూతుఁ డాతఁ
డున్నత శరీరయష్టి సంపన్నుఁ డాతఁ
డాత్మసందర్శ నోజ్జ్వల దక్షియుగళుఁ
డాతఁ డార్ష మహస్సున కానవాలు

అతఁడు నేర్వనివిద్య లే, దతని కగ్గ
పడని భాషయు లేదు, ప్రాక్పశ్చిమ ప్ర
పంచ సంస్కృతి పుక్కిటఁబట్టె నతఁడు
నిఖిల మానవతా ప్రతినిధి యతండు.

దుర్భ రావేశమునఁ దప్పు త్రోవఁ బట్టు
దేశభక్తిని గాంధేయదిశకు మలఁచి
సత్యసంసక్తిమై నహింసా ప్రవృత్తి
మై గరిష్ఠతఁ గను కర్మయోగి యతఁడు

జగతి యింద్రియసుఖలాలసతకు లోఁగి
కామ్యకర్మాను గతికమై కదలువేళ
నిత్య నిరవద్య నిగ్రహనిష్ఠ కండ
దండయై నిల్చు నూర్ధ్వరేతస్కుఁ డతఁడు.

పరమగుహ్యమ్ము గీతా నిబంధితమ్ము
బ్రహ్మవిద్యను బసులకాపరికి సైత
మెఱుకపడునట్లుగా నింత లింత లైన
కథలుగాఁ బ్రవచించిన బుధుఁ డతండు

వ్యక్తిసత్యాగ్రహ ప్రధనాంగణమున
నిలువఁజాలిన మొదటి సైనికుఁడుగా మ
హాత్ము నుల్లము లోఁగొన్న యనఘుఁడతఁడు
వీరులకు వింతగొల్పిన వీరుఁ డతఁడు

ఒక మహాశాస్త్రమర్యాద నొంది వెలసె
నతఁడు చేపట్టినంతన యలఁతి కదురు
ఒక మహావేదబుక్కు వానికిఁ గరంగి
చల్లచల్లని దేశియై వెల్లివిరిసె

కుత్తుకలు గోసి నెత్తురు కూడు గాదు
తృష్ణలను ద్రుంచి యమృత మందించు నతఁడు
విప్లవము కాదు, వానిది విశ్వశాంతి
కాదరువుగా నెసంగు సర్వోదయంబు

అది సర్వోదయరుక్ప్రసార, మది వహ్నిజ్వాలికామాలికా
స్పద నిర్భాగ్యనరప్రపంచముఖ వర్షావారివాహచ్ఛ టా
భ్యుదితాసారము ధర్మపూర మఖలాంహో వాసనాదూర మ
య్యది భావేపరమర్షి బోధిత మహీయస్త్యాగ సారమ్మురా!

జనచయమ్ములు దేవతాగణము లయ్యె
దాత లెల్లరు హోతలై తరలివచ్చి
రుభయతారక మగుశాంతి యురలి పొరలె
నతఁడు భూదానయజ్ఞ దీక్షితుఁడు కాఁగ

కలిమి నిచ్చిరి, ముక్కారుపొలము నిచ్చి
రొడలి నిచ్చిరి, బ్రదు కిచ్చి రోటలేక
బాపురే! వాని పయనించు బాటలందు
నిండె నీవులు పుణ్యముల్ పండిపోయె

కానరాఁ డిఁక బాపుజీ కనుల కనుచు
శోకమయమూర్తియై క్రుంగు లోకమునకుఁ
బట్టుఁగొమ్మగ నిల్చిన యట్టి దీన
బాంధవుఁడు పావనుఁడు 'వినోబా' యతండు

కోటి కొకఁడేని వానికి దీటువచ్చు
పురుషుఁ డుండిన మహికి రాచఱిక మేల
శాసనము లేల యస్త్రశస్త్రమ్ములేల
ధర్మదేవత నాల్గుపాదముల నడువ (శబల)

## శ్రీ అయ్యదేవర కాళేశ్వరరావు

నూఱేండ్లనాఁడు పుట్టిన
వారలకే చెల్లె నిప్పువలె జీవింపన్;
పోరాము లెట్టివైనను
సైరించిరి వీరు దేశజననీసేవన్

వలచి నూనూఁగుమీసాల వయసునందుఁ
గడఁకమై ధరించిన వీరకంకణమ్ము
నయ్యదేవర కాళేశ్వరాభిధుండు
విప్పఁడయ్యె నహో! మేను విడుచు దనుక!

బానిసమునఁ గ్రుంగు భారతదేశమ్ము
విక్రమించి విశ్వవీథి నిల్చి
శిరము నెత్తఁ జాలు తరుణమ్ము రా నితం
డియ్య కొన్న వెతల కెల్ల కలదె?

మొగజోదు లిట్టిదిట్టల
తెగువఁగదా కనె సబర్మతీఋషి జయముల్
పగ నణఁచి పగతు నణఁపక
జగదద్భుత సంగర ప్రసాధకుఁ డగుచున్

సేవ కిష్టపడక, యీవి నెఱుంగక,
రాచపరువు నందఁ జూచువారు
తెలియవలయు నయ్యదేవర చరితంబు
నలయవలయు జాతి కహరహమ్ము (కదంబకైత - 1-1-1982)

## శ్రీమతి కాట్రగడ్డ అనసూయ
## (ఆంధ్ర లొయోల కళాశాల వ్యవస్థాపకులలో ప్రముఖులైన శ్రీ కాట్రగడ్డ రఘురామయ్యగారి సతీమణి)

కుసుమసమృద్ధితోఁ బసపుఁగుంకుముజల్లుల వెల్గు నెల్లితో
నొసపరిబందుగుల్ పరపునూర్పుల వెచ్చనతో విచారముల్
ముసరని మోముతో సుకృతమూర్తులు నా నుతిగన్నవారికిన్
వసపడు దివ్యలోకమున వాలితివా మము వీడి సోదరీ!

రామునిగొల్చినట్లు రఘురామునిగొల్చి నితాంతగౌరవ
శ్రీ మహనీయవై వినయసేవధివై కరుణావిధేయవై
ధీమ దపత్యసంపద నుదీరితవై విజితాత్మవై సతీ
స్తోమలలామవైతి వనసూయ! నినుం గొనియాడ శక్యమే!

పేరు కొందఱకున్ నేతిబీఱ కాఁగఁ
గొందఱకు రసాలంబయి కూర్చు యశము;
లేశమును నీకు నీరసలేమిఁ జేసి
సోదరీ! భవదాఖ్య సంస్తుత్యమయ్యె

అత్రియ నీవిభుండు, జగదభ్యుదయంబు వరించి యుత్తమ
చ్ఛాత్రుల సంతరింపఁగల సద్గురుపీఠము పార్థివీటికిన్
మాత్రవనీగళస్థ మణిమంజులమాలకుఁ జేర్పఁగాఁ బగల్
రాత్రియు విస్మరించి ఋషిరాజగుటన్ మహిళామచర్చికా!

రుసిపని యింద్రియార్థముల రోయుట, తత్త్వరహస్యవేత్తగా
మసలుటగాక సేవదెసమక్కువ చూపుట, యైహికార్థముల్
వసపడునట్లు లోకమునవారికి డయ్యుట, పామరప్రజన్
బసరపుబాటనుండి నరపద్యకుఁ జేర్పఁగ నారటింతయున్

శ్రుతులు గోవులు సూనృతవ్రతులు దాన
రతులు నీవంటి సత్పతివ్రతలు గాక
యెవ్వరు మహీభరమ్ము సహింపనేర్తు?
రెవ్వ రీ కలికలుచ మాయింపఁగలరు?

నీపతి రామభక్తిగణనీయుఁడు, శ్రీరఘురాముఁ డాంధ్ర సే
వా పరతంత్రచిత్తుఁడు, భవద్యశ మాశశిభాస్కరమ్ముగా
నీపుడమిన్ దనర్చుపని కీకొని చేకొని రామగాథ పు
ణ్యాపణ మందచందముల కద్దముగా వెలయించె మానినీ!

రామునివంటివారు కలరా? నరు లన్యు లశేషసద్గుణ
స్థేమము నాఁచికొన్న ప్రభుశేఖరు నీతని వేల్పుఁగా బుధ
గ్రామము నమ్మి కొల్చుఁగద! కల్కియు ముల్కియుఁ బల్కునున్ రఘు
స్వామికి నొక్కఁడే యనిన సైఁపనివా రిల నుండరే కదా!

దిక్కుదిబాసిలేని పెడదీవిని దుర్విధికోడి నిల్చినన్
రక్కసరక్కసుల్ దురితరాసులు కత్తికటారి దూసినన్
ధిక్కృతశంకయై నిజసతీత్వమహత్త్వము గాచుకొన్న సీ
తక్క చరిత్ర రామకథ కాంతరకాంతి కదా! యవీయసీ!

ఎది సుఖమ్ముమ్మలయందు నిమ్ముదప్పులయందు
నద్వైత పరిపాటి నవధరించు
ఎది యెల్లదశలలో నెడపడ కితరేత
ర స్వాంతములకు నూఱట ఘటించు
ఎది వార్ధకస్థితినేని హార్దమ్మున
కావంత కొఱఁత డాయమికిఁ బెనఁగు
ఎది మెల్లమెల్ల జంకు దొలంగ, సిగ్గు జా
ఱఁగ, నారఁబండినరక్తి నలరు

నదికదా జంటతనమన, నదికదా గ
ణేయ దాంపత్యమన; దీని నిలుపు పొలుపు
నభిలషింతురు సడిసన్న యాలుమగలు
మప్పెదరు లోకమునకు ధర్మంపుగుట్టు (నవంబరు 1982 - దివ్యజ్యోతి)

### మహాకవి శ్రీశ్రీ (శ్రీ శ్రీరంగం శ్రీనివాసరావు)

విశ్రాంతి నెఱుంగక దీ
న శ్రామికలోక వికసనప్రద కవితా
విశ్రుతుఁ డైన మహాకవి
శ్రీశ్రీ కనుమూయ జగ మచేతన మాయెన్

ధృతి యున్నది నిర్భర సా
హితి యున్నది రచన కసువు లీఁగల శిల్పో
న్నతి యున్నది శ్రీశ్రీ; కీ
ప్రతిభోద్ధతి నితని వాకు బాఁకై వెడలెన్

ఇతఁ డనిదంపూర్వం బగు
గతిఁ గవితన్ నడిపి నిర్వికంపయశోభ్రా
జితుఁ డయ్యె; నితని కెనయగు
కృతికర్తలు లేరు, రారు, రేపైన నిఁకన్

ప్రజ కేమి తెలియు మూర్ఖ
వ్రజ మది; యనుకవి శిరస్సు వంగఁగ శ్రీశ్రీ
నిజ మరసి ప్రజాహృదయ
ధ్వజమ్ముగా నెత్తె నుగ్రధాటీ కవితన్

“నా యుగ మిది” యని ఢంకా
వాయించి వచింప విప్లవకవిచ్ఛటయం
దీ యన్నకె కల దర్హత;
“జే” యందు నెడంద విచ్చి శ్రీశ్రీ కవికిన్ (కదంబకైత - 2-7-1983)

**శ్రీమతి ఇందిరాగాంధి ( దేశ ప్రధానమంత్రిణి)**

ఇందిర! నిశితమనీషా
మందిర! నిజదేశ విజయమమతా లబ్ధా
స్పందయశస్సుందర! దివి
కిం దరలుట సైఁపరాని కీ డీమహికిన్

అవనతంబులాయె నఖిలప్రపంచ ప
తాక లెల్ల నీమె పోకతోడ
ఈడులేని పేర్మి కిమ్ముగా నిమ్మెయి
మన్న మంత్రు లెంతమంది కలరు?

పేదఱికమునకు దవ్వయి
యీ దేశము వెలయవలయు నిది నాలక్ష్యం
బాదిమ వాంఛిత మని యీ
సోదరి నుతలందెఁ గార్య శూరత్వమునన్

తండ్రి జగము నేలెఁ, దాత మాతృమహీ స్వ
తంత్రతారణానఁ దనువుఁ బాసె;
ఇంటితావి జీవి కంటితీరు నటన్న
వాణి కిందిరమ్మరాణ సాక్షి

పిఱికిపందలకరణిఁ జంపిరి చెనంటు
లిమ్మహామహిళామణిన్ హ్రీ దొఱంగి;

వీరనారీమతల్లిగా వీడె నుసుఱు
సురిఁగె నిందిర శాశ్వతజ్యోతి యందు (చక్కట్లు - 7-11-84)

**శ్రీ జాగర్లమూడి శివరామప్రసాదు (కారంచేడు)**

ఈవికి నిరంతరమ్మగు
సేవానిష్ఠకు నుదాత్తశీలంబునకున్
గేవల నిదర్శనమ్ముగ
జీవించి యితండు సుకృతసేవధి యయ్యెన్.

కాకి చందాన నూఱేండ్లు గడుపు కంటె
రెండునాళ్ళైని కోకిలరీతి నుంట
యనఘులగువారికే దక్కు నన్నపల్కు
సత్యమొనరించె శివరామప్రసాద్ నేఁడు

చావుపుట్టుకలేని విశ్వంబునందు
నేఁడు శివరామప్రసాదు గణేయుఁడాయె
నితని నడవడి యెల్లర బ్రతుకు దిద్దు
నొజ్జగా నిల్చు వెల్గులు విజ్జరాల్చు. (1-9-1984 సంస్మరణ సంచిక)

**శ్రీ నార్ల వేంకటేశ్వరరావు**

నార్ల కన్నుమూసినాడఁట కటకటా!
జోడులేని తెల్గుజో దితండు
నిప్పువంటి బ్రతుకునేర్చిన వాఁ డౌటఁ
గత్తివంటి కలము నెత్త నొప్పె

కొంకు జంకు లేక కొమ్ములు దిరిగిన
మేటి దోసమైనఁ జాటె నితఁడు
సాధుశీలమూర్తి సామాన్యుఁడైనను
మింటి కెత్తె నతని మెచ్చిమెచ్చి

వెచ్చ పెట్టఁడయ్యె విత్త మీతఁడు తన
భోగమునకు, నింతి భూషలకును
కాసులెల్ల వాణి కరుణకే చెల్లించి
సాహితీజగత్ ప్రశంస వడసె

ఇతఁడు పల్లెటూర నేర్వోకపండువు
నాదరించు నింట నవతరింప
నోఁచెఁ; గానఁ దెనుఁగునుడి తీరు తీయనల్
మెఱయఁగల్గె నొరులు వెఱఁగు నంద

ఒక కావ్యముగా సంపా
దక రచన మొనర్చి, ధన్యతరుఁ డీతఁడు పా
ఠక చిత్తకుహర తిమిర
ప్రకరోద్ధతి నణఁచి లోకబాంధవుఁ డయ్యెన్. (2-7-1985 - చక్కట్లు)

**శ్రీ ఆకురాతి చలమయ్య (చీరాల)**

పుట్టని చావని జగాన
పుణ్యనిధుల్ గల జగాన
ఆకురాతి చలమయ బ్ర
హ్మానందము నందు నేఁడు.

కులములేని మతములేని
కూడు గుడ్డ గొడవలేని
మంత్రి లేని రాజులేని
మండలమున జేరె నితఁడు

అవిరళ సుకృతమ్ము తోడ
నవనికి వేంచేసె నితఁడు
రవికవి చరణమ్ము చెంత
రాణించెను విద్యార్థిగ

దిక్కులేనిప్రజ కుడిగము
దినచర్యగ బ్రతికె నితఁడు
చుక్కలలోఁ జంద్రుఁడు బలె
సుజనులలో వెలుఁగందెను.

కందెఱుఁగని కడలినురుగు
1 కుందేటి 2 మసూరిబువ్వ 1 పంటకాలువ 2 సన్నబియ్యం

చెలువుగుల్కు మల్లెగుత్తి
చలమయ కీర్తి పతాకలు (8-3-1985 సంస్మరణసంచిక)

**శ్రీ వేదాంతం జగన్నాథాచార్యులు**
**(తిరుపతి దేవస్థాన ఆస్థానపండితులు, అప్పికట్ల)**

సాధీయస్తకు సాహితీపటుతకున్ సర్వంకషప్రజ్ఞకున్
మేధాతీవ్రతకున్ శ్రుతిస్మృతిపథామేయ ప్రియత్వాప్తికిన్
వాదప్రౌఢికిఁ దారకాణ యగుచున్ వర్ధిల్లి శ్రీమజ్జగ
న్నాథాచార్య! యిదేమి మన్గడకు సున్నాచుట్టి తీ వక్షయన్!

పొట్టకుఁగాక, శాస్త్రముల పోకడలోఁగల చాతురిన్ జగా
గుట్టుఁ గనందలంచి బుధకుంజరసేవలొనర్చి డస్సి మేల్
పట్టములందుకొన్న ప్రతిభానిధి వీ; వికఁ నిమ్మహిన్ నెఱా
దిట్టలు నిన్నుఁ బోలెడి సుధీమణు లిద్దఱుముగ్గు రుందురా?

కోవిదవర్య! రామకథ క్రోల్చుచు నర్ధవిశేషముల్ సభా
భావసరోజముల్ విరియఁబాఱఁగ నీ వెఱిఁగించువేళ నీ
పావనమూర్తి నాదికవిభాస్కరు వాల్మికి నార్షదీప్తికిన్
దావలమైన ధన్యుఁగని తద్దయుఁ జొక్కితి మేము పల్మఱున్

నీ కిహయాత్ర నొల్లమి జనించుటచే నొక యప్పికట్లకే
కాక, సమస్తధాత్రికిని 1గాఁక ఘటిల్లె; వ్యథా విదాయియై 1 వేడి
నా కొలువింత విన్నఁబడెనా యని నేఁ డలమేలుమంగతో
నాఁకలుఁలేని యూర్పులకు నగ్గపడెన్ దిరువేంగళేంద్రుఁడున్

వెండియుఁ బుట్టుకోర్కి ప్రభవించిన,1 లక్ష్మణసూరి ధన్యతా
భాండము సంభవిల్లిన, శుభక్షితి నాంధ్రమునంద పుట్టి నేఁ
డెండుచునున్న యాస్తికత కిమ్ము బలమ్మును; దంభదర్పముల్
పండిన చిత్తవృత్తులకుఁ బాఠము సెప్పుము తత్త్వముం గనన్

1 రామానుజలవారిమొదటిపేరువీరాంధ్రులు మంగళగిరివారు వీరియింటిపేరు " ఆసూరి"
(22-4-1986చక్కట్లు)

**జనాబ్ గౌస్ బేగ్ (చీరాల)**

నవయుగం బది, గాంధియుగ మది వేయేండ్లనాటిఁ బానిసఁము ద్రోపాడి
భువనంబునన్ దలయెత్తఁగా భారతభూప్రజల్ కంకణం బూని
త్రివిధ బహిష్కరణోద్యమంబు సబర్మతీయోగిరాడ్నిశ్చితంబు
నవునని యూరూర మొరయించు తూర్యాళి కభ్ర మల్లాడు కాల మది

వేలు వేలు గడించున్యాయవాదులు గాంధి వినుచు సందేశమాలించి
మేలెంచి తమవృత్తి మాని కాంగ్రెసున కమేయమైన జనాదరంబు.
పాలకత్వంబు, రాఁదలఁవి వేసటనోర్చి పల్లెలన్ గుఱువెట్టువారి
మేలుకొల్పఁ దొడంగి రపుడు దాస్యముకంటె మిత్తి మంచిదిసుఁడీ! యనుచు.

మాయూరు కావూరి కేతెంచె ధర్మజ్ఞమౌళి నాఁ దనరు శిష్టాన్వ
వాయుండు పార్వతీశము సమిత్రమ్ముగా వారింపరాని వేడుకను:
వేయించిరపుడు పెద్దలు తమ్మటన్ నాల్గువీథులన్ గర్జించునట్లు
సాయంతనపువేళ సాగె వాగీశ్వరీ సదనాంగణమునన్ సదస్సు.

పడరానియిక్కట్లు పడి, జర్మనీ నోర్చి పదపడి తమకున్ స్వరాజ్య
మడిగిన పంజాబువారలం దెలవార లపుడు వేల్వేలను గాల్చి
మడియించినట్టి రాక్షసకృత్యమును జాటి మనుగడన్ మఱచిపోలేని
యుడకు నాపాదించెఁ బార్వతీశము సదస్సులచిత్తవీథి నవ్వేళ.

ఈయన్నతో నేగుదెంచిన గౌసుబే గింగ్లీషువారు కయ్యమున
శ్రేయమందిన వెన్క నోడినటర్కీకిఁ జేసిన ఘోరాపరాధ
మాయుర్వినేలు తేనికి వన్నెదెచ్చు మతాధికార మణంచివేఁత
హా ! యని ముస్లిముల్ దురపిల్లుటయుఁ దెల్పె నావేశ మార్తియున్ విరియ.

ఎట్టెటో నిలఁబడి యే నేలుబడి చంద మెఱిఁగినంత వచించి గాంధి
పుట్టినాఁ డెన్నఁడో పోయిన భారతభూమీ స్వతంత్రతన్ దేర
దిట్ట యీతం డార్షతేజంబు బలముగా దిక్కులన్నిటి నోర్వఁ జాలుఁ
గట్టుఁడీ కంకణం బితని మార్గమ్మునఁ గదలుఁడీ సోదర్యు లంటి.

నా పల్కులను మెచ్చి పార్వతీశము కొన్నినాళ్ళు మాతో నీవు నుంట
కూఁపవే తల యనఁ జిత్తముచిత్తమం చుత్తరం బిడితి నా సభను;

రేపల్లెసీమలో నటనటం గాం(గ్రెసు రీతిని జాటుచున్ మేము
రేపుమాపులు విస్మరించి, పైనము లాచరించితి మక్కాలమందు.

గరిమ దుంపా వేంకటేశ్వర్లుఁ గనగాలఁ గాం(గ్రెస్సు బంటుఁగాఁ జేసి
యరుదారుగతి భట్టిప్రోల్ వ్రేఁగు గిరిరావు నఱకడన్ నిల్పితి మపుడు
నరసింహు వేంకటేశ్వరు ధూళిపూఁడిలో నగరమ్మునం దుత్కటముగ
మెఱయింపుఁ డీ నిరాకరణోద్యమం బిచ్చు మేలుతీరనుచు వేఁడితిమి.

పదపడి దక్షిణాంబుధి చెంతఁ గల నిజాంపట్నమ్మునకుఁ బోవుదెంచి
మదినిడి కాజవా రిడు విందునకు నుబ్బి మాపటితఱి నూరినడుమఁ
గదిరినసభ నేలికలచంద మెఱిఁగించి కాం(గ్రెసు బలిమి నార్జించి
పెదపల్లి చూచి, మున్కుదురు చేరితిమి ఱంపిల్లిన యుత్సాహమునను.

విదుడు కృష్ణారావు యాజమాన్యమ్మునఁ బెద్దలపిన్నలతోడ
నొదవినగోష్ఠిలోఁ బార్వతీశ్వరుఁడు నేఁడోటు నిచ్చుట బానిసమున
కెదతోడ స్వాగతసత్కారము నొసంగుటే ! యనఁగా జనాబ్‌గౌసు
కదనం బిది మతాలకులముల పొడలేని కర్జమయ్యా ! యని వినిచె.

పదినాళ్ళ యాత్రగా నిది సాగుటం జేసి బడలికం జిక్కిన మేము
పదపడి స్వగ్రామములకుఁ జేరితి మంత బహుమార్గములఁ బన్ను బెడఁద
పొదలించు పురముగా నేర్పడెఁ జీరాల పొన్నున్నవారు, సౌఖ్యముల
కెదురుచూచెడివారు కోరఁగా దొరలు సరే ! యని చట్టమ్ము సేయ.

రామదాసునకు గోపాలకృష్ణునకు భారతమహీస్వాతంత్ర్య సిద్ధి
కామించి పెనఁగు దిట్టకుఁ బ్రజల్ తమపాలి కష్టంబులను విన్నవించి
యామేటిమాటనే దలఁదాల్చి యుర్విడి యలఁతిపాకాలలో నొదిఁగి
సీమదాఁక వెఱంగు పుట్టించి రానాఁడు చీరాల - పేరాలవారు.

చీరాలకాఁపైన గౌసుబే గీ సుప్రసిద్ధసంగ్రామమ్మునందు
శ్రీరామదాసున కండగానిలిచి యార్జించెనెల్లరమెచ్చుకోలు
కారాగృహమ్మునందెన్నెన్నితడవలో కాలమ్ముగడిపి నిరంత
రారాధకుండుగా నిలిచె దేశమ్మున కదిర ! కాయం బూడ్చు దనుక.

అనఘుఁడు యోగీంద్రుఁడగుగాంధి మెఱయ మాయభిజనంబున గుదుర్కొనిన
వినయాశ్రమం బెల్లవిధములన్ గెలుపంద, విదిత సీతారామశాస్త్రి
ప్రణుతచారిత్రుండు బసవయ్య, దుర్గాంబ, బ్రహ్మయ్య, రంగయ్య, తనియఁ
దన సేవ లర్పించి ధన్యతం గనె నమ్రతానిధానము గౌసుబేగు.

"కవిజీ!" యటంచు నన్ గనినంత గట్టిగాఁ గౌఁగిటం బొదివి మన్నించు,
నవభారతమ్ముగా బాపూ చరిత్రమున్ వ్రాసి ధన్యత గంటి వనుచు,
కవిత పల్కుట చెఱసాలలోఁ గాలమ్ము గడపుటకంటె హెచ్చైన
నెవు లనున్, బిడ్డలు సుఖముండిరే యనున్, నెమ్మిసంద్రము వోలె నెగయ

మంచానఁ బడె గౌసుబే గన్నవార్త నా మదిని గారింపఁగా వెడలి,
కాంచితి నితని, మీ వెత లెట్టి వంటిని, "కవిజీ" సలాము సలామ
టంచు నాల్గైదుమార్లనెఁ గాని యొండు పల్కనలేక యూర్చుచున్ గనుల
నించె నీ రవలఁ గొన్నాళ్లలో మేన్వీడె నెయ్యురాప్తులు పెద్దపొగుల.

చా వెల్లరకును దప్పని విపత్తె; బంటు చక్రవర్తియుఁ జచ్చువారె,
యీ వసుంధర నొడల్ దాల్చిన ప్రతిజీవి యీల్గుట నిక్కంబ, కాని
యీవిలో సేవలో నుతులందుకొన్నవా రిహయాత్ర చాలించినపుడు
బావురు మనుట తప్పదు వేదవేదాంత పరమార్థవేత్తకునైన.

ఛాత్రుఁడై, మిత్రుఁడై సడిసన్న వేంకటేశ్వరుని గాఁకరపర్తివంశ్య
గాత్ర మీ కొనకున్న నపుడప్పు డెదబల్మిఁ గదలి చీరాలకుఁ జేరి
మిత్రుని గని సాహితీ ప్రసంగంబు లామెతలుగాఁ దనియింపఁ బగలు
రాత్రియన్ భేదమ్ము మఱతు నీసుఖము శారదప్రసాదం బనుకొనుచు.

చెలికానియింటికి నొకనాఁడు వచ్చుచుఁ జెక్కబోర్డును దారిప్రక్కఁ
దిలకించి దానిపై "గౌస్‌బేగురోడ్డు" ను తియ్యనిపల్కులు చదివి
పులకించి మంచిపనిం బొనర్చిరి బలా! పురమేలువా రని యెంచి
యిల నేఁడు లేఁడు గదా! మిత్రుఁ డితఁడని యెడఁద నించుకసేపు వగచి.

ఈ 'చెక్క' యెన్నినా ళ్ళితని కీర్తిని నిల్పు నీ పురమ్మున యందు, రేపు
రాచఱికము సేయ వచ్చు వారందఱు రద్దు గావింప కీ చిన్నె
నాఁచి మన్నింతురా! యేమొ? తిప్పన్నరో డ్డప్పన్నరోడ్డుగా నగుట
చూచుచున్నాము కదా కొన్ని యెడల నిచ్చోచేయఁ దగుగృత్య మేమి?

నాకైత చాలదా గౌసుకీర్తిని నిల్ప నగము లంబుధు లుండుదనుక
ఈ కృష్ణవేణి గౌతమి పినాకిని తెల్గుటిలకు నన్నముపెట్టు దనుక
లోకంబు లేలు వెంకన్న తిర్మలలో వెలుంగులన్ విరియించు దనుక
శ్రీకవిత్రయభారతం బాంధ్రజాతి కుజ్జీవకంబుగ మ్రోయుదనుక.

చాలుఁజాలు సుహృన్మణీ! మామకీన మీసాహితీ సమ్మానమంది
నా లాల్‌బహద్దరుశాస్త్రి, లూథరుకింగు నర్మిలిన్ నినుఁ బెద్దసేయ
మేలుమేల్ తుమ్మలకవి సదాశయుఁడు సుమ్మీ! యని బాపుజీ పల్క
నేలోటు లేని యానందరాజ్యంబు నిఁక నేలుకొమ్మా ! గౌసుబేగ!

కలఁ డిందు జగదేకగురుఁడు భారతమహీకల్యాణసంధాతగాంధి
కల రిందు బాపుజీ కదనమ్ములకు దూఁకి కడిమి చాటిన యోధవరులు
కల రిందు యుగధర్మగతిఁ గృతుల్ పల్కిన కవిపుంగవులు, సదాశయులు
కల రిందు దాతృతానిధు లాత్మవేత్తలు గౌసూ ! గ్రహింపు 1మీకైత.(దివ్యజ్యోతి గ్రంథము)

ఏఁడీ ? గ్రహింప నీ గౌసని నను‌ఁ గొంద ఱెగతాళి సేయుదురేమొ;
చూడనేర్చినవారు, ని న్నుర్వి, నబ్ధిని సురమార్గమునఁ, దారకముల,
గాడుపునందు, నింగలమునందు, సహస్రకరునందు, బ్రాణులం, దెల్ల
మాడువులం, దద్రులందుఁ, జూతురు "పరమజ్యోతి" వీవు గౌస్‌బేగ!

(పై పద్యములన్నియు అభినవాక్కరలు, ఈ ఛందము తుమ్మలవారి సృష్టి, ఈ పద్యమున ప్రతి పాదమునకు 6 ఇంద్రగణములు, 1 సూర్యగణము ఉండును. 5వ గణము మొదటి అక్షరము యతి స్థానము. ప్రాసనియమము కలదు) ఇది రాగతాళములకు అనుకూలించును, (26-4-86) దివ్యజ్యోతి)

## శ్రీ జాగర్లమూడి చంద్రమౌళి

జనకుఁడు కుప్పుస్వామి పరిషత్తులు మెచ్చిన కీర్తి నందఁగాఁ
దనయుఁడు చంద్రమౌళియు నుదారచరిత్రము నేలఁజాలె; నీ
యనఘుఁ డశీతివత్సరములైనను నిండకమున్నె పోవుటన్
దెనుఁగుజగమ్ము విన్నఁబడె, దిక్కులనిండెను గాఢుఁజీఁకటుల్

సత్య శౌచ దయా క్షమా సత్వ వితర
ణాది దైవసంపత్తుల నలరువారు
పొలుచు లోకమునన్ సదా నిలుచుఁగాక
సాధుజనసరసీహేళి చంద్రమౌళి (సెప్టెంబర్ 1987-సంస్మరణ సంచిక)

## అనుబంధము
## (తుమ్మలవారి మృతిపై వివిధకవుల కవితానీరాజనము)

**సత్కవీ! శ్రీ ఓగేటి పశుపతి**

ఒకరొకరున్ దొలంగి చనుచుండిరి కావ్యకళాతపోనిధుల్
సుకవులు; వట్టిపోయె రసలోకము; గ్రుక్కెడు మంచినీళ్లు మా
కిఁక నిట పుట్టవేమొ? కట! యీవగ, యీదగ తీఱుటెట్లు? కు
త్తుక తడి ఆరిపోయినది తుమ్మల సత్కవి!నీవు పోయినన్

యమునా గంగలుగా, సరస్వతియుఁగా నావిర్భవించెన్ దృగం
తములన్ ద్వద్రసనాంచలమ్మునను సీతారామ!నీ శోకముల్
అమరజ్యోతిమహాత్ముఁ డీయిలకు దవ్వై; తత్త్రివేణీ సుసం
గమ మందింకను నింతమున్గి రఘుపంకంబింక నస్మాదృశుల్.

నిజముగఁ దెల్లవార్చుకొని నీ విట రోజులు సాత్త్వికప్రభా
వ్రజకలితుండవౌచు "మహరాజుగఁ" బోతివి కీర్తిమూర్తివై
అజగర మట్టులుంటి నిట అయ్యొయొ! గాఢతమ: ప్రవృత్తి ఈ
1 వృజిన మదేమొగాని, విధి రెండుగఁ జీల్చిన దొక్కగుండియన్ 1(పాపము)

**అంజలి - శ్రీ బండ్లమూడి సత్యనారాయణ**

కమ్మనిజానుతెన్గునుడికారము దారముగా, రసార్ద్ర భా
వమ్ములు పూలుగా, విమలభక్తి సుగంధముగా, మనోజ్ఞ కా
వ్యమ్ములు గూర్చి యాంధ్రిగళహారములన్ బొనరించి కొల్చు మా
"తుమ్మల" జూడఁగంటి, కరతోయరుహంబుల నంజలించెదన్.

**అజరామరవాఙ్మయమూర్తి - శ్రీ సూర్యదేవర రవికుమార్**

గాంధియాస్థానకవి నేడు కన్నుమూయ
కార్చినది ధర్మదేవత కంటనీరు
ఆంధ్రకవితాకుమారి ప్రత్యగ్రకంఠ
హార తరళమ్ము తెగి భూమియందు డిందె.

వారీ జగమెరిగినకవి
శ్రీరమణుని భక్తు, లాంధ్రసిరి తుమ్మల సీ
తారామమూర్తి చౌదరి
పేరున వర్ధిలిరి కైత పెన్నిధి యగుచున్.

కంటినీరు తుడిచి కైవారములు చేసి
పదములొత్తి పూలపాన్పువేసి
సేవచేయులెంక చేరగా స్వర్గమ్ము
దిక్కులేని దయ్యె తెనుఁగువాణి

ఏనాటికో గదా యిక
నీ నేలను మరొక తిక్కఋషి పుట్టి పసౌ
జాను తెనుంగున కృతులన్
మానుగ రచియించి ప్రజల మన్నన గనుటల్.

ఈ శతాబ్దపు తొలియేట నిచట పుట్టి
కమ్మకైతల నాంధ్రలోకమ్ము నూపి
ఈ శతాబ్దాంత్య దశకాన మృతిని
జెంది 'తీ శతాబ్దము' నీదె నిజమ్ము.

భౌతికమైన దేహములు భస్మములౌ నెపుడైన, పుణ్య సం
జాత త్రిశుద్ధకావ్యములు శాశ్వతమై కవిపేరు ధాత్రి వి
ఖ్యాతి నొనర్చు,గాన మృతి కల్గదు సత్కవిరాజకోటికిన్
ఆ తరణిందు వౌచు నజరామరవాఙ్మయమూర్తి వెల్గెడిన్.

**కవితామూర్తి - డా॥ సంజీవదేవ్ (ప్రముఖ చిత్రకారులు, కవులు)**
సీతారామమూర్తి - మూర్తిమయస్ఫూర్తి
నిశ్శబ్దాన్ని శబ్దంలోకి - శబ్దాన్ని వాక్యంలోకి
వాక్యాన్ని కావ్యంలోకి - కావ్యాన్ని రసంలోకి
రసాన్ని - ప్రాణస్పందనలోకి
మలచిన - కవితామూర్తివి నీవు
నీ కవిత - సరితగా ప్రవహిస్తుంది
నీ కవిత - సవితగా ప్రకాశిస్తుంది
నీ కవిత - కవితగా ఛందిస్తుంది.

కొందరు మనుషులుగా పుట్టి - అవుతారు కవులు
నీవు కవిగా పుట్టి - అయినావు మనిషివి
కనుక నీలోని కవితనుంచి - రూపొందింది మనవత
కవిత నుంచి - మానవత రూపొందినట్లె
తిరిగి మానవత నుంచి - రూపొందింది కవిత
మానవతలేని కవిత - వట్టి మట్టి కవిత -వట్టి పొట్టు కవిత

జీవితం నుంచి పుట్టింది కనుక - నీది జీవన కవిత
నీవు కవివి మాత్రమే కాదు - స్వయంగా కవితవు కూడ
కవితను వ్రాసి మ్రోగిస్తావు - కవిత అయి మ్రోగుతావు
కవిత గొప్పదా - కవి గొప్పా - అనే ప్రశ్న లేనే లేదు
సమానంగా గొప్పవే - రెండూ కూడ
ఒకటి లేంది - లేదు రెండవది
కవిలేంది కవిత లేదు - కవితలేంది కవిలేడు
నీవు కవివీ - కవితవు కూడ
కనుక నీ వుండటమంటే - రెండూ ఉండటమే

కవి అంటే రవి - కవి అంటే శశి
నీవు కవి కనుక - నీలో ఉంటాయి
రవిలోని కాంతి - శశిలోని శాంతి
కవి కావటానికి - చాలదు బుద్ధి మాత్రమే
చాలదు కూడ బోధి మాత్రమే
రెంటి అస్తిత్వం - అవసరం సమానంగా
బుద్ధి విశ్లేషణాత్మకం అయితే
బోధి అవుతుంది సంశ్లేషణాత్మకం
బుద్ధి ఆలోచన నిస్తే - బోధి ఇస్తుంది ఆలోకనను.

నీవు అంతర్ ద్రష్టవు - సుకవితాస్రష్టవు
నీ కవితారాగానికి మూలం - నీలోని నిబిడ అనురాగం
రాగం అందిస్తుంది - అనుభూతి సరాగాన్ని
అనురాగం ప్రసాదిస్తుంది.- చేతనాస్రవంతిని

కవీ! నీవు పుట్టింది పాతకాలంలో - అయినా నీకవితలు ఆనాటివికావు
ఈనాటివే - నేటివే

ఏళ్ళు ఎన్నివచ్చినా - నీలోని లేళ్ళపరుగు నిద్రించలేదు
ఆపరుగు ఆరని దీపంగా - మేల్కొనే ఉంది
నీలో వెలిగే నిబద్ధకవితాజ్వాల
ఈ అనిబద్ధ కవితాయుగంలో
చిన్నచూపు చూడబడలేదు
నీవు నిర్మించిన ఛందోబద్ధకవిత
ఈ వచనకవితా కాలంలో
మహనీయతను కోల్పోలేదు
వచనకవిత చెవికి ఇవ్వదు - సునాదాన్ని
మెదడుకు ఇస్తుంది ఆలోచన్ని;
నీ ఈ ఛందోమయకవిత ఇస్తుంది సునాదాన్ని
ఇస్తుంది సుమేధను కూడ

దేని శిల్పం దానిదే - దేని కల్పన దానిదే
వైవిధ్యం వాంఛనీయం - కవితలోను, జీవితంలోను
జీవనరీతి-జీవననీతి-భేదిస్తుంటాయి పరస్పరంలో
ఆరీతుల భేదం - ఆనీతుల ప్రభేదం
ప్రతిధ్వనిస్తాయి నీ కవితలో
వస్తువులో భేదం, శిల్పంలో విభేదం - ఉంటూనే ఉంటాయి.
పాత శిల్పంలో - క్రొత్తవస్తువు
క్రొత్త శిల్పంలో పాతవస్తువుకూడ - తలలెత్తు తుంటాయి.
మినీ కవితలు - క్రొత్త పాతల కలయిక
అచ్చగా క్రొత్తదనం కంటే - అచ్చగా పాతదనం కంటే
రెంటి సమన్వయం -కనీయంగా ఉంటుంది
పాతదనపు పట్టూ - క్రొత్తదనపు విడుపూ
లయమయంగా నర్తిస్తాయి - కవితారసాన్ని సృష్టిస్తాయి.

కవిత అనేది - కన్యకాదు - అదొక వన్యవిహంగం
విహరిస్తుంది - సునీలశూన్యంలో
నిశీథపు నీరవ నిసర్గలో - నైశ్చల్యపు నందనకాననంలో
శ్రామికుని - స్వేద స్రవంతిలో
వియోగపు - మానని గాయంలో - మండే కాయంలో

**కవిమూర్తీ!**
నీవు మరణించినా; మరణించకున్నా
కారుణ్యమూర్తిగా - వెలిగావు
మానవతాదీపాన్ని వెలిగించావు
కావ్యపు కాగడాను -కల్పనాలోకంనుంచి తెచ్చావు
వాస్తవాల మట్టిమీదకు - మర్మంలేని మిట్టమీదకు
ఆర్తిని దాటిన - స్ఫూర్తివి నీవు - సీతారామమూర్తివి నీవు!

**తెనుఁగులెంక - శ్రీ గిద్దలూరి చెంచు బసవరాజు**

తనయాస్థానకవీంద్రుని
దనచెంతకుఁ గొనెనొ గాంధితాతమహాత్ముం
డన, నభినవతిక్కన దాఁ
జనె, గోమలసరసభావసంగతి దివికిన్

తెలుఁగుభూమి, దెలుఁగుపలుకుబడి, తెలుంగు
బాస, తెలుఁగుసొగసు, వేస మొక్క
టనఁగనేల? సకలమును దెల్గు మయముగా
నెంచు తెలుఁగులెంక లెందఱుంద్రు?

కవి గతియించినగాని
కవితాసుధ విమలనూత్న కాంతులు గ్రక్కున్
నవరసబంధురకవితకు
భువి వృద్ధత్వంబు గలదె? పోఁడిమి చనునే?

తెలుఁగుతార యొకఁడు వెలుఁగుఁజిమ్ముచుఁ దెల్గు
సాహితీజగాన సంభ్రమించెఁ
దత్సువర్ణరోచి ధాత్రీ తలంబును
వెలుఁగఁ జేయు సర్వవేళలందు

**సీతారామమూర్తి - డాక్టర్ ప్రసాదరాయకులపతి**

సత్యము, అహింస తన కనుశాసనముగ
సాహితీరంగమందున సలిపె రచన

మానవత దాటి సాహితీ మాధవుడయి
మహితజన నుతుడయ్యె తుమ్మల బుధుండు.

అతని కవితాపయోనిధియందు పుట్టె
నవనవోజ్జ్వల గ్రంథరత్నము లెన్నొ
వాని వెలుగులు తెలుగుభూభాగములను
విమలసౌందర్య కిర్మీరితములజేసె.

వినయసౌశీల్యనిష్ఠావివేకమూర్తి
శాంతహృదయుండు సౌహార్దసంయుతుండు
మరువజాలని వ్యక్తిత్వమలరువాడు
స్ఫూర్తికరుడు సీతారామమూర్తిబుధుడు.

**సీతారామమూర్తి - శ్రీ కర్నాటి లక్ష్మీనరసయ్య**

తెలుగువాణిసుతుడు తిక్కన్నయను పేర
కీర్తి బడసినట్టి మూర్తి నేడు
భువిని లేడు సుమ్మి! దివికి నరిగె; చూడ
చూడబోవ మిట్టి సూరివరుని.

కవివై తెలుంగుపొలమున
రవిగా విలసిల్లినావు రససృష్టవునై
ఇవిగో నా నుతులను గొను
కవి సీతారామమూర్తి ఘనుశుభ్రాంశా!

**అభినవతిక్కన - శ్రీ చిట్టిప్రోలు కృష్ణమూర్తి**

తెలుఁగుందెర్వులు దిద్దిపోయెనెపుడో తిక్కన్న, యా త్రోవలన్
నిలువన్నేరఁడ నేఁటి కొక్కకవియున్, నిష్ఠాగరిష్ఠుండవై
గెలువంగంటివి నీవు, నీవలెఁదపఃక్లేశమ్ము సైరించు దో
హలికై యెన్నిశతాబ్దు లోర్వవలెనో ఆంధ్రోర్వి దివ్యాశయా!

**మహాకవీ! శ్రీనాగభైరవ కోటేశ్వరరావు**

ఓయి! అభినవతిక్కనా! నా-గేయసుమముల పూజసేతును
నిన్న ముగిసిన శతాబ్దములో-ఎన్నదగు కవివి.
సాటికవులంతాను భావక-స్వాములై ప్రణయాలు పూయగ
మహత్తరమగు మానవత్వం-మాట నిలిపితివి.

రైతుకవివై రచనజేసీ-రాష్ట్రకవిగా రాణకెక్కీ
గాంధిజీ ఆస్థానకవిగా-గణుతికెక్కితివి
తెలుగుదనమే నీకు ప్రాణము-భారతీయత ఆత్మగానము
మరొక 'సుబ్రహ్మణ్యభారతి'-మాకు నీవయ్యా!

ఏది చెప్పితి వదే చేసితి - వేది చేసితి వదే చెప్పితి
తనువులో అణువణువులో నీ-తత్త్వమే మధురమ్.
నీవు బ్రతికిన కాలమందున-నిలచియుండుట మాకు గర్వము
మహాకవి! నీ పరిచయమ్మే-మాకు పర్వమ్ము.

కాలచక్రము తిరిగిపోనీ-కథలుగాథలు మాసిపోనీ
తెలుగుసాహితి చరితలో నీ-తీరు చెదరనిది.
చందమామను అడిగితెచ్చిన-చలువవెన్నెల తోడజేరిచి
పూలపరిమళములతో మీకై-పూజ చేసెదము.

**ధర్మమూర్తి! - శ్రీ బొద్దులూరి నారాయణరావు.**

జవసత్వములబిఱ్ఱు జాఱుచున్న కొలంది
    జీవగల్గు కబ్బాలు చెలువు మీర
బక్క చిక్కినమేన పట్టుతగ్గుచునున్న
    తేటమాటల తేనె యూటలూర
ముదిమిచే తలయంత ముగ్గుబుట్టయిపోవ
    రచనావిధానమ్ము రాటుదేల
గడకఱ్ఱవలె నుండు నడుము పల్లకియైన
    చక్కట్లు నెక్కట్లు జాలువార

సుధల నింపిన సీసాల మధువులాని
వృత్త, గీతాల క్రొంగ్రొత్త నృత్తములను
ఆటవెలదితో సయ్యాటలాడియాడి
తనువు చాలించి యున్నట్టి ధర్మమూర్తి.

**జొహారు! - శ్రీ తాళ్ళూరి సత్యనారాయణ**

కరుణార్ద్ర మహితమౌ కవనవాహినులతో క్రాంతిసస్యములు పండించి
సరససర్వోదయస్తవనీయమార్గాన సారసంస్కృతిని నిండించి
సరళసంభావ్య ప్రసరణా యోగ్యమౌ జ్ఞానదీపికలు వెల్గించి
తరణివై వెల్గు సీతారామమూర్తీ! సుధారసస్ఫూర్తీ! జొహారు.!

గాంధీతత్త్వము వేదవాఙ్మయముగా కారుణ్య సద్భావ సం
బంధంబుల్ నెలకొన్న డెందమది దైవశ్రేష్ఠపీఠంబుగా
సంధానించిన మేటిసత్కవులఁబ్రజ్ఞారాశి వీవోయి! నీ
గ్రంథగ్రంథుల మూలసూత్రములు లక్ష్యంబుల్ సుధాపూర్ణముల్.

సామాజికకల్యాణము
కామించిన కవుల నగ్రగణ్యుఁడవయ్యా!
కౌమారం బాదిగ నీ
వామరణాంతము శ్రమించితా ఫలమందన్.

పేదలపై పెనుకూరిమి
సాదులపై నిండుపేర్మి చవిచూపెడు స
ర్వోదయనాదము కవితా
వాదంబై నీదుకైత పరిణతి నందెన్.

యుగయుగముల పర్యంతము
నెగడెడి భావములు చిమ్మి నిస్తులఫణితిన్
యుగకవితలు గుప్పించిన
యుగకర్తా! నీదు గ్రథనయోగముకాదె?

నిన్నుఁబోలు నిండు నిక్కచ్చిగల వ్యక్తు
లరుదు గాదె నేటితరమునందు
కవనమందె కాదు, కాపట్యమెఱుఁగని
నడల యందు, తాల్మినడక యందు.

**మా నాన్నగారి చరమదినము** (శ్రీనివాసమూర్తి)

అది మార్చి 21, 1990.
అది చాల చెడ్డరోజు మాకు.
మా నాన్నగారు సంవత్సరమునుండి
వృద్ధాప్యపు బలహీనతతో బాధపడుచున్నారు.
నేను ప్రతివారము వెళ్ళి వారిని చూచి వచ్చేవాడిని.
ఆరోజు వారిని చూచి వచ్చుటకు
నిడుబ్రోలు నుండి అప్పికట్లకు బయలుదేరాను.
సమయం సాయంకాలము 4-30 నిముషాలు.
ఎప్పుడు వేచివేచి చూస్తేగాని రాని ఆర్.టి.సి బస్సు
ఆనాడు వెంటనే వచ్చింది, అదీ ఖాళీగా.
నేను చేరాను అప్పికట్ల 5 గంటలకు.
మా యింటి వరండాలోనికి చేరి పాదరక్షలు విడుస్తున్నాను.

అప్పుడు మా అమ్మ మానాన్నతో
మీరు ప్రొద్దున్నుండి ఏమి తినలేదు.
కొంచెం గ్లూకోజునీళ్ళు తెస్తాను.
త్రాగితే కొంచెం నీరసం తగ్గుతుంది అని అంటున్నది.
అప్పుడు మానాన్న- ఇప్పుడేమివద్దు?
శ్రీనివాసు వచ్చాడా? అని అంటున్నారు.

వచ్చాను నాన్నా! అని నేను ఇంటిలోనికి వెళ్ళాను.
నన్ను చూసి మానాన్న చాలా సంతోషపడ్డారు.
ఎట్లా ఉన్నది నాన్నా- అని మంచం దగ్గరకు వెళ్ళి అడిగాను.
కొంచెం ఆయాసంగా ఉన్నదిరా
అయినా నీవు వచ్చావుగా బాగానే ఉన్నదిలే- అని అన్నారు.
అప్పుడు మాఅమ్మ నాతో అన్నది.
ప్రొద్దున్నుండి గంటగంటకు శ్రీనివాసు వచ్చాడా? అని అడుగుచున్నారు.

అందరు బాగున్నారా అని అడిగారు.
అందరు బాగున్నారని చెప్పాను.
తరువాత దేశరాజకీయాలెట్లున్నాయి? అని అడిగారు.
ఉన్న పరిస్థితులు చెప్పాను.
ఈ ప్రభుత్వం ఎట్లా ఉన్నది? అని అడిగారు.
ఫరవాలేదు అని చెప్పాను.
పేదల బాధలు పోలేదు, రైతుల కష్టాలు తొలగలేదు.
ఏమిటో! అని నిట్టూర్చినారు.
గాంధి కలలు కనిన రాజ్యం రాలేదు.
నేను మానాన్న దగ్గరే కూర్చొని మాట్లాడుచున్నాను.

కొద్ది నిముషములలోనె మానాన్నకు ఆయాసం ఎక్కువైనది.
అప్పుడే మా తమ్ముడు డాక్టర్॥ రఘు వచ్చాడు.
వెంటనే ఒక డెరిఫ్లిన్ ఇంజక్షన్ ఇచ్చాడు. కొంచెము ఆయాసము తగ్గినది.
ఎట్లా ఉన్నది నాన్న అని అడిగాను.
బాబూ! ఇక లాభం లేదురా. నా పని అయిపోయిందిరా.
తగ్గిపోతుందిలే నాన్నా అన్నాను.
ఇది తగ్గదురా, నీకు తెలియదు అన్నారు.
అమ్మను జాగ్రత్తగా చూసుకోండి అన్నారు.

వెంటనే మా తమ్ముడు గ్రామములోని పెద్దడాక్టరు కొరకు వెళ్ళాడు.
అప్పుడు నేను - మీరు ధన్యజీవులు, కమ్మని జగద్ధితమైన కావ్యములు వ్రాసారు.
గజారోహణ, కనకాభిషేకాది ఘనసన్మాములు పొందారు, శాశ్వతమైన కీర్తి
పొందారు. పిల్లలు అందరు బాగున్నారు. ఏమి బాధపడవలసిన పనిలేదు-
అన్నాను.

అపుడు బాబూ! బాబూ! అంటూ నా ముఖమును రెండుసార్లు వారి చేతులతో
ఎంతో ప్రేమతో నిమిరారు. నా కళ్ళు చెమ్మగిల్లినవి.

ఏదో పుట్టాను? ఏదో వ్రాశాను? ఇప్పుడదంతా ఎందుకురా? అన్నారు.
ఇంతలో పెద్దడాక్టరుగారు వచ్చారు. వెంటనే బి.పి. చూశారు.
నార్మల్‌గానే ఉందన్నారు. మరొక డెరిఫ్లిన్ ఇంజక్షన్ యివ్వమన్నారు.
వెంటనే మా తమ్ముడు మందును సిరంజిలోకి తీసాడు.

ఇంతలో క్షణాలలో మానాన్న పరిస్థితి మారింది. ఆయాసం పెరిగింది.
గుండెనొప్పిగా ఉందన్నారు. పెద్ద డాక్టరు ప్రథమచికిత్స చేశారు.
అయినా లాభం లేకపోయింది.
"రామ!రామ!" అంటూ క్షణములో తుదిశ్వాసవిడిచారు. సంవత్సరమునుండి
"రామ!రామ! రాజలలామా-సీతామాతా పాహిమాం"- అను కీర్తనతో మానాన్నగారు
కాలక్షేపము చేయుచున్నారు.

నేను, మా అమ్మ నిశ్చేష్టులమయ్యాము.
మాతమ్ముడు సిరంజితో అట్లానే నిలబడి పోయాడు.
మాతమ్ముడు మా నాన్నను పసిపిల్లవాడిని చూసినట్లుగా శ్రద్ధగా సపర్యలు చేశాడు.

ఆ క్షణమే మహాత్ముని ఆస్థానకవి మహాప్రస్థానం.
సమయం సాయంత్రం 6-55నిమిషాలు.
ఈ వార్త తెలిసి ఊరంతా వచ్చింది.
మహాకవికి జోహారులర్పించి వెళ్ళారు.

"తుమ్మల యుగం" ముగిసింది సాహిత్య చరిత్రలో
వారి ఆత్మజ్యోతి ప్రకృతిలో లీనమైంది.
ఇక వారిరూపం కన్పిస్తుంది వారి కవితలోనే. భావితరములవారు తుమ్మలవారి
జీవితము తలపోసి, వారి యుగకవితనాస్వాదించి "కలడె యింతటి కర్మిష్ఠి
కలికాలమున" అని ఆశ్చర్యపడెదరు. వారు కవులలో ఋషులు; ఋషులలో
కవులు. వారి బ్రతుకు సకలమ్ము ఒక మహాకావ్యము, లోకైక సందేశమయము.

తుమ్మల మరణవార్త మర్నాడు దేశమంతా తెలిసింది.
కేంద్ర, రాష్ట్ర మంత్రులు, పండితులు, కవులు, సాహితీ ప్రియులు ---

యుగధర్మమెరిగి యుగానుకూలమైన కవితను సృజించిన 20వ శతాబ్ది యుగకవి;
21వ శతాబ్ది యుగకర్త శ్రీ తుమ్మల సీతారామమూర్తి-
గాంధీ ధర్మమునకు తమ కవితను, జీవితమును అంకితముగావించుకొని
మహాత్ముని ఆస్థానకవిగా శాశ్వత కీర్తిగాంచిన గాంధీకవి-
దేశ స్వాతంత్ర్యసాధనకై వీరగీతములు పాడిన జాతీయకవి-
రాష్ట్రసిద్ధికొరకు రక్తమ్ముగార్చి, జాతి గౌరవమును నిల్పిన రాష్ట్రకవి-
కల్లకపటులేని పల్లెలో పుట్టి, పల్లెల సేవించి, ప్రజలపలుకు గుట్టెరిగి,

పసగలరచనలు చేసిన దేశికవి-
అంతరించుచున్న ప్రాచీనకవితాశిల్పమునకు ఆధునికవిప్లవభావములను జోడించి పద్యమునకు నూతన జవమును, జీవమును కలిగించిన నవయుగమహాకవి-
ప్రజాహృదినెరిగి జాతిజీవనములో కలసిపోవు కవితను వ్రాసిన అసలుసిసలైన ప్రజాకవి-
ప్రజలబాధ తమబాధగా భావించిన అచ్చమైన సామాజికవిప్లవకవి-
అన్ని సిద్ధాంతములలోని సత్యమును గ్రహించి, సమసమాజ నిర్మాణమునకు నవ్యభవ్య కవితాసృష్టి చేసిన సర్వోదయకవి-
కళకొరకే కవిత్వమని గంతులువేయక జాతిపెంపువలచి విశ్వజనీన కావ్యములు వ్రాసిన ఉత్తమకవి-
విశ్వమానవకల్యాణమును కామించిన విశ్వకవి-
కాసులకు నాసచేయక తమ కృతులను వరణీయకథాభాసురులకు అంకితముచేసిన ఆదర్శకవి-
జాతికి తీరుతెన్నులను చూపిన నిత్యవైతాళికుడు-
బడలిబడలి తల్లిబాసకూడెము చేసి తెనుగుతోటను మూడుపూవులకు ఆరుకాయలు అందించిన తెనుగులెంక- కాదు తెనుగువస్తాదు-
దారులువేరైనను అన్ని వర్గములవారిని ప్రేమించిన అజాతశత్రువు-
అవార్డులు, పదవులు ఆశించని నిష్కామకర్మయోగి-
కనకాభిషేకాది ఘనసన్మానములు జరిగినను అహంకారమెరుగని వినయశీలి.
మచ్చమసకలేని మనుగడ సాగించిన మహామనీషి
జాతిపెంపువలచి జీవితమంతయు సాహితీ సేవకె ముడుపుగట్టిన ధన్యజీవి
కళాప్రపూర్ణుడు అభినవతిక్కన శ్రీ తుమ్మల సీతారామమూర్తి --- అని నివాళులు అర్పించారు.

# జాతి గర్వించదగ్గ మహాకవి

"సర్వతంత్ర స్వతంత్రుడౌ సత్కవీంద్రు డెన్నడో కల్పమున కొక్కడే లభించు" - తెనుఁగులెంక, అభినవతిక్కన, గాంధి ఆస్థానకవియైన తుమ్మలసీతారామమూర్తిగారు తెలుగుజాతికి, సాహిత్యమునకు 20వశతాబ్దమునందు లభించిన అపూర్వమైనకానుక. వారు కవితాహిమాలయము; పాండితీ మేరునగము, వారు ప్రతిభావంతులేగాదు, వ్యుత్పన్నులు కూడ. వారు ఆకారములో ఆంధ్రుడు; ధర్మములో భారతీయుడు; భావములో విశ్వమానవుడు. వారు ధర్మసంరక్షణార్థము కవితలల్లిన ఋషితుల్యులు. వారు ప్రాతక్రొత్తలవేలుకలయిక. ఆధునికాంధ్రసాహితీజగత్తులో వారు యుగధర్మమునుగుర్తించి, స్వతంత్రమార్గమున పయనించి, యుగకవితను సృష్టించిన యుగకవులు, వారి కవితలో యుగధర్మమును విశ్వరూపమున గాంచగలము. వారు కవిత్వమును సమాజసేవాసాధనముగా భావించి, "సామాజిక కల్యాణము కామించెద నవ్యభవ్యకవితా సృష్టిన్" అని ప్రకటించి, వారు రాజకీయ, మత, సాంఘిక, ఆర్థిక,నైతిక విలువలపరిరక్షణకొరకు చైతన్యవంతమైన కవితను సృజించిన సాహితీప్రవక్తలు. వారు ఆంధ్రావళిమోదముకొరకు జగద్ధితమైనకవితను కళాన్వితముగ గానముచేసినారు. వారి కవిత వ్యవస్థలన్నింటికి సంగమస్థలము, సమధర్మము సహజధర్మమని నమ్మి, సమకాలీన సమస్యలను స్వీకరించి, వాటికి పరిష్కారమార్గములను సూచించుటయేగాక, సార్వకాలీనత నిచ్చినారు. వారి కవితాశయము ఆంధ్రులఅభ్యుదయము, భారతీయులప్రగతి, సమగ్రతలు, మానవజాతి కల్యాణములు. సంప్రదాయము, సర్వోదయము, సార్వజనీనత, సౌందర్యము, సౌలభ్యములు వారి కవితాలక్షణములు. "కవిత్వమంటే ఇదీ కవిత్వము" అన్నట్లుగా వారికవితయుండును. వారి కవితకు గాంధిధర్మము పట్టుగొమ్మ. గాంధేయ సిద్ధాంతములు భారతీయధర్మస్వరూపములని, సర్వోదయసిద్ధాంతములు విశ్వమానవకల్యాణకారకములని వారు విశ్వసించినారు. వారి రచనలు సత్యం శివం సుందరం అనుధర్మములకు నెలవులు. వారి కవితలో మానవతాపరిమళములు వెదజల్లు విశ్వసంస్కృతి కలదు; అది మానవుని సంస్కారవంతునిగా జేసి, సమాజమును ఉన్నతీకరించును.వారి కవితలో జాతిజీవనము సర్వతోముఖముగ ప్రతిబింబించుచుండును. వారి ప్రతిపద్యమునందు సాంఘికస్పృహ కలదు; అంతే గాదు తెలుగుకవితా సొగసులపరిమళములు గుబాళించు చుండును. వారి కవిత వంద సం॥లభారతదేశ చరిత్రకు దర్పణము. వారు జన్మించినది 1901; మరణించినది 1990. ఆధునిక యుగలక్షణములన్నియు వారి కవితలో గాంచగలము. అందువలన వారి కావ్యములు ఆంధ్రుల, భారతీయుల నవయుగ హృదయస్పందనలకు రమణీయమైన అక్షరరూపములు. నవీనాంధ్ర సాహిత్య చరిత్రలో 20వ శతాబ్దమును "తుమ్మలయుగము" అని పేర్కొనవచ్చును. వారి కవిత పాఠకులకు భావప్రసన్నతను, హృదయవికాసమును, ఆనంద పారవశ్యమును, మానసిక ప్రశాంతతను కలిగించును. త్యాగరాజు సంగీతము, తుమ్మలసాహిత్యము ఒకే కోవకు చెందినవి. అనగా అవి వినినకొలది ఇంకను వినవలెననియు, చదివినకొలది మరలమరల చదువవలెనననియు అనిపించును. అవే నిజమైన కళలు; అజరామరమైనవి. వారిద్దరి సంగీత సాహిత్యములు రసికలోకపు తఱుగనిసిరులు.

తుమ్మలవారు కవిగా ఎంత ఉన్నతులో, వ్యక్తిగా అంతకంటే ఉన్నతులు. వారి జీవితమే ఒక సందేశము. వారు జీవించిన కాలమునందు జీవించుటే మహాభాగ్యమని సమకాలికులు భావించిరనిన అతిశయోక్తిగాదు. విశ్వజనీనమైన యుగకవితను సృష్టించిన, ఆదర్శవంతమైన జీవితమునుగడపిన మహాకవి 20వ శతాబ్దమునందు తుమ్మలవారు గాక మరొకరులేరనుట తెగువగాదు. తుమ్మలవారు "నా అమూల్యసంపద, నా గౌరవపతాక" అని జాతి గర్వించదగిన విశిష్టమైన మహాకవులు "తుమ్మల20వ శతాబ్ధియుగకవి; 21వ శతాబ్దపు యుగకర్త."